www.andhrajyothi.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 23-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 338 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 7.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుబ్బ పూర్తి; వర్జ్యం: మ. 1.31-3.19; దుర్ముహూర్తం: ఉ. 6.21-7.57; అమృతఘడియలు: రా. 12.21-2.09; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పాత-కొత్త కలయిక!

13 లోక్‌సభ, 11 అసెంబ్లీ అభ్యర్థులతో టీడీపీ మూడో జాబితా

ఇద్దరు సిటింగ్ ఎంపీలకు చాన్సు.. శ్రీకాకుళంలో రామ్మోహన్.. నరసరావుపేటలో లావు


నెల్లూరు బరిలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి.. బాపట్లకు మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్

చిత్తూరులో మాజీ ఐఆర్ఎస్ దగ్గుమళ్ల.. కేశినేని చిన్నికే విజయవాడ.. గుంటూరులో పెమ్మసాని

అసెంబ్లీ సీట్లలో చాలావరకు పాతవారే.. సర్వేపల్లి టికెట్ సోమిరెడ్డికే.. బోడె ప్రసాద్‌కు పెనమలూరు 11

"బాలూ.. నాకు పదిహేను నిమిషాలు ఈ స్టేషన్ కావాలి. ప్రతి దానికీ ఒక రేటు ఉంటుంది కొనేయ్. స్టేషన్ మాస్టర్‌ను రిక్వెస్ట్ చేయండి. ఒప్పుకోక పోతే బెదిరించండి. నాకు ఈ మీటింగ్ చాలా ఇంపార్టెంట్!"

..'అత్తారింటికి దారేది' సినిమా క్లైమాక్స్‌లో డైలాగులు ఇవి! ఇప్పుడు... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కూడా తన అధికారం 'క్లైమాక్స్'కొచ్చినట్లు అనిపిస్తున్నట్లుంది! ఓటమి భయం వెంటాడుతున్నట్లుంది! అందుకే... 'ఈ ఎన్నికలు నాకు చాలా ఇంపార్టెంట్. మీ రేటెంతో చెప్పండి' అంటూ ఖాకీ దుస్తులకు వెల కడుతున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.



ఖాకీలకు 'క్యాష్' ప్యాకేజీ!

నలుగురు ఐపీఎస్‌లు ఇప్పటికే 'సోల్డ్ ఔట్'

ఎంతైనా ఇస్తాం.. ఎవరినైనా కొనేయండి

ఇతరుల 'కొనుగోలు' బాధ్యతలు వారికే

స్థాయిని బట్టి బ్యాగులు, బండిల్స్, కరెన్సీ

ఈ ఎన్నికలు నాకు చాలా ఇంపార్టెంట్

అక్రమాలకు సహకరించే వాళ్లు కావాలి

తాడేపల్లి క్యాంప్ నుంచి సందేశం

కడప జిల్లాలో కానిస్టేబుల్ నుంచే బేరం

రాయలసీమ జిల్లాల్లో అత్యంత ఏకపక్షంగా పనిచేసే ఒక యువ ఐపీఎస్ అధికారిని ఇటీవల అప్రాధాన్య పోస్టులోకి పంపించారు. కానీ.. ఇదంతా వ్యూహాత్మకమే! 'విధుల్లో' భాగంగా ఆయన రాయలసీమతోపాటు నెల్లూరులోనూ చక్రం తిప్పవచ్చు. అలా ఆ జిల్లాల ఖాకీల 'కొనుగోలుకు' ఈ యువ ఐపీఎస్‌ను వాడుకుంటున్నట్లు తెలిసింది.

'సోల్డ్ ఔట్' అయిపోయిన మరో ఇద్దరు ఐపీఎస్‌లు జగన్ కోసం 'ఫర్ సేల్'కు సిద్ధమైన, నమ్మకస్తులైన ఐపీఎస్‌లకు గేలం వేస్తున్నారు. 'ఈ అమౌంట్ తీసుకో. నీకు కావాల్సినంత ఉంచుకో. మీ కింది వాళ్లకు ఇవ్వాల్సింది ఇచ్చేయ్. ఇంకా అవసరమైతే అరేంజ్ చేస్తాం" అంటూ బేరాలు మొదలుపెట్టినట్లు సమాచారం.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వై నాట్ 175' అనే డైలాగులు! 'సిద్ధం' అంటూ బీరాలు! బటన్ నొక్కుడు ప్రగల్భాలు! ఇవేవీ ఓట్లను రాల్చవనే భయంతో అడ్డగోలు ప్రలోభాలకు ఇప్పటికే తెరలేపారు. వలంటీర్లను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. అయినా సరే.. 'కూటమి' చేతిలో ఓటమి తప్పదనే అంచనాకు వచ్చారేమో! ఎన్నికల సమయంలో కీలకమైన పోలీసులను 'క్యాష్'తో కొట్టాలని వైసీపీ వ్యూహం రచించినట్లు తెలిసింది. ఎంపిక చేసిన కొన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు స్థాయిని బట్టి వారికి వెల కడుతున్నట్లు

మిగతా 2వ పేజీలో...

మద్యం స్కాంలో ప్రధాన సూత్రధారి

కేజ్రీవాలే

ముడుపులు డిమాండ్ చేసింది ఆయనే



శుక్రవారం కేజ్రీవాల్‌ను కోర్టుకు తరలిస్తున్న ఈడీ అధికారులు

రూ.45 కోట్లు గోవా ఎన్నికల్లో వాడినట్లు ఆధారాలున్నాయ్

కేజ్రీ తరఫున విజయ్ నాయర్ రూ.100 కోట్లు తీసుకున్నారు

కేబినెట్ ఆమోదించకముందే కవిత ఆడిటర్ బుచ్చిబాబు మొబైల్ ఫోన్‌లో మద్యం విధానం డాక్యుమెంట్ దొరికింది

కవితతో బేరం కుదిరిందని కేజ్రీవాల్ తనకు చెప్పినట్లు మద్యం వ్యాపారి మాగుంట శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు

చెన్నైలో ఎక్కడ, ఎలా ముట్టజెప్పారో రాఘవ తెలిపారు

నాయర్‌తో కలిసి పని చేయాలని కేజ్రీ చెప్పినట్లు శరత్‌రెడ్డి కూడా వాంగ్మూలం ఇచ్చారు.. కస్టడీ రిపోర్టులో ఈడీ

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యక్ష పాత్ర పోషించారు. మద్యం విధానంతో లబ్ధి పొందిన వారి నుంచి నేరుగా ఆయనే ముడుపులు డిమాండ్ చేశారు. లిక్కర్ వ్యాపారులు, వ్యక్తుల నుంచి ముడుపులు వసూలు చేశారు. సీఎం హోదాలో మద్యం కుంభకోణానికి ఆయనే ప్రధాన సూత్రధారి' అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పష్టం చేసింది. సౌత్ లాబీకి నాయకత్వం వహించిన కవిత తదితరులకు అక్రమంగా లాభాలు ఆర్జించిపెట్టేందుకు వీలుగా కేజ్రీ ఈ విధానాన్ని రూపొందించారని వివరించింది. ఢిల్లీ మద్యం స్కాంలో అరెస్టు చేసిన కేజ్రీవాల్‌ను ఈడీ శుక్రవారం ఢిల్లీలోని రౌజ్ ఎవెన్యూలో మనీలాండరింగ్ నిరోధక చట్టానికి సంబంధించిన ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టింది. ఆయనను పది రోజులపాటు

మిగతా 2వ పేజీలో...

కేజ్రీవాల్‌కు 6 రోజుల కస్టడీ

28 వరకూ విచారణకు అనుమతి

బలవంతంగా అప్రూవర్లుగా మార్చి ప్రకటనలు ఇప్పించారు

ఎన్నికలకు ముందే ఫలితాలను సాధించాలనుకుంటున్నారు

కేజ్రీవాల్ తరఫున బలంగా వాదించిన న్యాయవాది సింఘ్వి

జైలు నుంచే సర్కారును నడుపుతా!

స్పష్టంచేసిన కేజ్రీవాల్

సీఎంగా ఆయనే: ఆప్

కేజ్రీకి ఎంత చెప్పినా వినలేదు

మద్యం జోలికి వెళ్లొద్దంటే.. ప్రత్యేక విధానమే తెచ్చారు

ఫలితం అనుభవిస్తున్నారు: అన్నా హజారే

విపక్షాలపై దాడులు ఆపించండి

ఈసీకి విపక్ష నేతల వినతి

ఆర్టికల్ 324 కింద జోక్యం చేసుకోండి

2 రాష్ట్రాల సీఎంలను ఈడీ అరెస్టు చేసింది

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకే ఖాతాల ఫ్రీజ్

దారికాచి.. కంట్లో కారం కొట్టి!

గురువారం అర్ధరాత్రి దుర్గి గ్రామంలో జనసేన నేతలపై పిన్నెల్లి అనుచరుల దాడి

ప్రచారం చేసేంత మగాళ్లారా మీరు.. అంటూ కారుపై గొడ్డళ్లతో దాడి చేసిన రౌడీ షీటర్

పవన్ పార్టీ నేతలపై పిడిగుద్దుల వర్షం

దుర్గిలో ప్రచారం చేస్తే చంపుతామని బెదిరింపు

పోలీసుల ముందే చితకబాదినా పట్టని వైనం

ఎస్పీకి ఈసీ తలంటిన రోజే దారుణ ఘటన

ఎన్నికల్లో గెలుపునకు వైసీపీ హింస రచన

వైసీపీ పోస్టర్ల ఫొటోలు తీశారని..!

గన్నవరంలో టీడీపీ మహిళా నేతలపై ఎమ్మెల్యే వంశీ అనుచరుల వీరంగం

మాచర్లలో రెచ్చిపోయిన వైసీపీ రౌడీలు



మాచర్లలో వైసీపీ నేతల దాడిలో ధ్వంసమైన జనసేన నేతల వాహనం

గుంటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి), దుర్గి: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ రౌడీ మూకలు మరోసారి రెచ్చిపోయాయి. మూడు రోజుల కిందట మాచర్లలో టీడీపీ నేత సురేశ్ కారును తగలబెట్టిన రౌడీ మూకే తాజాగా జనసైనికులను లక్ష్యంగా చేసుకుని దాడికి తెగబడ్డారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మాచర్ల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తరఫున ప్రచారం

మిగతా 11వ పేజీలో...



కొకైన్ గుట్టు విప్పేద్దాం

శరవేగంగా సీబీఐ దర్యాప్తు

న్యాయాధికారి సమక్షంలో 960 బ్యాగుల నుంచి శాంపిల్స్ సేకరణ

కంటెయినర్ వేరే ప్రాంతానికి తరలింపు

కాకినాడ సంధ్యా ఆక్వాలో సోదాలు

మూలపేట, వజ్రకూటం బ్రాంచ్‌లలోనూ..

సీబీఐకి అడ్డు పడలేదట!

కొకైన్ కేసుపై విశాఖ సీపీ వివరణ

డాగ్ స్క్వాడ్‌ను పంపాలని కోరితే పోలీస్ పెద్దలు ఎందుకు వెళ్లినట్టో?

'సంధ్య' కుటుంబమంతా వైసీపీలోనే..!

యజమాని వీరభద్రరావు, సీఈఓ కోటయ్యలకు విజయసాయిరెడ్డితో సాన్నిహిత్యం

ఇంకొందరు వైసీపీ ప్రముఖులతో కూడా..

12



బీజేపీకి 466 కోట్లు.. ఎవరిచ్చారో తెలీదు!

SBI

ఎస్‌బీఐ ఈసీకి ఇచ్చిన రెండు జాబితాల్లో తేడాలు

కొనుగోలుదారుల జాబితాలో 18,871 ఎంట్రీలు

రాజకీయ పార్టీల జాబితాలో 20,421 ఎంట్రీలు

2 జాబితాల్లోనూ సరిపోలినవి 18,741 బాండ్లు

జారీచేసిన మొత్తం బాండ్లు రూ.12,769 కోట్లు

సరిపోలిన బాండ్ల విలువ 12,145.88 కోట్లు

తేడా 623 కోట్లు.. వాటిలో అత్యధికం బీజేపీకే

2



ఇస్రో 'పుష్పక్' పరీక్ష విజయవంతం

సురక్షితంగా దిగిన ఆర్‌వీఎల్ ఎల్ఈఎక్స్-02

అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో ముందడుగు

2

విరుధునగర్ బరిలో నటి రాధిక



విజయకాంత్ కుమారుడిపై పోటీ చేయనున్న రాధిక

14 మందితో బీజేపీ జాబితా విడుదల

11

ఖాకీలకు 'క్యాష్' ప్యాకేజీ!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. "జిల్లా అధికారులకు బ్యాగుల్లో పంపండి. కింది స్థాయి అధికారులకు బండిల్స్ ఇవ్వండి. డబ్బు తీసుకోని వాళ్లకు ఏదో ఒకటి ఇచ్చేయండి. కలుస్తామని మెసేజ్ పెట్టండి. కలిసిన తర్వాత రిక్వెస్ట్ చేయండి. ఎందుకంటే... నాకు ఈ ఎన్నికలు చాలా ఇంపార్టెంట్ అనే సందేశాలు పంపుతున్నట్లు సమాచారం! 'ఖాకీ'ని ఖాకీలతోనే కొనాలి అన్నట్లుగా... ఈ ప్యాకేజీ బాధ్యతలను తమకు అత్యంత సన్నిహితులైన నలుగురు ఐపీఎస్ అధికారులకు అప్పగించినట్లు తెలిసింది. "మీరు ఇంత తీసుకోండి. ఇంకా ఎన్ని కోట్లయినా తీసుకెళ్లండి. ఇతర అధికారులూ మనకు ఎన్నికల్లో అడ్డగోలుగా సహకరించాలి. వారికి ఏం కావాలో అడగండి... మేం ఇచ్చేస్తాం" అని చెప్పినట్లు సమాచారం. ఉన్నతస్థాయి బ్యూరోక్రాట్లలో ఇప్పుడు ఇదే పెద్ద టాపిక్. ఇది నిజమేనా? అంటూ ఒకరినొకరు ఆరా తీసుకునే క్రమంలో... 'సోల్డ్ ఔట్' ఆఫీసర్ల పేర్లు బయటికి వస్తున్నాయి.

నలుగురు ఐపీఎస్‌లే కీలకం...

అధికారంలోకి వచ్చేందుకు 2019లో వైసీపీ చెయ్యని అరాచకం లేదు. కోడికత్తి నుంచి బాబాయ్ హత్యదాకా... ప్రతిదానినీ రాజకీయానికి వాడుకున్నారు. అలివి కాని హామీలిచ్చి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. చాలా త్వరగానే జగన్ ముసుగు తొలిగింది. 'బటన్ నొక్కుడు' తప్ప చెప్పుకోడానికేమీ లేకుండా పోయింది. జాతీయ స్థాయిలో విశ్వసనీయత కలిగిన సంస్థల సర్వేల ఫలితాలన్నీ వైసీపీ ఓటమి తథ్యమని చెబుతున్నాయి. దీంతో... తాడేపల్లి శిబిరం సకల కుయుక్తులకు తెరలేపుతోంది. అందులో ఒకటే... ఖాకీల కొనుగోలు! పోలీసు ఉన్నత స్థాయి వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం... ఐదేళ్లలో వైసీపీ చట్టాన్ని అమలు చేసిన కొందరు ఐపీఎస్‌లకు కీలకమైన బాధ్యతలు అప్పగించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వారిని వేర్వేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు వేర్వేరుగా పిలిపించారు. "అన్నా మీ సపోర్ట్ నాకు కావాలి. మీకు ఎంత కావాలన్నా ఇస్తా. అలాగే... ఎవరినైనా కొనేయండి. మన కోసం పనిచేయాలి. అవసరమైతే మరింత ఇచ్చేందుకు రెడీ. నేను ఇక్కడుంటేనే మీరూ బాగుంటారు" అని చెప్పినట్లు సమాచారం. వీరికి సొంతంగా భారీగా మొత్తం ఇచ్చారు. ఇక... ఇతర అధికారులు, సిబ్బందిని కొనేందుకు అవసరమైన డబ్బునూ సమకూర్చారు. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం, అక్రమాలకు సహకరించడం, చూసీ చూడనట్లు వ్యవహరించడం.... ఇదీ 'ప్యాకేజీ'! చేతికి అందిన సొమ్ముతో ఒక ఐపీఎస్ అధికారి హైదరాబాద్‌లో ఖరీదైన ప్రాంతంలో.. ఇల్లు కొనేందుకు బేరాలు మొదలుపెట్టినట్లు తెలిసింది. లగ్జరీ కారుకూ అడ్వాన్సు ఇచ్చినట్లు సమాచారం.

కడప జిల్లాకు భారీ మొత్తం..

ఖాకీల కొనుగోలు స్కీమ్‌లో ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపకు భారీ మొత్తం కేటాయించినట్లు తెలిసింది. సొంతగడ్డపై ఎదురుగాలి వీస్తుండటమే దీనికి కారణం. వివేకా హత్య కేసులో అసలు వాస్తవాలు వెలుగు చూడటంతో పులివెందుల జనంలోనే వైసీపీ అంటే ఏవగింపు మొదలైంది. వివేకా కుమార్తె సునీతా రెడ్డి న్యాయ పోరాటం తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇక... సొంత చెల్లెలు షర్మిల పీసీసీ చీఫ్ హోదాలో అన్నపై యుద్ధం ప్రకటించారు. కడప ఎంపీ బరిలో షర్మిల లేదా వివేకా సతీమణి సౌభాగ్యమ్మ బరిలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పులివెందులలో టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి రూపంలో జగన్‌కు బలమైన పోటీ కనిపిస్తోంది. వీటన్నింటి నేపథ్యంలో అసలుకే మోసం తప్పదనే భయం వైసీపీని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో కడపలో గరిష్ఠ స్థాయిలో ఎన్నికల అక్రమాలకు పాల్పడేలా, అందుకు పోలీసులు సహకరించేలా వ్యూహం రచించినట్లు సమాచారం. కానిస్టేబుల్ స్థాయిలో పదివేలు, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐకి పాతిక వేలు, ఎస్ఐకి రెండు మూడు లక్షలు, సీఐకి ఐదు లక్షలు, డీఎస్పీకి పదిలక్షలకు పైనే! ఇలా అక్రమాలకు సహకరించే పోలీసు అధికారులకు ప్యాకేజీలు ఇస్తున్నట్లు సమాచారం.

అరెస్టుకు ముందు ఈడీ కారణాలు చెప్పాల్సిందే: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 22: ఈడీ ఎవరినైనా అరెస్టు చేసే ముందు అందుకుగల కారణాలను స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్న, సమన్లకు స్పందించలేదన్న కారణాలతో నిందితుల్ని అరెస్టు చేయకూడదని స్పష్టం చేసింది. గతంలో దీనిపై సరిగ్గానే తీర్పు ఇచ్చామని, అందులో ఎలాంటి తప్పులు లేవని తెలిపింది. గత తీర్పును సమీక్షించాలంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన వినతిని తిరస్కరించింది. కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం తమ ఛాంబర్‌లోనే విచారణ జరిపి ఆర్డర్లు ఇచ్చింది.

బ్యాంకు ఖాతాల స్తంభనపై కాంగ్రెస్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. తమ అకౌంట్లను ఐటీ శాఖ ఫ్రీజ్ చేయడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలకు సంబంధించి ఐటీ అధికారులు తమపై ప్రారంభించిన టాక్స్ రీఅసెస్మెంట్ ప్రొసీడింగ్స్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 20న తీర్పును రిజర్వు చేసింది.

ఇస్రో పుష్పక్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, మార్చి 22: అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో భాగంగా ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను తిరిగి భూమి మీదికి తీసుకొచ్చే ప్రక్రియలో ఇస్రో కీలక ముందడుగు వేసింది. దీనికోసం అభివృద్ధి చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికిల్ (ఆర్ఎల్‌వీ) ఎల్ఈఎక్స్-02 స్వయంగా ల్యాండయ్యే పరీక్షను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది.

మద్యం స్కాంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలే

(మొదటి పేజీ తరువాయి)


కేజ్రీవాల్

కస్టడీలో ఇంటరాగేషన్ చేయడానికి అనుమతించాలని కోరింది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 50 కింద ఎన్నిసార్లు సమన్లు పంపినా హాజరు కాకుండా ఆయన తప్పించుకుంటున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 3 కింద ఆయన నేరానికి పాల్పడ్డారని ధ్రువీకరించింది. ఈ మేరకు 32 పేజీల దరఖాస్తు (కస్టడీ రిపోర్ట్)ను సమర్పించింది. "ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి నాయకుడు కేజ్రీవాల్ మాత్రమే. కీలక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటారు. మద్యం విధానంతో ప్రయోజనాలు పొందిన వారి నుంచి ముడుపులు నేరుగా ఆయనే డిమాండ్ చేశారు. తద్వారా వచ్చిన రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయి" అని తెలిపింది. ఈడీ దరఖాస్తులోని మరిన్ని వివరాలు..

నా జీవితం దేశానికే అంకితం

తన జీవితం దేశానికే అంకితమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన శుక్రవారం ఈడీ కార్యాలయం వద్ద తనకు ఎదురైన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాను జైలులో ఉన్నా, వెలుపల ఉన్నా తన జీవితం దేశానికే అంకితమని వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీ మద్యం కుంభకోణానికి కేజ్రీవాలే ప్రధాన సూత్రధారి. అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ నేత విజయ్ నాయర్, ఇతర మంత్రులతో కలిసి ఆయన కుట్ర పన్నారు. కొందరికి అక్రమ ప్రయోజనాలు సమకూర్చేందుకు వీలుగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారు. మంత్రివర్గం (జీవోఎం) ఆమోదించాల్సిన మద్యం విధానాన్ని రూపొందించేందుకు అవసరమైన 30 పేజీల డాక్యుమెంట్‌ను కేజ్రీవాల్ నివాసంలో సిసోడియా తనకు ఇచ్చారని సిసోడియా కార్యదర్శి అరవింద్ చెప్పారు. హోల్‌సేల్ వ్యాపారం మార్జిన్‌ను 12 శాతం మేరకు నిర్ణయించింది ఇందులోనే. కానీ, ఈ నివేదికపై జీవోఎం సమావేశాల్లో ఎప్పుడూ చర్చించలేదు.

కేజ్రీవాల్, సిసోడియాతో విజయ్ నాయర్ నేరుగా చర్చించేవారు. ఆయన ఆప్ తరఫున దళారీగా వ్యవహరించారు. అధికారిక హోదా లేకపోయినా కేజ్రీవాల్ ఇంటి సమీపంలోని ఓ క్యాబినెట్ మంత్రి బంగళాలో నివసించారు. సౌత్ లాబీ యజమానులైన కవిత, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట రాఘవ, శరత్ రెడ్డిల నుంచి రూ.100 కోట్ల ముడుపులను విజయ్ నాయరే స్వీకరించారు. మంత్రి మండలి ఆమోదించక ముందే బుచ్చిబాబు మొబైల్ ఫోన్‌లో మద్యం విధానం కాపీ దొరికింది. నాయర్‌తో జరిపిన సంభాషణలు కూడా లభ్యమయ్యాయి.

అభిషేక్ బోయినపల్లి రూ.100 కోట్లను విజయ్ నాయర్‌కు, ఆయన సహచరులకు రకరకాల పద్ధతుల్లో బదిలీ చేశారు. బదులుగా సౌత్ లాబీకి ఇండో స్పిరిట్ హోల్‌సేల్ వ్యాపారం, కొన్ని రిటైల్ షాపులు, పెర్నార్డ్ వ్యాపారం, ఎల్ వన్ లైసెన్స్ లభించాయి.

సౌత్ లాబీ నుంచి కేజ్రీవాల్ ముడుపులు డిమాండ్ చేసినట్లు పలు ఆధారాలు లభించాయి. ప్రముఖ మద్యం వ్యాపారి మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇచ్చిన ప్రకటన ఇందుకు సాక్ష్యం. సీఎం కార్యాలయంలో ఆయన కేజ్రీవాల్‌తో సమావేశమయ్యారు. కవితతో రూ.100 కోట్ల మేరకు ముడుపులకు బేరం కుదిరినట్లు కేజ్రీవాల్ తనకు చెప్పారని మాగుంట తెలిపారు. ఆయన సలహా మేరకు తాను కవితను కలిశానని చెప్పారు. అప్పుడే ఆమె రూ.50 కోట్లు చెల్లించాలని తనను కోరారని, తన కుమారుడు రాఘవ కవిత మనుషులు అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబులకు రూ.25 కోట్లు ముట్టచెప్పారని శ్రీనివాసులు రెడ్డి చెప్పారని వివరించింది. రాఘవ మాగుంట కూడా ఈ విషయాలను ధ్రువీకరించారు. ఇక అరబిందో సంస్థ యజమాని శరత్ రెడ్డి కూడా తాను అరుణ్ పిళ్లై, విజయ్ నాయర్ ద్వారా కేజ్రీవాల్‌ను కలిసిన తీరును వివరించారు. నాయర్‌తో కలిసి పని చేయాలని కేజ్రీవాల్ తనకు చెప్పారని ఈడీకి వివరించారు.

గోవాలో ఎన్నికల కోసం రూ.45 కోట్లను ఎలా మళ్లించారో, ఎవరెవరి ద్వారా మళ్లించారో, ఎంతమందికి చెల్లించారో మనీశ్ సిసోడియా సన్నిహిత సహచరుడు దినేశ్ అరోరా ప్రకటనతో తెలిసింది. అభిషేక్ బోయినపల్లితో కలిసి హవాలా ద్వారా విజయ్ నాయర్ రూ.31 కోట్లు మళ్లించిన వివరాలు లభ్యమయ్యాయి. వినోద్ చౌహాన్ అనే వ్యక్తికి కవిత పీఏ అశోక్ కౌశిక్‌కు మధ్య ఉన్న సంబంధాలు, దినేశ్ అరోరా ఇంటి నుంచి వినోద్ చౌహాన్ ఇంటికి డబ్బు సంచులను మోసిన వివరాలను కూడా ఈడీ వెల్లడించింది.


ఆరు రోజుల కస్టడీకి కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆరు రోజుల ఈడీ కస్టడీకి అప్పగిస్తూ మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు జడ్జి కావేరి బవేజా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కేజ్రీవాల్‌ను తమకు పది రోజులపాటు కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరింది. ఈ అంశంపై ఈడీ, కేజ్రీవాల్ తరఫు న్యాయవాదుల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగిన తర్వాత ఈనెల 28 వరకు ఆయనను విచారించేందుకు జడ్జి అనుమతి ఇచ్చారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రౌజ్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలేనని, రూ.100 కోట్ల మేర ముడుపులను తీసుకోవడంలో ఆయనే ప్రధాన పాత్ర పోషించారని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ రాజు వాదించారు. కేజ్రీవాల్ సరైన వాస్తవాలు వెల్లడించలేదని, డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లిందో ఆయన నుంచి రాబట్టాల్సి ఉందని తెలిపారు. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 19 కింద ఒక వ్యక్తిని అరెస్టు చేయాలంటే నేరం చేసినట్లు రుజువు చేయాలని, ఇంతవరకూ ఈడీ ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యం సమర్పించలేదని కేజ్రీ తరఫు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, విక్రం చౌదరి, రమేశ్ గుప్తా వాదించారు. 'కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్షులు ముందుగా ఎలాంటి వివరాలు చెప్పలేదు. అరెస్టు చేసి.. బెయిల్ నిరాకరించిన తర్వాతే వారు ప్రకటనలు చేశారు. వారిని బలవంతంగా అప్రూవర్లుగా మార్చారు. దేశ చరిత్రలో ఇలా ఒక సీఎంను అరెస్టు చేయడం ఇదే ప్రథమం. ఇప్పటి వరకు నలుగురు ఆప్ అగ్ర నేతలను అరెస్టు చేశారు. ఎన్నికలు జరగకముందే ఫలితాలను సాధించాలని అనుకుంటున్నారు" అని సింఘ్వీ వాదించారు. దేశంలో నేర న్యాయ వ్యవస్థ ప్రమాదంలో పడిందని, అధికారాలున్నంత మాత్రాన అరెస్టు చేయకూడదని అన్నారు.

జైలు నుంచే సర్కారును నడుపుతా!

న్యూఢిల్లీ, మార్చి 22: సీఎం పదవికి రాజీనామా చేయబోనని, అవసరమైతే జైలు నుంచే ప్రభుత్వాన్ని నడుపుతానని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టైన కేజ్రీవాల్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ఈడీ కస్టడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో తమ ప్రతినిధితో కేజ్రీవాల్ మాట్లాడుతూ, 'జైల్లో ఉన్నా, బయట ఉన్నా అక్కడి నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తా' అని చెప్పారని ఇండియాటుడే టీవీ ఛానల్ వెల్లడించింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	38.5	25.0
నంద్యాల	38.0	24.0
అనంతపురం	38.0	25.0
తిరుపతి	37.2	23.2
ఏలూరు	37.0	22.0
విజయవాడ	36.3	23.4

కేజ్రీవాల్ తప్పు చేశారు.. అనుభవిస్తున్నారు

న్యూఢిల్లీ, మార్చి 22: చేసిన తప్పులకు కేజ్రీవాల్ ఫలితం అనుభవిస్తున్నారని, మద్యం వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆయనను మరీమరీ హెచ్చరించినా పట్టించుకోలేదని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్యానించారు. అసలేమీ జరగకుంటే అరెస్టు చేసేంతటి పరిస్థితి వచ్చేది కాదు కదా? అని అన్నారు. మహారాష్ట్రలోని స్వగ్రామం రాలెగావ్ సిద్ధిలో 86 ఏళ్ల హజారే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మద్యం జోలికి వెళ్లొద్దంటే.. సంపాదనకు ఆశపడి ఏకంగా ప్రత్యేక విధానమే తెచ్చారని కేజ్రీని విమర్శించారు. 2011 నాటి అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారే, కేజ్రీవాల్ కలిసి పనిచేసిన సంగతి తెలిసిందే. ఒకనాటి తన సహచరుడు అరెస్టు కావడం పట్ల హజారే విచారం వ్యక్తం చేశారు. కాగా, అధికారంలో ఉంటే దురాశ కమ్మేస్తుందని స్పష్టమైందని, అధికారం అవినీతిపరులను చేస్తుందని సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సంతోష్ హెగ్డే తెలిపారు.

ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని ఆదేశించండి

» ఎన్నికల కమిషన్‌కు విపక్ష నేతల వినతి


సీఈసీ రాజీవ్‌కుమార్‌ను కలిసిన అనంతరం 'ఇండియా' నేతలు

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ప్రతిపక్షాలు ఐక్య కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఆర్టికల్ 324 కింద విశేషాధికారాల్ని ఉపయోగించుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) జోక్యం చేసుకుని ప్రతిపక్షాలపై దాడులను ఆపాలని ఆదేశించాలని కోరాయి. ఈ మేరకు కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం నేత సీతారాం ఏచూరి సహా పలువురు ఇండియా కూటమి నేతలు శుక్రవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. "ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని, వాటి గొంతు నొక్కేందుకు కేంద్ర ఏజెన్సీలను బీజేపీ విచ్చలవిడిగా వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. దీంతో దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు విఘాతం కలుగుతోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. అంతకుముందు అప్పటి ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. వారిని అరెస్టు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు తృణమూల్, ఆర్జేడీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలపై ఈడీ దాడులు చేసి కొందరిని అరెస్టు కూడా చేసింది. గతంలో ఎన్నడూ ప్రతిపక్షాలపై ఇంత దారుణంగా ఏజెన్సీలను దుర్వినియోగపరచడం చూడలేదు" అని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కేజ్రీవాల్ సతీమణికి రాహుల్ పరామర్శ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. తమ సంఘీభావాన్ని తెలిపారు. ఇండియా కూటమి బలాన్ని చూసి ప్రధాని మోదీ భయపడిపోతున్నారని.. అందుకే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ పరిణామాలు కూటమిని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రులను కుట్రపూరితంగా అరెస్టు చేస్తున్నారని, బీజేపీతో చేతులు కలిపిన నేతలపై ఉన్న కేసులను మాత్రం ఉపేక్షిస్తున్నారని మమత మండిపడ్డారు. కేజ్రీవాల్ అరెస్టును చట్ట విరుద్ధమైన చర్యగా సీపీఎం, సీపీఐ అభివర్ణించాయి. ఇదిలా ఉండగా, దేశంలోని వివిధ ప్రాంతాల రాజకీయ పార్టీలు, భావజాలాలకు చెందిన ఓబీసీ నేతలు ఓబీసీ ఘట్‌బంధన్ పేరుతో కూటమిగా ఏర్పడి ఇండియా కూటమికి ఈ ఎన్నికల్లో మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో పాటు రాహుల్‌ను కలిశాయి.

ఇదేంతీరు వలంటీరూ!

» వేటు పడుతున్నా వైసీపీ సేవలోనే..

» గుంటూరు సిటీలో 12 మంది తొలగింపు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)


తాడిపత్రి ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్ రెడ్డి ప్రచారంలో వలంటీర్ రామాంజనేయులు

వేటు దారి వేటుదే.. వలంటీర్ల దారి వలంటీర్లదే అన్నట్టు రాష్ట్రంలో కోడ్ ఉల్లంఘనల తీరు తయారైంది. ఎన్నికలకు దూరంగా ఉండాలన్న ఈసీ ఆదేశాన్ని బాహాటంగానే వలంటీర్లు బేఖాతరు చేస్తున్నారు. అనంతపురం జిల్లా యాడికి మండలం కూర్మాజీపేటలో తాడిపత్రి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి తరఫున ఆయన తనయుడు హర్షవర్ధన్ రెడ్డి నిర్వహించిన ప్రచారంలో ఇద్దరు గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ వెంట వలంటీర్లు తిరుపాల్‌రెడ్డి, దాదాపీర్, యానిమేటర్ బాలక్రిష్ణారెడ్డి ఇంటింటికీ తిరిగారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని జీవీఎంసీ 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి దాదాపు 20మంది వలంటీర్లతో సమావేశమయ్యారు. విషయాన్ని తెలుసుకుని టీడీపీ, జనసేన నాయకులు తదితరులు అక్కడకు వచ్చారు. వారిని చూడగానే వలంటీర్లు అక్కడనుంచి జారుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో గంగాధర్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డి అనే ఇద్దరు వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు. వీరిద్దరు కణేకల్లు మండల కేంద్రంలో నిర్వహించిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఓబుళదేవరచెరువు మండలం తుమ్మల కుంట్లపల్లికి చెందిన వలంటీర్లు అనిల్‌కుమార్, మంజుల, సుబ్బరామయ్యను విధులనుంచి తొలగించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించిన వలంటీర్లు బి.కుళ్లాయమ్మ, ఎస్.అబ్బాస్, డి.మహమ్మద్ రఫీని విధుల నుంచి తొలగించారు. తాడిపత్రి నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు తాడిపత్రి మున్సిపల్ కార్యాలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మునీర్‌ను విధుల నుంచి తొలగించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరంలో జరిగిన వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ కోలా వీరబాబు, ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 12 మంది వలంటీర్లను, ఇద్దరూ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి విధుల నుంచి తప్పించారు. వీరంతా ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బాలసాని కిరణ్‌కుమార్ ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మశ్రీ భార్య కారులో చీరలు స్వాధీనం


పట్టుబడిన చీరలు, తనిఖీల సందర్భంగా అక్కడ ఉన్న విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య

చోడవరం, ద్వారకాతిరుమల, మార్చి 22: అనకాపల్లి జిల్లా చోడవరంలో ఓటర్లకు పంచేందుకు వైసీపీ నేతలు తీసుకువెళుతున్న చీరలను శుక్రవారం ఎలక్షన్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ భార్య ఒక వాహనంలో, జెడ్పీటీసీ సభ్యురాలు మారిశెట్టి విజయ భర్త శ్రీకాంత్ తదితరులు మరో వాహనంలో శుక్రవారం ఉదయం ఓ వ్యాపారి ఇంటికి బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి డి.సురేఖ, ఇతర సిబ్బంది...వైసీపీ నేతల వాహనాలను అడ్డుకుని తనిఖీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ కారులోని 46 చీరలు, 3 లంగా ఓణీలను స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకే చీరలు తీసుకెళుతున్నారని ఆ పట్టణ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.


గుంటూరు మిర్చియార్డులో వైసీపీ నేతల ఎన్నికల ప్రచారం


ద్వారకాతిరుమల కేశఖండనశాలలో సిద్ధం కరపత్రాలు చూపుతున్న నాయీబ్రాహ్మణులు

ఆలయాన్నీ వదలని ప్రచార యావ

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ టీటీడీ బోర్డు సభ్యుడు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సిద్దవటం యానాదయ్య ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ కేశ ఖండన శాలలో వైసీపీకి ఓటు వేయాలని శుక్రవారం ప్రచారం చేశారు. 'జగనన్నకు తోడుగా మేము సిద్ధం మా కమ్యూనిటీ సిద్ధం' పేరుతో ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. దీనిపై విచారణ జరిపిన ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు... సంబంధిత విభాగ సూపరింటెండెంట్‌ను, ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని, 12మంది క్షురకులను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. కాగా, గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య నిబంధనలకు విరుద్ధంగా గుంటూరు మిర్చియార్డులో ప్రచారం నిర్వహించారు.

బీజేపీకి 466 కోట్లు..ఎవరిచ్చారో తెలీదు!

ఎస్‌బీఐ ఈసీకి ఇచ్చిన రెండు జాబితాల్లో తేడాలు



న్యూఢిల్లీ, మార్చి 22: బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చిన విరాళాల్లో.. రూ.466 కోట్లు ఎవరిచ్చారో వివరాల్లేవు! సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తాజాగా ఈసీకి నంబర్లతో సహా బాండ్ల 'పూర్తి' వివరాలను సమర్పించామని ఎస్‌బీఐ ప్రకటించిందిగానీ.. అందులోనూ కొన్ని లొసుగులున్నాయి. అది నిజంగా 'పూర్తి' సమాచారం కాదు. ఎందుకంటే.. ఎస్‌బీఐ గురువారం ఈసీకి రెండు జాబితాలు సమర్పించింది. అందులో ఒకటి.. కొనుగోలుదారుల జాబితా కాగా, రెండోది వారిచ్చిన బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల జాబితా. కొనుగోలుదారుల జాబితాలో 18,871 ఎన్నికల బాండ్ల వివరాలున్నాయి. కానీ.. నగదుగా మార్చుకున్న పార్టీల జాబితాలో 20,421 బాండ్ల వివరాలున్నాయి. రెండింటిలోనూ కామన్‌గా ఉన్న యునిక్ నంబర్ ఆధారంగా.. ఏ కంపెనీ/ఏ వ్యక్తి ఏ పార్టీకి ఎంత విలువైన బాండ్లు ఇచ్చిందీ సరిపోల్చే ప్రయత్నం చేయగా.. 18,741 బాండ్ల వివరాలే సరిపోలుతున్నాయి. వాటి విలువ రూ.12,145.88 కోట్లు. కానీ గత ఐదేళ్లలో జారీ అయిన మొత్తం బాండ్ల విలువ రూ.12,769 కోట్లు. ఈ రెండింటి మధ్య తేడా.. రూ.623 కోట్లు. అందులో రూ.466.5 కోట్ల దాకా బీజేపీకి అందగా.. కాంగ్రెస్‌కు ఇలా వచ్చినవి రూ.70 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు వచ్చినవి రూ.17 కోట్లు. ఇలా కొనుగోలుదారు పేరు లేకుండా ఆయా పార్టీలకు అందిన బాండ్లన్నీ 2019 ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 25 మధ్య పార్టీలు నగదుగా మార్చుకున్నవే. అంటే.. ఆ బాండ్లన్నీ 2019 ఏప్రిల్ 4 నుంచి ఏప్రిల్ 11 లోపు జారీ అయి ఉంటాయని అంచనా.

బాండ్లు ఇచ్చుకో..

ఐటీ, ఈడీ కేసులు, దాడులను ఎదుర్కొన్న పలు కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం గమనార్హం. ఉదాహరణకు.. దేశంలోనే అత్యధికంగా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిన ఫ్యూచర్ గేమింగ్ కంపెనీపై 2019 జూలైలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మేఘా కంపెనీ కూడా ఐటీ, ఈడీ దాడులను ఎదుర్కొంది. 2019 ఫిబ్రవరిలో ఈడీ దాడులను ఎదుర్కొన్న ఎంకే జలన్ గ్రూప్.. రూ.616.9 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసి పార్టీలకు సమర్పించుకుంది. 2022 మార్చిలో హీరో మోటోకార్ప్‌పై ఐటీ దాడులు జరగ్గా.. ఆ ఏడాది అక్టోబరు 7న ఆ కంపెనీ రూ.20 కోట్ల విలువైన బాండ్లు కొని బీజేపీకి సమర్పించింది. అలాగే.. అరబిందో ఫార్మా ఎండీ పి.శరత్‌చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో 2022 నవంబరు 10న అరెస్ట్ కాగా.. ఆ తర్వాత ఐదురోజులకు అరబిందో ఫార్మా రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది. 2023 జనవరి 27న రౌస్ ఎవెన్యూ కోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా.. మే 8న ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అరబిందో మళ్లీ నవంబరు 8న రూ.25 కోట్ల బాండ్లు కొనుగోలు చేసింది.

బీజేపీకి వచ్చిన విరాళాలు

బాండ్ల రూపంలో భారతీయ జనతాపార్టీకి అత్యధికంగా విరాళాలిచ్చింది మేఘా ఇంజనీరింగ్ (రూ.584 కోట్లు). అలాగే.. క్విక్ సప్లై (రూ.385 కోట్లు), వేదాంత (రూ.230.2 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ గ్రూప్ (రూ.247 కోట్లు), మదన్‌లాల్ లిమిటెడ్ (రూ.175.5 కోట్లు), కెవెంటర్ ఫుడ్ పార్క్ (రూ.144.5 కోట్లు), డీఎల్ఎఫ్ కమర్షియల్ (రూ.130 కోట్లు), బిర్లా కార్బన్ (రూ.105 కోట్లు), ఫ్యూచర్ గేమింగ్ (రూ.100 కోట్లు), హల్దియా ఎనర్జీ (రూ.81 కోట్లు), ఇతరులు.. రూ.3,486.1 కోట్లు విరాళంగా ఇచ్చారు.

కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాలు

కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన కంపెనీ వేదాంత. ఆ కంపెనీ కాంగ్రెస్‌కు రూ.125 కోట్లు సమర్పించింది. వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ (రూ.110 కోట్లు), ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ (రూ.91.6 కోట్లు), యశోద హాస్పిటల్ (రూ.64 కోట్లు), అవీస్ ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ (రూ.53 కోట్లు), ఫ్యూచర్ గేమింగ్ (రూ.50 కోట్లు), సస్మల్ ఇన్‌ఫ్రా (రూ.39 కోట్లు), రిత్విక్ ప్రాజెక్ట్స్ (రూ.30 కోట్లు), ఎస్ఈపీసీ పవర్ (రూ.30 కోట్లు) విరాళాలిచ్చారు.

ఏ పార్టీకి ఎవరెవరి విరాళాలు?

టీఎంసీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా ఫ్యూచర్ గేమింగ్ నుంచి రూ.542 కోట్లు అందాయి. మిగతా సంస్థలు.. హల్దియా ఎనర్జీ (రూ.281 కోట్లు), ధరివాల్ ఇన్‌ఫ్రా (రూ.90 కోట్లు), ఎంకేజే ఇన్‌ఫ్రా (రూ.45.9 కోట్లు), అవీస్ ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ (రూ.45.5 కోట్లు), ఐఎఫ్‌బీ ఆగ్రో (రూ.42 కోట్లు), చెన్నై గ్రీన్ వుడ్స్ (రూ.40 కోట్లు), పీసీబీఎల్ (రూ.40 కోట్లు), ప్రారంభ్ సెక్యూరిటీస్ (రూ.38.8 కోట్లు), క్రిసెంట్ పవర్ (రూ.33 కోట్లు), ఇతరులు రూ.394.1 కోట్లు.

బీఆర్ఎస్ దక్షిణాదిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోకీ అత్యధిక విరాళాలు అందుకున్న బీఆర్ఎస్‌కు.. అందరికన్నా ఎక్కువగా మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.195 కోట్లు విరాళంగా ఇచ్చింది. అలాగే.. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (రూ.94 కోట్లు), చెన్నై గ్రీన్‌వుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ (రూ.32 కోట్లు), హెటెరో డ్రగ్స్ (రూ.30 కోట్లు), ఔటర్ రింగ్ రోడ్డు 30 ఏళ్ల లీజు కాంట్రాక్టును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ (రూ.25 కోట్లు), కేరళకు చెందిన కైటెక్స్ కంపెనీ (రూ.25 కోట్లు), హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ (రూ.20 కోట్లు), ఇతర కంపెనీలు రూ.720 కోట్ల మేర బీఆర్ఎస్‌కు బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చాయి.

వైసీపీ ఫ్యూచర్ గేమింగ్ కంపెనీ.. ఏపీలో అధికార పార్టీ అయిన వైసీపీకి రూ.154 కోట్లు విరాళంగా ఇవ్వడం ఆసక్తికరం. వైసీపీకి 100 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చిన కంపెనీ అదొక్కటే. దాని తర్వాత మేఘా ఇంజనీరింగ్ (రూ.37 కోట్లు), రామ్‌కో సిమెంట్స్ (రూ.24 కోట్లు) ఓస్ట్రో జైసల్మేర్ (రూ.17 కోట్లు), ఓస్ట్రో మధ్య విండ్ (రూ.17 కోట్లు), స్నేహ కైనెటిక్ పవర్ ప్రాజెక్ట్స్ (రూ.10 కోట్లు) ఇతరులు రూ.69.8 కోట్లు.

టీడీపీ తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా విరాళాలు ఇచ్చిన సంస్థ.. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ (రూ.40 కోట్లు). అలాగే.. మేఘా ఇంజనీరింగ్ (రూ.28 కోట్లు), వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌కో (రూ.20 కోట్లు), నాట్కో ఫార్మా (రూ.14 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ (రూ.13 కోట్లు), భారత్ బయోటెక్ (రూ.10 కోట్లు), ఇతరులు రూ.86.6 కోట్లు.



గుంతపల్లెలో ఓబుల్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

రాష్ట్రమంతా అరాచకాలు

- వైజాగ్‌ను గంజాయి కేపిటల్‌గా మార్చారు
- డ్రగ్స్ ద్వారా లక్షల కోట్లు సంపాదిస్తున్నారు
- అందుకే ఆలోచించి ఓట్లేయండి: భువనేశ్వరి
- కడప జిల్లాలో 'నిజం గెలవాలి' పర్యటన
- రెండోరోజు నాలుగు కుటుంబాలకు పరామర్శ

కడప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రమంతా అరాచకాలు జరుగుతున్నాయి. రెండురోజుల క్రితం వైజాగ్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ దిగాయి. ఈ ప్రభుత్వం వైజాగే రాజధాని అంటోంది. అది రాజధాని కాదు. గంజాయి కేపిటల్‌గా మార్చాలన్నదే వైసీపీ ఆలోచన. వాళ్లు గంజాయి, డ్రగ్స్ ద్వారా లక్షల కోట్లు సంపాదిస్తున్నారు. ఆ సొమ్ముతో ఎన్ని ప్యాలెస్‌లయినా కట్టుకుంటారు. అందుకే మీరందరూ రాష్ట్రం గురించి ఆలోచించండి. మీ భవిష్యత్తు గురించి ఆలోచించి ఓటు వేయండి" అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు నియోజకవర్గంలో రెండోరోజు శుక్రవారం పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. బి.కోడూరు మండలం గుంతపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి, కలసపాడు మండలంలోని లింగారెడ్డిపల్లెకు చెందిన సగిలి డేవిడ్, బ్రాహ్మణపల్లెకు చెందిన నల్లగొండ్ల వెంకటయ్య, తెల్లపాడు గ్రామానికి చెందిన బసిరెడ్డి చెంచిరెడ్డి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఎక్కడ ప్రజలు సంతోషంగా ఉంటే ఆ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుంది. ఎక్కడ ప్రజలు ఏడుస్తూ ఉంటే ఆ రాష్ట్రం దేనికీ కొరగాదు. ప్రజలు సంతోషంగా లేనప్పుడు ఆ రాష్ట్రం ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే. ఇప్పుడు మన బతుకులు ఎట్లా ఉన్నాయో అందరికీ తెలుసు. రాష్ట్రమంతా ఏడుస్తూనే ఉంది. పేదల సంక్షేమం కోసం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు తీసుకువస్తామన్నారు. అవన్నీ రావాలంటే చంద్రబాబు సీఎం అయితేనే. ఆయనపై నమ్మకంతో పరిశ్రమలు మన రాష్ట్రానికి వస్తాయి. మీ బిడ్డల భవిష్యత్తు బాగుపడుతుంది. వారికి ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తారు. అన్నదాతలకు ఏడాదికి రూ.20వేలు పంట పెట్టుబడి ఇస్తారు. ప్రతి కుటుబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం. 15ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తారు. కుటుంబంలో ఎంతమంది బిడ్డలు చదువుతుంటే వారందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఒకటికి పదిసార్లు ఆలోచించి ఓటు వేయండి" అని భువనేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నేతలు ఉన్నారు. కడప జిల్లా పర్యటన ముగించుకుని ఆమె నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లారు.

చంద్రబాబు సీఎం కావాల మేడం...

'చంద్రబాబు సీఎం కావాల మేడం.. మన పార్టీ అధికారంలోకి రావాల.. ఎప్పుడెప్పుడా అని మేం ఎదురు చూస్తున్నాం..' అంటూ పలువురు మహిళలు భువనేశ్వరితో అన్నారు. దీనికి స్పందించిన ఆమె 'అది మీ చేతుల్లోనే ఉంది. రాష్ట్రం ముందుకెళ్లాలంటే అభివృద్ధి చెందాలంటే మీ ఓటు ఎవరికి వేస్తారు?' అని ప్రశ్నించారు. దీంతో మహిళలంతా 'చంద్రబాబు... చంద్రబాబు' అని నినదించారు. ఆయనకు ఎందుకు ఓటు వేస్తారని ప్రశ్నించగా.. ప్రజలను కాపాడతాడంటూ మహిళలు ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలో అవినీతి ఆకాశాన్నంటింది: కేపే పాల్

విజయవాడ (ధర్నాచౌక్), మార్చి 22: రాష్ట్రంలో అవినీతి ఆకాశాన్నంటిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ధ్వజమెత్తారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 25 వేల కేజీల డ్రగ్స్‌ను ఎన్నికల్లో వినియోగించి ప్రజలు సరిగా ఆలోచించకుండా ఓట్లు వేయించుకునే కుట్ర చేశారని, దీనిపై నిష్పాక్షపాతం గా సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖలోని పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేల ప్రోద్బలంతోనే ఇది జరిగిందని ఆరోపించారు. విశాఖపట్నం నుంచి తెలంగాణ, ఒడిశాకు డ్రగ్స్ పంపిణీ జరుగుతోందని తెలిపారు. "పాల్ అన్న రావాలి..పాలన మారాలని" రాష్ట్రంలోని 60 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని తనకు ఒక అవకాశమిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

గంజాయి స్వాధీనం, ఇద్దరు అరెస్టు

గుంటూరు, మార్చి 22: ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి గుంటూరు, బెంగళూరు ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరిని గుంటూరు కొత్తపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నల్లపాడు పరిధిలోని సీతారామ్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న బెంగళూరులోని ఉత్తరహళ్లి మెయిన్‌రోడ్డుకు చెందిన నాగవర కృష్ణార్జున, రామనామక్షేత్రం పరిధిలోని సంపత్‌నగర్ 4వ లైనుకు చెందిన విచారపు భానుప్రకాష్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 4.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు కొత్తపేట సీఐ అన్వర్‌బాషా తెలిపారు.

వీఆర్‌కు వెదురుకుప్పం ఎస్ఐ

- ఇద్దరు సిబ్బంది కూడా..

వెదురుకుప్పం, మార్చి 22: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మర్రిమాకుల కండ్రిగకు చెందిన చంద్రశేఖర్ (58) ఆత్మహత్య ఘటనలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆశీర్వాదం, వేలును శుక్రవారం వీఆర్‌కు పంపారు. సివిల్ వ్యవహారంలో పోలీసులు కొట్టారన్న అవమానంతో చంద్రశేఖర్ గురువారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసుస్టేషన్ వద్ద మృతదేహంతో మృతుడి బంధువులు, కుటుంబీకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో ఎస్ఐ సహా ఇద్దరు సిబ్బందిని వీఆర్‌కు పంపారు. నగరి డీఎస్పీ కేఎస్‌మూర్తి నివేదిక ఆధారంగా తదుపరి క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కాగా, చంద్రశేఖర్ మృతదేహాన్ని శుక్రవారం బంధువులకు అప్పగించారు. ఇక, ఈ ఘటనకు సంబంధించి మృతుడి వదిన శారదపై కేసు నమోదైంది.

పుంగనూరులో పెద్దిరెడ్డిని ఓడిస్తా

- భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 22: పుంగనూరు నుంచి పోటీ చేసి మంత్రి పెద్దిరెడ్డిని ఓడిస్తానని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, అవినీతి, దోపిడీ, అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని లూటీ చేసిందని ధ్వజమెత్తారు. విజయవాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన సీఎం జగన్ రూ.15వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకునేందుకే 'సిద్ధం' అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు ఏ వర్గానికీ మేలు చేయలేదన్నారు. రాష్ట్రంలో జరిగిన అవినీతిలో ఈ రెండు పార్టీలకూ భాగస్వామ్యం ఉందని చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, చంద్రబాబుకు మధ్య చీకటి ఒప్పందం ఉందని రామచంద్ర యాదవ్ ఆరోపించారు. పెద్దిరెడ్డికి అనుకూలంగా చంద్రబాబు అభ్యర్థులను ఖరారు చేశారని రామచంద్ర యాదవ్ ఆరోపించారు.

చిలకలూరిపేట వద్ద రూ.13.50 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేట, మార్చి 22: పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద గురువారం రాత్రి పోలీసులు 13.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారిపై చిలకలూరిపేట బొప్పూడి మధ్య చినపసుమర్రు రెవెన్యూ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో విజయవాడ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఓ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న నరసరావుపేటలోని గోకుల్ సీతారామయ్య నగర్‌కు చెందిన అరవపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద రూ.13.50 లక్షలు ఉన్నట్టు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కస్టడీలో కేజ్రీవాల్

ఢిల్లీ మద్యం విధానం కేసులో గురువారం రాత్రి అరెస్టయిన ఆమ్ ఆద్మీపార్టీ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఆరురోజులపాటు తన కస్టడీలో ఉంచుకొని విచారించబోతోంది. ఈ కేసులో ఆయనే అసలు కుట్రదారుడనీ, ఎక్సైజ్ పాలసీ రూపకల్పన, అమలుకు ముడుపులు అందుకున్నాడనీ, నాలుగు హవాలా మార్గాలనుంచి వచ్చిన సొమ్మును పంజాబ్, గోవా ఎన్నికల్లో ఉపయోగించాడనీ, రాబట్టవలసిన సమాచారం ఇంకా ఉన్నది కనుక ఓ పదిరోజులు తమకు అప్పగించాలని ఈడీ రెండున్నరగంటలపాటు కోర్టులో వాదించింది. ఈ ఆరురోజుల విచారణలో సదరు సంస్థ మరెన్ని కొత్త విషయాలు తెలుసుకుంటుందో, ఇప్పటికే తన వద్ద ఉన్న సమాచారానికి కొత్తగా ఎన్ని అతుకులు వేయగలుతుందో తెలియదు కానీ, కేజ్రీవాల్ అరెస్టు అనూహ్యమైనదేతే కాదు. స్వయంగా ఆయనే ఎంతోకాలంగా తన అరెస్టు ఖాయమని చెబుతున్నారు. తొమ్మిదిసార్లు ఈడీ పిలిచినా వెళ్ళలేదన్నమాట నిజమే కానీ, ఎప్పుడు వెళ్ళినా అరెస్టవుతానని ఆయన నమ్మకం. కానీ, ఎన్నికల బాండ్లద్వారా ఏ పార్టీకి ఎవరు ఎన్ని వందలకోట్లు ధారపోశారో తెలియచెబుతూ ఎన్నికల సంఘం గుప్తనిధుల గుట్టువిప్పిన రోజునే కేజ్రీవాల్ అరెస్టవుతారని, ఆ కారణంగా మీడియా దృష్టి యావత్తూ అటుగా మళ్ళిపోతుందని ఎవరూ ఊహించలేదు.

ఇప్పుడు ఉనికిలో లేని మూడేళ్ళనాటి సదరు మద్యం విధానం అక్రమమా, సక్రమమా, ఈ కేసులో మంచిచెడ్డలేమిటన్నది న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి. కానీ, సార్వత్రిక ఎన్నికలు అతిసమీపంలోకి వచ్చేసి, ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడిన ఐదురోజుల్లో ఒక ముఖ్యమంత్రి అరెస్టు కావడమన్నది రాజకీయంగా విశేషమైన పరిణామం. రెండునెలల కాలంలో అరెస్టయిన రెండోముఖ్యమంత్రి ఈయన. కాకపోతే, జార్ఖండ్ ముఖ్యమంత్రి శిబూ-సోరేన్ ఈడీ అరెస్టు చేయడానికి కాస్తంత ముందు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారంతే. కేజ్రీవాల్ మాత్రం తాను జైల్లోనుంచే ఢిల్లీని ఏలతానని అంటున్నారు. ఈ ఇద్దరూ కూడా రక్షణకోసం న్యాయస్థానాలను ఆశ్రయించారు కానీ ఫలితం లేకపోయింది. కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేయడంలోనూ, అరెస్టుచేయడంలోనూ ఒక లెక్క ఉన్నదని కొందరివాదన. గత నాలుగునెలల్లో ఆయనకు నాలుగు సమన్లు అందితే, ఫిబ్రవరిలో ఎడాపెడా నాలుగు జారీచేశారు. మార్చి21న సమన్లతో పాటు అరెస్టు కూడా జరిగిపోయింది. ఇన్నినెలలుగా అన్ని తాఖీదులు ఉల్లంఘించినపుడు ఇప్పటివరకూ ఎందుకు ఊరుకున్నారో తెలియదు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గోవా, చండీగఢ్, గుజరాత్ రాష్ట్రాలు ఆమ్ ఆద్మీకి కీలకమైనవి కనుక ఈ ఎన్నికల వేళ కేజ్రీవాల్ అందుబాటులో లేకపోవడం ఆ పార్టీకి పెద్ద సమస్య. ఆయన అరెస్టు అనేక ఎంపీ సీట్లలో ఆ పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేయవచ్చు. అలాగే, ఇండియా కూటమి ముఖ్యనాయకుడుగా, కొన్ని రాష్ట్రాల్లో నేరుగా పొత్తులు కూడా ఉన్న నేపథ్యంలో, ఒక ప్రజాకర్షణగల నాయకుడిని విపక్షాలు ప్రచార సమయంలో కోల్పోబోతున్నాయి. విపక్షపాలిత రాష్ట్రాల్లోని నాయకుల వెంట ఈడీ, సీబీఐలు పడటం, జైల్లోకి తోయడం గతంలోనూ ఉన్నదే. కానీ, ప్రజాకర్షణ ఉన్న కేజ్రీవాల్ తమతో లేకపోవడం ఇండియా కూటమికి పెద్దలోటు.

మనీష్ సిసోడియా ఇదే కేసులో జైలుకుపోయిన ఏడాది తరువాత కేజ్రీవాల్ అరెస్టయ్యారు. గత రెండేళ్ళుగా ఈ కేసు నడుస్తోంది. ఈడీ, సీబీఐలు వందలసార్లు దాడులు చేశాయి. కుట్రలూ, లెక్కలూ, ఆరోపణలూ కాగితాలమీదే తప్ప క్షేత్రస్థాయిలో ఒక్కరూపాయి కూడా దొరికింది లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రినుంచి కొత్తగా ఏమి రాబడతారో తెలియదు కానీ, కేంద్రంలోని అధికారపక్షానికి ఎన్నికలబాండ్ల ద్వారా ఎవరు ఎందుకు లబ్ధిచేకూర్చారో ప్రజలకు అర్థమవుతున్న సమయంలోనే కేజ్రీవాల్ అరెస్టు జరిగింది. బీజేపీకి ఎన్నివేల కోట్ల రూపాయలు విరాళాలుగా వచ్చాయన్నది అటుంచితే, ఓ ఐదువందల కోట్లు ఎవరిచ్చారో కూడా తెలియదట. ఇక, వందకోట్ల ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎవరినుంచి కేజ్రీవాల్ ముడుపులు అందుకున్నారని ఈడీ ఆరోపిస్తున్నదో, వారే ఎన్నికలబాండ్ల ద్వారా బీజేపీకి భారీగా గుప్తదానాలు చేయడం మరో విచిత్రం. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కత్తిరించడం, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా నిత్యం వేధించడం, ఘర్షణపడటం ద్వారా కేజ్రీవాల్ పార్టీ విస్తరణను నిరోధించే ప్రయత్నం బీజేపీ ఎంతోకాలంగా చేస్తున్నది. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆయన రోజూ తన రాజకీయ మనుగడకోసం పోరాడుతూనే ఉన్నారు కనుక, ఈ అరెస్టు కూడా మద్యం పాలసీతో ముడిపడింది కాదని చాలామందికి అనిపిస్తోంది.

ఆద్యంతాలు, మధ్య మోదీ

సీబీఐ, ఈడీ, ఎసఎఫఐఓ, ఎన్‌సీబీ, ఎనఐఏ, ఐటీ... చట్టబద్ధంగానా లేక చట్టవిరుద్ధంగానా అనే విషయాన్ని అటుంచితే అవన్నీ ఇప్పుడు దేశ పౌరుల జీవితాలలోకి దూకుడుగా ప్రవేశిస్తున్నాయన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. అటువంటివే మరికొన్ని కూడా మనకు చేరువలోకాకపోయినా దిగంతంలో ఉన్నాయి. వీటిని ఆదేశిస్తున్న పెద్దన్న ఎవరు? నడమంత్రపు సిరి మూటగట్టుకున్నది ఎవరు? స్వలాభం కోసం అవసరం లేని చోట జోక్యం చేసుకుంటున్నది ఎవరు? ఎవరు అత్యంత శక్తిమంతుడు? పాలకులకు ఇష్టుడైన వ్యక్తి ఎవరు? తేనీరు లేదా కాఫీ సేవనానికో, పిచ్చాపాటీకో ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నప్పుడు ఇవే వారు తర్కిస్తున్న ప్రశ్నలు. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ మౌనంలోకి జారిపోతున్నారు. సమష్టిగా మౌన కుట్రలో పాల్గొంటున్నారేమోనని అనిపిస్తుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ ప్రశ్నలకు ముగింపు పలికేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలోను ఒక ఈవీఎమ్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ను పెట్టి, అభ్యర్థుల జాబితాను సమకూర్చి, తాము ఎక్కువగా ఇష్టపడే అభ్యర్థికి ఓటు వేయమని ప్రజలను అడగాలి. 85 ఏళ్ల పైబడిన వయసు ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేసేందుకు అనుమతించాలి. నోటాను ఎంచుకొనే వీలు ఉండదు. ఈ సాంబారు సమరాలలో కొత్త దినుసు సీఏఏ– ఎనఆర్‌సీ (ఎనఆర్‌సీ – నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ –జాతీయ పౌర పట్టిక) దేశ పౌరులు అందరినీ నమోదు చేయడానికి దీన్ని ఉద్దేశించారు. ఇందుకు ఒక క్రూర పద్ధతిని అనుసరించారు. లక్షలాది హిందువులు ఈ నమోదు ప్రకియలోకి రావడం లేదని తెలుసుకున్న దేశభక్తి ప్రపూరిత అధికారుల సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం)ను ప్రతిపాదించారు. అయితే ముస్లింలు మినహా అఫ్ఘాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందువులు అందరికీ పౌరసత్వం కల్పించేందుకు ఈ చట్టాన్ని ఉద్దేశించారు. పర్యవసానంగా వీరు ఎనఆర్‌సీలో నమోదవుతారు. ఈ ప్రక్రియలో శ్రీలంకలో వివక్షకు గురై శరణార్థులుగా వచ్చిన తమిళులు, నేపాల్, మయన్మార్ నుంచి వచ్చిన భారత సంతతి ప్రజలకు న్యాయం చేయలేదు. సీఏఏ అమలుకు నిబంధనలను నోటిపై చేశారు.

సంఖ్యలు సైతం మన జీవితాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్నాయన్న సత్యం మనకు ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. ఒకప్పుడు, ప్రతి వ్యక్తికి తెలిసిన సంఖ్య బోర్డ్ పరీక్షలలో తన నెంబర్ మాత్రమే. ఆ తరువాత క్రమంగా మన జీవితాల్లోకి అనేక సంఖ్యలు ప్రవేశించాయి. రేషన్ కార్డ్ నెంబర్, ఓటర్ ఐడి నెంబర్, టూ వీలర్ లేదా కారు రిజిస్ట్రేషన్ నెంబర్, ల్యాండ్ లైన్ టెలిఫోన్ నెంబర్, పాస్‌పోర్ట్ నెంబర్. సరే, మొబైల్ నెంబర్, అలాగే సర్వాంతర్యామి, సర్వశక్తిమంతమైన ఆధార్ నెంబర్, ఇప్పుడు వీటన్నిటినీ తలదన్నే నెంబర్ ఒకటి ఉన్నది. అదే ఎలెక్టోరల్ బాండ్ (ఈబీ) అల్ఫాన్యూమెరిక్ నెంబర్. సర్వశక్తిమంతమైన సుప్రీంకోర్టు సైతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పట్టు నుంచి అల్ఫాన్యూమెరిక్ నెంబర్లను బయట పడవేయలేక పోయింది. కొద్ది రోజుల పాటు ఈబీ– ఎస్‌బీఐనే ఈడీ–సీబీఐ కంటే మహా శక్తిమంతంగా కనిపించింది!



రేషన్ కార్డ్ నెంబర్, ఓటర్ ఐడి నెంబర్, టెలిఫోన్ నెంబర్, పాస్‌పోర్ట్ నెంబర్, మొబైల్ నెంబర్... అలాగే, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతమైన ఆధార్ నెంబర్. ఇప్పుడు వీటన్నిటినీ తలదన్నే నెంబర్ ఒకటి ఉన్నది. అదే ఎలెక్టోరల్ బాండ్ (ఈబీ) అల్ఫాన్యూమెరిక్ నెంబర్.

ఇప్పుడొక కొత్త ఆట ప్రారంభయింది అదే. జాయిన్ –ది –యాల్ఫబెట్స్ ఈ ఆటలో మొదటి విజేత సీబీఐ–ఈడీ. ఈడీ ఖంగుతిన్నది. ఆటలో తానే ప్రధాన భాగస్వామినని, కనుక విజేతను ఈడీ–సీబీఐగా ప్రకటించాలని గట్టిగా అడిగింది. దీనిపై అంతిమ నిర్ణయం ఇంకా వెలువడలేదు. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లెక్కింపు పూర్తయినప్పుడు తీర్పు వెలువడవచ్చు. ఈడీ–సీబీఐ కనుక విజేత అయితే లోక్‌సభకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని ఢిల్లీలో చాలా మంది గుసగుసలు పోతున్నారు. అదే సంభవిస్తే ఎన్నికల నిర్వహణకు అయ్యే సమస్త వ్యయం ఆదా అవుతుంది మరి. కోవింద్ కమిటీ 'ఒన్ నేషన్– ఒన్ ఎలెక్షన్'ను సిఫారసు చేసినప్పుడు భారీగా ఆదా అయ్యే ఈ సొమ్మును పరిగణనలోకి తీసుకుని ఉండదు. పరిగణనలోకి తీసుకుని ఉంటే 'ఒన్ నేషన్, నో ఎలెక్షన్'ను సిఫారసు చేసి ఉండేది.

ఈ పోటీలో సీబీఐ–ఈడీ లేదా ఈడీ –సీబీఐకి వెనుకనే ఉన్నది సీబీఐ–ఐటీ. సీబీఐ కనుక నగదును స్వాధీనం చేసుకుంటే అది ఐటీకి చెందుతుంది. మరి ఐటీనే స్వాధీనం చేసుకుంటేనో? అది ఐటీకే చెందుతుందనేది లోక వివేకం. అయితే ఇప్పుడు ఒక కొత్త వివేకం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఐటీ కనుక నగదును స్వాధీనం చేసుకుంటే దానిపై రెండు సంస్థలకు హక్కు ఉంటుంది. అవి: సీబీఐ, ఈడీ. 'చట్టబద్ధమైన ఆదాయ వనరుల కంటే ఆస్తులు అధికంగా ఉన్నప్పుడు' ఆ నగదు తనకే చెందాలని సీబీఐ వాదిస్తోంది. 'నేరానికి పాల్పడడం వల్ల సమకూరిన సొమ్ము'ను అయితే దానిపై హక్కు తనదేని ఈడీ వాదిస్తోంది. దీనిపై కూడా తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు.

ఇదే ఆటను మరో విధంగా కూడా ఆడుతున్నారు. దాన్ని జాయిన్ –ది–నంబర్స్' అంటున్నారు, 22, 217 ఈబీల అల్ఫా–న్యూమెరిక్ నంబర్‌ను వెల్లడించేలా ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు తీవ్ర ఒత్తిడి తెచ్చింది. నేను ఇది రాస్తున్న సమయంలో ఈ అల్ఫా–న్యూమెరిక్ నంబర్లను వెల్లడించడం జరిగింది. చాలామంది దాతలకు ఇదొక చేదు అనుభవమయింది. ఆ విరాళాలను అందుకున్న కొన్ని పార్టీలు ఆ ఈబీల ప్రక్రియలో తాము భాగస్వాములం కామని మొత్తుకున్నాయి. మరికొన్ని ఇతర పార్టీలు వాటిని తమపై రుద్దారని వాదించాయి. పర్యవసానంగా ఈబీలను రద్దు చేసే అవకాశమున్నది.


అల్ఫాబెట్స్, న్యూమెరిక్స్, అల్ఫా–న్యూమెరిక్స్ సృష్టించిన సంక్షోభం ఎంత తీవ్ర స్థాయిలో ఉందంటే అది జాతీయ ప్రయోజనాలకే కాకుండా జాతీయ భద్రతకు సైతం ముప్పుగా వాటిల్లే ప్రమాదమున్నది. ఈ కారణంగా వికసిత్ భారత్ లక్ష్యాల విస్తరణపై సలహా ఇచ్చేందుకు చాట్– జీపీటీ సహాయాన్ని అర్థించారు. ఇవిగో ఆ కొత్త లక్ష్యాలు: భారత్ జీడీపీని ప్రపంచంలోనే అతి పెద్దదిగా చేయడం; రైతుల ఆదాయాన్ని మూడు రెట్లు పెంచడం, ఏటా ఐదు కోట్ల ఉద్యోగాలు సృష్టించడం, ప్రతి భారతీయ పౌరుని బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేయడం.

చాట్– జీపీటీ సహాయాన్ని తీసుకోవడంతో పాటు సమస్యాత్మక అల్ఫాబెట్స్, న్యూమెరిక్స్ అల్ఫా న్యూమెరిక్స్ స్థానంలో, కనిపించని, విన్పించని, పీల్చలేని, తినలేని విప్లవాత్మక ఐడెంటిఫికేషన్ టూల్‌తో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇన్ని పద్ధతులు, ప్రక్రియలను ఉపయోగించుకోవడం జాతి ఆరోగ్యానికి శుభప్రదం కాదుకనుక ఏఐకు సహకరించేందుకు దేశంలోని సమస్త సమాచారానికి భాండారం అయిన నీతి–ఆయోగ్‌ను నియుక్తం చేయాలి.

'అంతా బాగుంది, సంతృప్తికరంగా ముగుస్తుంది' అన్నది పాత లోకోక్తి. 'ముగింపు, మొదలుకు భిన్నంగా లేదు' అనేది నవీన సూక్తి. కనుక 2004లో ప్రారంభమయిన చోటకే మళ్లీ వెళదాం. అచ్చే దిన్ ఆనే వాలా హై.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తరులు, గిరులు... ఓ పుణ్యాత్ముడు





akbar

నేను సమున్నతంగా అభిమానించే ఒక గొప్ప భారతీయుడు చండీ ప్రసాద్ భట్. సామాజిక సేవకుడుగా, చిప్కో ఉద్యమ పథ నిర్దేశకుడుగా సుప్రసిద్ధుడు. నేను నా ఇరవైల తొలి నాళ్లలో ఆయన్ని ప్రప్రథమంగా కలిశాను. ఆ సమావేశం నా మనసుపై ఒక చెరగని ముద్ర వేసింది. నా మేధో కృషిని మౌలికంగా ప్రభావితం చేసింది. దరిమిలా నేను ఎన్నోసార్లు ఆయన్ని కలుసుకున్నాను. ప్రపంచమూ, భారతదేశమూ ఎదుర్కొంటున్న నైతిక, రాజకీయ, పర్యావరణపరమైన సవాళ్లు; వాటిని నియంత్రించడానికి చేయవలసింది ఏమిటనే విషయమై ప్రతి సమావేశమూ నాకు నిశిత దృష్టిని సమకూర్చింది. కొత్త ఆలోచనలను పురిగొల్పింది.

కొన్ని సంవత్సరాల క్రితం భట్ తన ఆత్మకథను హిందీలో వెలువరించారు. సమీర్ బెనర్జీ ఇప్పుడు దాన్ని 'జెంటిల్ రెసిస్టన్స్' పేరిట ఆంగ్లంలోకి అనువదించారు. భట్ 1934లో జన్మించారు. మన దేశం ఇంకా బ్రిటిష్ పాలనలో మగ్గుతున్న కాలమది. తన బాల్య జ్ఞాపకాలతో పాటు తనకు ఎంతో ప్రేమాస్పదురాలు అయిన తోబుట్టువు, తన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, శ్రామిక కులాల వ్యక్తుల గురించి ఆయన ఎంతో ఆత్మీయతతోనూ, స్ఫూర్తిదాయకంగానూ రాశారు. భట్ ఆత్మకథ, మధ్య హిమాలయాల భూ దృశ్యాలు, కొండలు, అడవులు, సస్య క్షేత్రాలు, నదులను మన కళ్లకు గట్టిస్తుంది. 'అలకనందలో ప్రవహించే నీటిని నేను ఇష్టపడతాను. ఆ నది లయబద్ధమైన ప్రవాహం నాకు భావోద్వేగ పూరితమైన స్ఫూర్తినిస్తుంది' అని భట్ పేర్కొన్నారు.

భట్ కులీన బ్రాహ్మణుడే కానీ భాగ్యంతుడు కాదు. ఏడాది వయస్సులో ఉండగా తండ్రి గతించారు. పేద కుటుంబమే అయినప్పటికీ అనాథ కాదు. 'బాల్యమంతా నేను నిరంతర కొరతలతో గడిపాను. ఏదీ సమృద్ధిగా అందుబాటులో ఉండేది కాదు. సరిపడ డబ్బు లేదు. అవసరమైనవి ఎల్లప్పుడు లభించేవి కాదు' అని ఆయన రాశారు. కుటుంబాన్ని పోషించేందుకు చిన్న వయసులోనే సేద్యం చేశారు. ఆవులను కాశారు. తాను శ్రద్ధాళువు అయి విద్యార్థిని కానని, పరీక్షలలో సరిగా ఉత్తీర్ణుడిని అయ్యేవాడిని కానని ఆయన నిష్కపటంగా వివరించారు. కళాశాల విద్యాభ్యాసం ఆయనకు అందుబాటులో లేనిదని మరి చెప్పనవసరం లేదు. అదృష్టవశాత్తు ఒక స్థానిక బస్సు కంపెనీలో క్లర్క్ ఉద్యోగం లభించింది. ఆ కంపెనీ బస్సులు హిమాలయాలలోని వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రికులను తీసుకెళుతుండేవి. అలా ఆయన విశాల భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భారతీయులతో ఆయనకు పరిచయమయింది. తద్వారా ఆయన సాంస్కృతిక, భౌగోళిక విశ్వం విస్తరించింది.

ఇదిలా ఉండగా కొండ ప్రాంతాలలో వాణిజ్య సంబంధమైన అటవీ కార్యకలాపాలలో చోటుచేసుకొంటున్న దోపిడీని భట్ నిశితంగా అధ్యయనం చేశారు. చెట్లను కూల్చివేసే కూలీలకు కలప వ్యాపారులు ఇచ్చే భత్యం వారి కనీసవసరాలకు కూడా సరిపోని విధంగా ఉండడం, అయితే కాంట్రాక్టర్లు కలపను మైదాన ప్రాంతాలలోని ఫ్యాక్టరీలకు విక్రయించడం ద్వారా అపార లభాలను ఆర్జించడాన్ని ఆయన గమనించారు. అడవుల విధ్వంసానికి కలవరపడిన భట్ 'ఈ దోపిడీ ఉన్మాదాన్ని ఆపివేయలేమా?' అని ప్రశ్నించుకున్నారు. ఆ దోపిడీని అరికట్టగలమని ఆయన భావించారు. అయితే అందుకు కొండ ప్రాంతాల ప్రజలు తమ జీవనాధారాలు, మనుగడకు ఆధారభూతమైన మూలమైన అడవులను ముందుగా తమ నియంత్రణలోకి తీసుకోవలసి ఉందని ఆయన విశ్వసించారు.

'హిమాలయ పర్వత ప్రాంతాల ప్రజల్లో తమ అడవుల పట్ల నిగూఢంగా ఉన్న సహానుభూతిని జాగృతం చేసిన శక్తే చిప్కో ఆందోళన. ఆంతరంగిక భావావేశాన్ని ఒక సామాజిక బాధ్యతగా పరిణమింపచేసిన చైతన్యశీలతే చిప్కో ఉద్యమం' అని ఆ చరిత్రాత్మక పర్యావరణ ఉద్యమ పథ నిర్దేశకుడు చండీ ప్రసాద్ భట్ వివరించారు. సాహిత్య విలువలు ఉన్న ఆయన ఆత్మకథ 'జెంటిల్ రెసిస్టన్స్' సామాజిక, పర్యావరణ చరిత్ర పైనే గాక గాంధీ అనంతరం గాంధేయవాదం చరిత్ర పైన కూడా నిశిత అవగహనను కల్పించే ఉత్కృష్ట గ్రంథం.

1973లో, అడవుల నరికివేతకు వ్యతిరేకంగా గఢ్వాల్ ప్రాంత గ్రామీణుల తొలి నిరసనలకు భట్ నేతృత్వం వహించారు. ఆ ఆందోళనలే తదనంతరం చిప్కో ఉద్యమంగా సుప్రసిద్ధమయ్యాయి. నేను నా పరిశోధక వ్యాసాన్ని కూడా ఆ ఉద్యమ మూలాలు, చరిత్ర గురించే రాశాను. సమీర్ బెనర్జీ తన 'అనువాదకుని మాట'లో ఇలా రాశారు: 'విద్వత్ సంబంధమైన కథనాలు అట్టడుగు స్థాయి క్రియాశీలతలో అంతర్గతంగా ఉన్న మానవ వేదనలు, ఆశలు, అనుభూతులను అంతర్‌ప్రేరణతో వెల్లడించేందుకు అరుదుగా దోహదం చేస్తాయి. నిష్కపటమైన, అరమరిక లేని, సరళ రీతి జీవన వాస్తవాలకు విరుద్ధమైన వివరణాత్మక, విశ్లేషణాత్మక, వ్యాఖ్యానాత్మక చట్రాలకు చెందిన పదాల, వాక్యాల, భాషల, 'భావజాల విశ్వంలో క్రియాశీల కార్యకర్త జీవితపు సంవేదనలు పరిపూర్ణంగా వ్యక్తం కాలేవు.'. లక్నోలోని ఒక సీనియర్ బ్యూరాక్రాట్‌తో తన అనుభవాల గురించిన భట్ కథనం బెనర్జీ వ్యాఖ్యలకు ఉదాహరణగా నిలుస్తుందని చెప్పవచ్చు. అడవులపై నియంత్రణ ప్రభుత్వానికి కాకుండా గ్రామీణ జనసముదాయాలకే ఉండాలని నచ్చచెప్పేందుకు భట్ ఆ అధికారి కార్యాయానికి వెళ్లారు. అతడి సమక్షంలో తన అనుభవాలను ఆ సామాజిక సేవకుడు ఇలా పేర్కొన్నారు: 'నేను తొలుత ఆయనకు అభివాదం తెలిపాను. ఆయన స్పందించలేదు. పదేపదే నమస్కారాలు చేసినా పట్టించుకోలేదు. చివరకు తటపటాయిస్తూనే ఆయన ఎదుట ఒక కుర్చీలో కూర్చున్నాను. కొంత సేపయిన తరువాత ఆ అధికారి బంకమట్టి రంగులో ఉన్న ఒక సిగిరెట్ వెలిగించాడు. అది బుర్రా సాహిబ్‌లు బాగా ఇష్టపడే పొగాకు చుట్ట అని ఆ తరువాత ఒకరు నాకు చెప్పారు. పొగను వదులుతూ నా వైపునకు తిరిగి 'ఏమిటి మీరు చేస్తున్నదంతా?' అని ప్రశ్నించాడు. అడవులపై నియంత్రణ విషయమై మా దృక్పథాన్ని వివరించడానికి ప్రయత్నించాను. వినడానికి ఆయనేమీ ఆసక్తి చూపలేదు. ఆయన ప్రపంచ దృక్పథం ప్రభుత్వాధికారులకు సామాన్యంగా ఉండే దృక్పథం లాంటిదే. కొండ ప్రాంతాల రైతులు అంటే వారికి చులకన. సంఘటిత సమాజమనే అందమైన దేహంపై కురుపుల లాంటి వారనేది ఆయన అభిప్రాయం. ఆ పౌర వ్యవస్థను భద్రంగా కాపాడడమే తమ కర్తవ్యమని ఆ బ్యూరాక్రాట్లు విశ్వసిస్తారు.

బుర్రా సాహిబ్ గురించిన ఈ పద చిత్రాన్ని, భట్ సృజించిన మరో పద చిత్రంతో పోల్చి చూడండి. గౌరాదేవి అనే అసాధారణ మహిళ చైతన్యశీలతను ఇది విశదం చేస్తుంది, ఆమె మానవతను వక్కాణిస్తుంది. నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం (మార్చి 1974లో) రేణి గ్రామంలో ఆరంభమైన చిప్కో ఉద్యమ నాయకురాలు గౌరాదేవి. నిరక్షరాస్యురాలు, చిన్నతనంలోనే భర్తను కోల్పోయి, తనకున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ అనిశ్చిత జీవితాన్ని గడిపిన ధీర. 1965లో ఆమె తన గ్రామంలో మహిళా మంగళ్‌దళ్ ప్రారంభించారు. తొమ్మిది సంవత్సరాల అనంతరం, హిమాలయ పర్వత ప్రాంతాల చరిత్రలో సుప్రసిద్ధమైన చిప్కో నిరసనలకు ఆమె నేతృత్వం వహించారు. గౌరాదేవి 1991లో మరణించారు. 'అసమానతలు, అణచివేతల వ్యతిరేక పోరాటంలో మనకు మార్గనిర్దేశం చేయగల తన మృదువైన ప్రతిఘటన ప్రకాశవంతమైన, ప్రభావశీలమైన శక్తిని మనకు వదిలివెళ్లారు'. భట్ ఇంకా ఇలా రాశారు: అణచివేతలపై గౌరాదేవి పోరాటానికి ప్రేరణ, జీవితంలో ఆమె పడిన మహా కష్టాలు, ఎదుర్కొన్న కఠిన పరీక్షల నుంచి వచ్చింది. పేదరికం, వ్యక్తిగత విషాదాల నెదుర్కోవడంలో తన సహచర మహిళల ధైర్య సాహసాలు ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. దృఢ సంకల్పం, ఉక్కు ధైర్యానికి తోడు గాఢమైన దాక్షిణ్యం గౌరాదేవి వ్యక్తిత్వాన్ని విశిష్టంగా శోభితం చేశాయి. ఆమె క్షమా మూర్తి. ఆ సౌహార్ద గుణం వల్లే, చెట్ల రక్షణకు ఉద్యమిస్తున్న తమ పట్ల ఎంతో మొరటుగా వ్యవహరించిన అటవీ శాఖ ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనని, వారి జీవనాధారాన్ని దెబ్బగొట్టే చెడు తలంపు లేనేలేదని ఉద్ఘాటించిన గౌరాదేవిని తాను ఎప్పటికీ మరచిపోలేనని' భట్ రాశారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

చిప్కో ఉద్యమాన్ని భట్ ఇలా వివరించారు. హిమాలయ పర్వత ప్రాంతాల ప్రజల్లో తమ అడవుల పట్ల నిగూఢంగా ఉన్న సహానుభూతిని జాగృతం చేసిన శక్తే చిప్కో ఆందోళన. ఆంతరంగిక భావావేశాన్ని ఒక సామాజిక బాధ్యతగా పరివర్తింప చేసిన చైతన్యశీలతే చిప్కో ఉద్యమం'. అడవుల విధ్వంసాన్ని నిరసించడంలోనే కాకుండా అడవుల పునరుద్ధరణకు చేపట్టిన కార్యాచరణలో కూడా ఆ సామాజిక నిబద్ధత వ్యక్తమయింది. భట్ నాయకత్వంలో చిప్కో ఉద్యమ కార్యకర్తలు గఢ్వాల్ పర్వత ప్రాంతాలలోని బంజరు భూములను పచ్చని అడవులుగా, పంట భూములుగా మార్చివేశారు. ఈ కృషి స్థానిక పర్యావరణ వ్యవస్థలపై లాభప్రదమైన ప్రభావాలను నెరపింది.

భట్ ప్రధానంగా ఉద్యమ నిర్మాణ దక్షుడు. అయితే ఆయన నిశిత ఆలోచనాశీలి కూడా, గఢ్వాల్ ప్రాంతంలో ఎడాపెడా రోడ్ల నిర్మాణం జోషి మఠ్ పట్టణంలో నివాస గృహాల పతనానికి దారి తీస్తుందని ఆయన 1976లోనే హెచ్చరించారు. భారీ ఆనకట్టల నిర్మాణం హిమాలయ ప్రాంతాలకు క్షేమకరం కాదని స్పష్టం చేస్తూ 1980 దశకంలో ఆయన పలు వ్యాసాలు రాశారు. 'ఇప్పటికే బలహీనమైన పర్వతాలు అంతకంతకూ మరింత వేగంగా బలహీనపడుతున్నాయని' భట్ వాపోయారు. 'భూమి, ఇతర సహజ వనరుల నుంచి మానవాళి వేరు పడిపోవడం వల్లే ఈ ఉపద్రవం వాటిల్లుతోంది. ప్రతి దాన్నీ వాణిజ్య ప్రయోజనాలే ప్రభావితం చేస్తున్నాయి. మానసిక, ఉద్వేగాత్మక మార్పులతో పాటు అనుసరణ ప్రక్రియలు ప్రజలను వాణిజ్య లబ్ధికి అనుకూలంగా మార్చి వేస్తున్నాయి' అని భట్ పేర్కొన్నారు.

చండీ ప్రసాద్ భట్ ఆత్మకథ ఒక శక్తిమంతమైన పుస్తకం. సొంత అనుభవాల గురించిన ఆయన కథనం సామాజిక, పర్యావరణ చరిత్రతో పాటు గాంధీ అనంతరం గాంధేయవాదం చరిత్ర పైన కూడా నిశిత దృష్టిని సమకూర్చుతుంది. సాహిత్య విలువలు ఉన్న భట్ ఆత్మకథ, ఆంగ్ల అనువాదం ద్వారా విస్తృత స్థాయిలో పాఠకులను, వారి మన్ననలు పొందగలదని నేను విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

కుల సమస్యపై భగత్‌సింగ్ విప్లవ భావనలు

ఇటు అంబేడ్కర్, అటు గాంధీల సమకాలికుడైన భగత్‌సింగ్ కులసమస్యపై వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎందుకు అంతగా చర్చకు రాలేదు? 'ఐక్యం కండి, మీ కాళ్లపై మీరు నిలవండి. ఎవరైనా మిమ్మల్నిపావులుగా చేసుకొని, మోసగించటాన్ని అనుమతించకండి. ఇతరుల నుంచి ఏమీ ఆశించకండి. ఈ దోపిడీ సమాజాన్ని సవాలు చేయండి' అని విప్లవ మార్గాన్ని సూచించటం వల్లనా?

'మతం – స్వతంత్ర పోరాటం' ('కీర్తి' పత్రిక, మే 1928); 'అస్పృశ్యతా సమస్య' ('కీర్తి', జూన్ 1928); 'నేను నాస్తికుడిని ఎందుకయ్యాను' (అక్టోబరు 1930) వంటి వ్యాసాల్లో భగత్‌సింగ్ కుల సమస్యపై చర్చించారు. 'జంతువుల కన్నా హీనంగా అస్పృశ్యుల్ని చూస్తున్నప్పుడు, ఉమ్మడి వనరులైన స్కూళ్లు నీళ్లు గుళ్లు వారికి నిషిద్ధమైనప్పుడు వారు మతం మార్చుకుంటే తప్పేముంది' అని 1928లోనే భగత్‌సింగ్ ప్రశ్నించారు. మతం మార్చుకుంటానని అంబేడ్కర్ అప్పటికి ఇంకా ప్రకటించలేదని గమనించాలి. అరవింద్ ఘోష్, తిలక్, సావర్కార్ వంటి హిందూ జాతీయ వాదుల వలె గాక, తనకు కులం మతం లేవన్న భగత్‌సింగ్ వారందరినీ మించి కోట్లాది మందికి ఆరాధ్యుడైనారు.



'జంతువుల కన్నా హీనంగా అస్పృశ్యుల్ని చూస్తున్నప్పుడు, ఉమ్మడి వనరులైన స్కూళ్లు నీళ్లు గుళ్లు వారికి నిషిద్ధమైనప్పుడు వారు మతం మార్చుకుంటే తప్పేముంది' అని 1928లోనే భగత్‌సింగ్ ప్రశ్నించారు. మతం మార్చుకుంటానని అంబేడ్కర్ అప్పటికి ఇంకా ప్రకటించలేదని గమనించాలి.

అభిప్రాయాల ప్రకటనే కాక ఆచరణాత్మక కార్యక్రమాల్నీ భగత్‌సింగ్ బలపరిచారు. ఉరిశిక్షకు ముందు చివరి కోరికగా అస్పృశ్యురాలైన భోగమ్మ అన్న ఖైదీ చేసిన రొట్టె తింటానన్నారు. భగత్‌సింగ్ తదితరులు 1926లో స్థాపించిన 'నౌ జవాన్ భారత్ సభ' కులమతాలకు అతీతంగా సహపంక్తి భోజనాలను నిర్వహించింది. 'అస్పృశ్యత తప్పు అని అంగీకరించి ప్రకటించండి, క్షమించమని కోరండి. సిక్కు, ఇస్లాం హిందూ కన్వర్షన్ కార్యక్రమాలు, శుద్ధీకరణ వంటి ఏ తంతూ అక్కరలేదు. నేడే ప్రాయశ్చిత్తం చేసుకోండి. అస్పృశ్యుల చేతుల నుంచి ఆహారం, మంచి నీళ్లు స్వీకరించండి చాలు' అని రాశారు (1928 జూన్). పాత సంస్థ సోషలిజాన్ని తమ భావజాలంలో చేర్చుకొని, 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్'గా 1928 ఢిల్లీ సమావేశంలో పేరు మార్చుకున్నది. దానితోపాటు, విప్లవకారులంతా కుల మత చిహ్నాలు అన్నిటినీ వదిలేయాలని చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇదీ హఠాత్ నిర్ణయం కాదు. అంతకుముందే ఆ చర్చ, ఆచరణ కూడా మొదలైనాయి. కాకోరీ కుట్ర కేసు విప్లవకారులు చాలా మంది తమ జంధ్యాన్ని తీసిపారేశారు. వారిలో ఒకరైన మన్మథనాథ గుప్తా తన ఆత్మకథలో 'మాలో కొందరు యువకులం నాటి సామాజిక నియమాల్ని ధిక్కరించి గొడ్డు మాంసం కూడా తిన్నాం' అని రాశారు.

రాజకీయ సంస్కరణలు శతాబ్దం క్రిందటే ఓటుబ్యాంకు రాజకీయాల చుట్టూ ఎలా తిరిగేవో భగత్‌సింగ్ మాటల్లో కన్పడుతుంది: 'మింటో మార్లే సంస్కరణలు 1909లో భాగంగా ప్రత్యేక ఎలెక్టొరేట్స్‌ని ప్రతిపాదించిన నాటి నుంచీ, కమ్యూనల్ అవార్డుతో తమ కోటా తగ్గిపోతుందన్న భయం అగ్రవర్ణాల్లో మొదలైంది. దాంతో మతపర, రాజకీయ సంస్కరణలు మొదలైనాయి' అంటూ వాటిని అనుమానంతోనే చూశారు భగత్‌సింగ్. 'దయానంద సరస్వతి అస్పృశ్యతని నిర్మూలించాలన్నారు, చాలా మంచిది. కానీ ఆయన చాతుర్వర్ణ వ్యవస్థని అధిగమించలేకపోయారు. ఆ వివక్ష కొనసాగింది' అన్నారు (1928 మే). 'ప్రసిద్ధ సంస్కరణవాది మదన్‌మోహన్ మాలవ్యా పారిశుద్ధ్య కార్మికులు పూమాల వేస్తే స్వీకరించారు కానీ, ఆ వెంటనే స్నానం చేసి బట్టలు మార్చుకోకపోతే మైలపడినట్లేనని భావించారు. ఎంత విడ్డూరం!' అని రాశారు. భగత్‌సింగ్ మాటలు నేటి ప్రదర్శనాత్మక రాజకీయాల్ని గుర్తుచేస్తాయి. 'కులనిర్మూలన' వ్యాసం (1936) కన్నా ముందు 1930 నవంబరు 'రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్'లోనే దళితులకు ముస్లింలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండాలని అంబేడ్కర్ వాదించారని తెలిసిందే. 'దేశ విముక్తికై మన ప్రస్థానంలో ఈ ప్రాతినిధ్యం (కమ్యునల్ రెప్రెజెంటేషన్) కొద్దిగా ఉపయోగపడుతుంది; అస్పృశ్యులను ఆకర్షించటం ద్వారా హిందూ ముస్లిం సిక్కు రాజకీయశక్తులు శాసనసభల్లో తమ కోటాని పెంచుకోటానికి ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు. ఇది విస్తృతస్థాయిలో కల్లోలాలకు దారి తీస్తున్నది. ఈ కల్లోలం అస్పృశ్యత పట్టుని ఖచ్చితంగా బలహీనపరిచే రీతిలో తోడ్పడుతున్నది. అయితే అంతిమంగా అస్పృశ్య వర్గాలన్నీ ఐక్యమై సంఘటితపడితే తప్ప అస్పృశ్యతా సమస్య సంతృప్తికరంగా పరిష్కరించబడదు' అని నొక్కి చెప్పారు భగత్‌సింగ్. 'బాల్య వివాహాల రద్దు వంటి చిన్న సంస్కరణలకే తమ మతానికి ప్రమాదం వాటిల్లిందని గగ్గోలు పెట్టే శాసనసభల ద్వారా కులం, అస్పృశ్యత సమస్యలు పరిష్కారం కావు' అని నొక్కి చెప్పారు.

'అధికారవర్గం (బ్యూరోక్రసీ), శాసనసభలూ అనుసరించే సంస్కరణవాదం క్రమక్రమంగా మార్పుకు (గ్రాడ్యువలిజం) ఉపయోగపడజాలవు' అని చెప్పి, 'సాంఘిక ఉద్యమాల ద్వారా విప్లవాన్ని తీసుకురండి; ఆ తర్వాత రాజకీయ ఆర్థిక విప్లవాలకు సంసిద్ధంకండి' అన్న పిలుపుతో భగత్‌సింగ్ తన అస్పృశ్యత వ్యాసాన్ని ముగించారు. 'స్వతంత్రం అంటే కేవలం బ్రిటిష్ వారి నుంచి విముక్తి కాదు, సంపూర్ణ స్వతంత్రం కావాలి. మానసిక బానిసత్వం నుంచి విముక్తి అయి, ప్రజలంతా సమరస భావనతో జీవించాలి. సంకుచితత్వాన్ని విడిచిపెట్టాలి. అలాంటి ఆహారపు అలవాట్లని మార్చుకోవాలి. అస్పృశ్యత అన్న పదాన్ని సమూలంగా పెరికివేయాలి. అప్పుడే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఐక్యత, సహకారమూ సాధ్యమవుతాయి' అని రాశారు (1928 మే).

భగత్‌సింగ్ జైల్లో ఉండగానే మార్క్సిజాన్ని అధ్యయనం చేసి, సోషలిస్టు లక్ష్యాన్ని స్వీకరించారు. అస్పృశ్యత వ్యాసం ముగింపులో 'తిరుగుబాటు బావుటా ఎగరేయాలి. ప్రస్తుత సామాజిక వ్యవస్థనే సవాలు చేయాలి' అన్నారు. 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'లోని 'శ్రామికులారా ఏకంకండి, పోరాడితే మీకు పోయేదేమీలేదు సంకెళ్లతప్ప' అన్న మహత్తర సందేశంతో ముగించారు. 'దళితులారా మీరు నిజమైన శ్రామిక వర్గం' అన్నారు వర్గదృష్టితో. 'దళితులతో పాటు యావత్ శ్రామిక వర్గం విప్లవిస్తేనే పెట్టుబడిదారీ దోపిడీ నుంచి, కులపీడన నుంచి కూడా భారతదేశ విముక్తి సాధ్యం' అని రెంటినీ జోడించి చాటి చెప్పారు. కులతత్వ రాజకీయాలు నానాటికీ ముదురుతున్న నేటి తరుణంలో, మౌలిక మార్పుకై ప్రజల్ని ఐక్యం చేసి, ఏకోన్ముఖం చేయాల్సిన అవసరం రీత్యా భగత్‌సింగ్ మాటలు చిరస్మరణీయాలు.

● ఎమ్. జయలక్ష్మి
రిటైర్డ్ ఏజీఎం, ఆప్కాబ్

(నేడు భగత్‌సింగ్ వర్ధంతి)

దళిత డప్పుకు దక్కిన గౌరవం

సంగీతం సార్వజనీనమైనది. అయితే అది స్థలకాలాలకు అతీతమైనది కాదు. నిర్వికల్ప సంగీతం (అబ్సొల్యూట్ మ్యూజిక్) అంటూ ఏదీ ఉండదు. స్థలకాలాదులతోపాటు సంస్కృతి ఆ సంగీత రూపసారాలను నిర్మిస్తుంది. అవును, సంగీతం కూడా ఒక నిర్మాణమే. సంగీతం ఒక సృజనాత్మక ప్రవాహం అన్నది ఎంత నిజమో; అనేక నైరూప్య సారూప్య అంశాల సమ్మిళిత నిర్మాణం అన్నది కూడా అంతే నిజం. అందువల్ల సంగీతాన్ని కల్చరల్ ఆంత్రోపాలజీ దృక్పథం నుంచి వ్యాఖ్యానించే ఒక అకడమిక్ స్టడీ ఇప్పటికే వికసించింది. కళాకారుడి సామాజిక, ఆర్థిక నేపథ్యం సంగీతం వివిధ రకాలుగా వేరుపడడానికి హేతువు అవుతున్నది. అందుకే ప్రపంచంలో ఎన్నో రకాలైన సంగీతం వుంది. ఎన్నో రకాలైన వాయిద్య పరికరాలున్నాయి. ఇండియాలో ప్రతి కులానికీ సంగీతం అందించే సాంస్కృతిక కులం వుంది. పాట, మాట, ఆట, వాయిద్యంతో ఈ సాంస్కృతిక కులాల అస్తిత్వం, మనుగడ ముడిపడి ఉంది.



అందుకే సంగీతం అంటే రాగం, తాళం మాత్రమే కాదు. గాత్ర విన్యాసంతో పాటు, వాయిద్య విన్యాసం కూడా సంగీతంలో అంతర్భాగం. మనిషి మొదటిపాట ఎప్పుడు పాడాడో కాలనిర్ణయం చేయలేము. అలాగే ఒక వాయిద్యం ఎప్పుడు ఎందుకు అవతరించిందో ఇతమిత్థంగా చెప్పడం కూడా కష్టమే. ప్రధాన స్రవంతి సంగీతానికి ఒక శాస్త్ర ప్రమాణం ఏర్పడి, అది శాస్త్రీయ సంగీతంగా ఉనికిలోకి వచ్చిన కాలాన్ని ఆయా సమాజాల చరిత్రను అధ్యయనం చేసే క్రమంలో గుర్తించారు. అయితే, శాస్త్రీయ సంగీతం అనే వర్గీకరణ ఒక ఆధిపత్య వ్యక్తీకరణ. సంగీతం ఏదైనా దానికంటూ ఒక నియమం ఉంటుంది. వాయిద్యం ఏదైనా సరే దానికంటూ ఒక నియమం, ప్రవర్తన ఉంటుంది. అంతేకాదు, దానికంటూ ఒక సామాజిక పాత్ర వుంటుంది. అయితే, రాజ్యం గుర్తింపు, ఆదరణ ఉన్నవి మాత్రమే శాస్త్రీయమైనవిగా లేదా క్లాసికల్ మ్యూజిక్ లేదా క్లాసికల్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌గా ప్రాచుర్యంలోకి వచ్చాయి. రాజ్య నిరాదరణకు గురైన సంగీతం, వాయిద్య ప్రదర్శనలు జానపదాలుగా, ప్రజాకళలుగా, అలగాజన ఆనందహేళగా ముద్రలు పొందాయి. ఇది అన్యాయమని, వివిధ ఎథ్నిక్ గ్రూపులు తమ సంగీతానికి గల శాస్త్రీయతను నిరూపించే ప్రయత్నం బలంగా చేశాయి. ఆ క్రమంలోనే డప్పు అనే వాయిద్యాన్ని శాస్త్రీయ సంగీత ఫ్రేంవర్కులో రాజ్యానికి అవగతమయ్యేలా వాగ్గేయకారుడు సూర్యభగవంతం విశేష కృషి చేశారు. సూర్యభగవంతం వేలాది మందికి డప్పు సంగీతంలో శిక్షణ ఇచ్చాడు. అయనకు రాజ్యం నుంచి ఎలాంటి గుర్తింపు దక్కలేదు గానీ, కోట్లాదిమంది ఆయనను గౌరవించారు. అయితే, ఆయన శిష్యుడు అందె భాస్కరుకు గొప్ప గౌరవం దక్కింది. కేంద్ర నాటక సంగీత అకాడమీ అతనికి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం 2024 ప్రకటించింది. స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారిగా ఒక డప్పు కళాకారుడికి దక్కిన అత్యున్నత సత్కారం ఇది.

సంస్కృతి ఏకరూపమైనది కాదు. బహుళ ఎథ్నిక్ కమ్యూనిటీలు ఉనికిలో ఉన్న మన దేశంలో బహుళ సంస్కృతులు ఉన్నాయి. ముందే చెప్పినట్టు వివిధ కులాలు, తెగలకు ప్రత్యేక కళా సంస్కృతులు ఉన్నాయి. వాటికే సొంతమైన వాయిద్య పరికరాలున్నాయి. అయితే, డప్పు ఒక ఆదిమ వాయిద్యం. మాదిగ సమూహం 'కుల సమాజం'లో, కోయ గోండులు 'తెగల సమాజం'లో డప్పును వాయిస్తారు. అయితే, మాదిగలు డప్పు వాయించే తీరుకు, ఇతరులు వాయించే తీరుకు పూర్తిగా తేడా ఉంటుంది. అందె భాస్కర్ డప్పు కళాప్రదర్శన వైశిష్ట్యం కూడా అంతే.

అందె భాస్కర్ దళిత సామాజిక నేపథ్యం నుంచి ఎదిగిన కళాకారుడు. అతడు జన్మతః డప్పు కళాకారుడు. డప్పు అతడి ఇంటి పరికరం. డొమెస్టిక్ ఇన్‌స్ట్రుమెంటు. డప్పుకీ తనకూ పేగుబంధం ఉంది. అది తన అస్తిత్వ పరివేదన వ్యక్తీకరణ సాధనం. తన ఆకలిని చల్లార్చే వానదరువు. తన ఆవేశాన్ని రగిలించే అగ్నికీల. తన జీవనగతి జతీ అది. అదే తనకో జాతీయ స్థాయి గుర్తింపును తెస్తుందని అతడు బహుశా ఊహించి ఉండడు. మూడు పాతికల వయస్సు గల దేశంలో, తెలంగాణ సమాజంలో అందె భాస్కర్ కేంద్ర యువ పురస్కారం పొందిన కళాకారుడు. ఇది తెలంగాణకే కాదు, యావత్ దేశానికే గర్వకారణం. దళితుల సంగీత పరికరమైన డప్పుకు రాజ్యాంగబద్ధ గుర్తింపు దక్కింది. అందుకు అందె భాస్కర్‌ను అభినందించాలి.

– శ్రీనివాస్ దక్షిణాది

వీడిన ఉత్కంఠ


కేశినేని చిన్నికి స్వీట్లు తినిపిస్తున్న మహిళలు


కేశినేని చిన్ని కార్యాలయం వద్ద మహిళల సంబరాలు

ఉత్కంఠకు తెరపడింది. ఉత్సుకత వీడింది. ఎట్టకేలకు మైలవరం, పెనమలూరు టీడీపీ అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. ఇన్నాళ్లూ టెన్షన్ పెట్టిన పెనమలూరు బంతి చివరికి బోడె ప్రసాద్ కోర్టులోకే చేరింది. ఇక మైలవరం సస్పెన్స్‌కు కూడా తెరదించుతూ వసంత కృష్ణప్రసాద్ పేరు ఖరారైంది. ఇక మొదటి నుంచీ అనుకున్నట్టుగానే విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేశినేని శివనాథ్ (చిన్ని) పేరును ఖరారు చేస్తూ అధిష్ఠానం శుక్రవారం జాబితా విడుదల చేయడంతో జిల్లా టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

టీడీపీ రెండో జాబితా విడుదలతో వీడిన సస్పెన్స్

పెనమలూరు బరిలో బోడె ప్రసాద్..

- మైలవరం అభ్యర్థిగా వసంత పేరు ఖరారు
- విజయవాడ పార్లమెంట్ స్థానానికి కేశినేని చిన్ని
- దేవినేని ఉమా, బుద్ధప్రసాద్‌కు దక్కని చోటు
- అధికారంలోకి వచ్చాక సముచిత స్థానాలు
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అసెంబ్లీ, ఎంపీ టికెట్లు ఖరారు.
- జిల్లా టీడీపీ శ్రేణుల్లో మిన్నంటిన సంబరాలు

అన్నదమ్ముల సవాల్

విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్ (నాని) పోటీ చేస్తుండగా, ఆయనకు ప్రత్యర్థిగా టీడీపీ నుంచి ఆయన సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని) పోటీ చేస్తున్నారు. దీంతో వీరి నడుమ పోటీ రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. 2014, 2019లో కేశినేని నాని టీడీపీ తరఫున ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. ఆ సమయంలో అన్నకు అండగా ఉన్న చిన్ని.. ఇప్పుడు ప్రత్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈసారి చిన్ని గెలుపొందితే టీడీపీ విజయవాడ పార్లమెంటులో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసినట్లవుతుంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో టీడీపీ పోటీచేసే ఒక ఎంపీ, 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను అధిష్ఠానం ఖరారు చేసింది. రెండు జిల్లాల్లో మొత్తం 2 ఎంపీ స్థానాలు, 14 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయి. వీటిలో మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. విజయవాడ పశ్చిమ, అవనిగడ్డ స్థానాలను మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనకు ఇచ్చారు. మిగిలిన విజయవాడ ఎంపీ స్థానంతో పాటు 12 అసెంబ్లీ స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. ఫిబ్రవరి 24న విడుదల చేసిన తొలి జాబితాలో 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, శుక్రవారం విడుదల చేసిన రెండో జాబితాలో విజయవాడ పార్లమెంట్, మైలవరం, పెనమలూరు అసెంబ్లీ స్థానాలకు ఖరారు చేశారు. దీంతో టీడీపీ తన అభ్యర్థులందరినీ ప్రకటించినట్లయింది. విజయవాడ ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ (చిన్ని) బరిలో దిగుతున్నారు. పెనమలూరు అసెంబ్లీ స్థానం నుంచి బోడె ప్రసాద్, మైలవరానికి వసంత కృష్ణప్రసాద్ టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.

వీడిన సస్పెన్స్


కృష్ణప్రసాద్ / బోడె ప్రసాద్.. / కేశినేని చిన్ని

మైలవరం, పెనమలూరు నియోజకవర్గాల విషయంలో కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. మైలవరం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమా పోటీ చేస్తారా, లేక వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అవకాశం ఇస్తారా అనే విషయంపై ఇప్పటివరకు ఉత్కంఠ నెలకొంది. చివరికి టీడీపీ అధిష్ఠానం వసంతవైపే మొగ్గు చూపింది. అయితే, అధికారిక ప్రకటన వెలువడటంలో ఆలస్యం జరుగుతుండటంతో చివరికి ఏం జరుగుతుందోనన్న ఉత్సుకత కొనసాగింది. ఎట్టకేలకు మైలవరం నుంచి వసంత పేరు ఖరారైంది. పెనమలూరు విషయంలో హైడ్రామా నడిచింది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు ఈసారి సీటు ఇవ్వలేకపోతున్నామని అధినేత చంద్రబాబు పిలిచి చెప్పారు. దీంతో బోడెతో పాటు ఆయన అభిమానులు పార్టీ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా చంద్రబాబు ఫొటో పెట్టుకుని పోటీ చేస్తానని బోడె ప్రకటించారు. మరోవైపు ఈ స్థానం నుంచి పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. దేవినేని ఉమాను ఇక్కడి నుంచి బరిలోకి దించుతారన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత మైనారిటీ అభ్యర్థిగా ఎంఎస్ బేగ్ పేరు తెరపైకి వచ్చింది. ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, తెలుగు యువత నాయకుడు దేవినేని చందుతో పాటు తెనాలి నియోజకవర్గ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు కూడా వినిపించింది. చివరికి అన్ని ప్రచారాలకు చెక్ పెడుతూ బోడెవైపే టీడీపీ అధిష్ఠానం మొగ్గు చూపింది.

సీనియర్లకు సముచిత స్థానాలు

టీడీపీ ఈసారి బీజేపీ, జనసేనతో కలిసి ఎన్నికల బరిలోకి దిగుతుండటంతో పలువురు సీనియర్లకు ఈసారి న్యాయం చేయలేకపోయారు. అలాంటి వారిలో అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమా ఉన్నారు. ఉమాకు టికెట్ కేటాయించకపోవడం ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీకి వీర విధేయుడిగా ఉంటూ, చంద్రబాబు, లోకేశ్ మాట జవదాటని వ్యక్తిగా ఉమాకు పేరుంది. అలాంటి వ్యక్తికి ఈసారి టికెట్ ఇవ్వకపోవడం పార్టీ శ్రేణులను కాస్త నిరుత్సాహపరిచింది. పొత్తుల్లో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించడంతో అక్కడ సీనియర్ నేత మండలి బుద్ధప్రసాద్‌కు టికెట్ దక్కలేదు. ఇక పెడన నుంచి టికెట్ ఆశించిన బూరగడ్డ వేదవ్యాస్‌కూ ఈసారి నిరాశే ఎదురైంది. అయితే, పార్టీ అధికారంలోకి వస్తే వీరి సేవలకు తగిన గుర్తింపు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్టు సమాచారం.

తాను ఒక జిల్లా అధికారిగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కూడా వైసీపీ కార్యకర్తగా ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జయచంద్ర గాంధీ అధికార పార్టీకి బాకా మోగిస్తున్నాడు. వాట్సాప్ గ్రూపులలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలకన్నా ఎక్కువగానే రెచ్చిపోతున్నారు. తాజాగా పలు గ్రూపులలో జయచంద్ర గాంధీ పూర్వ చిట్‌చాట్‌లు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. ఒక జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేయాల్సిన ఈయన వైసీపీకి రాజకీయ శిష్యుడిగా, అంతకు మించి ప్రచారకర్తగా పనిచేస్తున్నాడు. ఆయన పలు వాట్సాప్ గ్రూపులలో తాను ఒక డీపీవో అన్న సంగతి మరిచిపోయి సాగించిన అనేక చిట్'చాట్'లు బయటకు వచ్చాయి. ఎవరైనా వైసీపీ నిర్ణయాలను ప్రశ్నించినా.. కామెంట్లు చేసినా డీపీవో గాంధీ వెంటనే స్పందిస్తారు. కౌంటర్లు ఇస్తారు. ప్రతిగా ఆయన రీ కౌంటర్లు ఇస్తున్నారు. వాట్సాప్ గ్రూపులలో జయచంద్ర గాంధీ సాగించిన చిట్ 'చాట్' బాగోతాలలో కొన్నింటిని చూద్దాం..

భజనచంద్ర.. చిట్‌చాట్!

వాట్సాప్ గ్రూప్‌లలో వైసీపీకి బాకా

- పక్కా రాజకీయ లక్ష్యంతో పనిచేస్తున్న డీపీవో
- జగన్‌కు మద్దతుగా ప్రచారం..


వాట్సాప్ గ్రూపులో డీపీవో జయచంద్ర గాంధీ అధికార పార్టీకి అనుకూలంగా చేసిన పోస్టులివి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విశ్వసనీయతకు, మాటని తప్పని తత్వానికి జగన్ మారుపేరుగా తరచూ గ్రూపులలో చిట్‌చాట్ చేస్తుంటారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నెలకు రూ.3 వేల పెన్షన్ అందిస్తున్నారని చెబుతుంటారు.

- మిగతా 6లో



తగ్గినది

- ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన నీటిమట్టం

విజయవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో జలకళ తగ్గుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉండే కృష్ణమ్మ కొద్దిరోజులుగా కిందకు చేరుతోంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 12 అడుగులు. ప్రస్తుతం ఇక్కడ 6.5 అడుగులకు చేరింది. రాబోయే రోజుల్లో ఇది మరింతగా దిగిపోయే అవకాశాలు ఉన్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అని నమ్మించాడు.. రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ చెల్లిస్తే మంచి జీతంతో, పేరున్న కంపెనీలో ఉద్యోగమని ఎర వేశాడు.. నిరుద్యోగులు నమ్మారు.. అడిగినంత ఇచ్చుకున్నారు.. ఆన్‌లైన్ క్లాసులకు కూడా హాజరయ్యారు.. ఉద్యోగం ఇంతకు, అంతకు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీస్తే.. అసలు బాగోతం బయటపడింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ప్రకాశం జిల్లాకు చెందిన యువకుడి మోసం బయటపడింది. దీంతో విజయవాడ, గుంటూరుకు చెందిన ఆరుగురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

ఉద్యోగాల ఎర

- నగరంలో ప్రకాశం జిల్లా యువకుడి వసూళ్లు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట లక్షలు కాజేత
- మోసపోయామని తెలుసుకున్న నిరుద్యోగులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



(ఆంధ్రజ్యోతి- విజయవాడ) : ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువత పక్కదారులు వెతుకుతోంది. ఆయా కంపెనీల్లో ఉన్న హెచ్‌ఆర్ మేనేజర్లు, ప్రముఖుల సిఫార్సులతో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో కూర్చోవాలనుకుంటున్నారు. ఇటువంటి వారికి టోకరా వేస్తున్నారు మాయగాళ్లు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో హెచ్‌ఆర్ మేనేజర్లమని చెప్పుకొని ఇంజనీరింగ్ చదివిన యువతను మోసం చేస్తున్నారు. ఇంజనీరింగ్ పట్టా పట్టుకుని నిరుద్యోగులుగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు దిగుతున్నారు. తద్వారా లక్షలాది రూపాయలను వెనుకేసుకుంటున్నారు.

ప్రముఖ కంపెనీల పేర్లు చెప్పుకొని..

ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్, టెక్ మహేంద్ర.. వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో హెచ్‌ఆర్ మేనేజర్లుగా పనిచేస్తున్నామని మోసగాళ్లు వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన యాసిన్ అనే యువకుడు ఇలాగే విజయవాడలో పలువురిని మోసం చేశాడు. దీనికి సంబంధించిన బాధితులు న్యాయం చేయాలని పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. యాసిన్.. ఇన్ఫోసిస్‌లో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని కొంతమందిని పరిచయం చేసుకున్నాడు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్స్ కోర్సు చేసిన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రగల్భాలు పలికాడు. అతడు చెప్పిన మాటలు నిజమేనని నిరుద్యోగులు విశ్వసించారు. తాను చెబుతున్న మాటలు నిజమో కాదో తెలుసుకోవడానికి బెంగళూరులో ఉంటున్న తన స్నేహితుడిని పరిచయం చేశాడు. ఒక్కో యువకుడి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు చేశాడు. యువకుల తల్లిదండ్రులు కొంత మొత్తాన్ని నగదు రూపంలో, మిగిలిన మొత్తాన్ని ఆన్‌లైన్‌లో పంపారు. డబ్బు ఇచ్చిన యువకులకు నెల రోజులపాటు ఆన్‌లైన్‌లో శిక్షణా తరగతులు నిర్వహించాడు.

సాధారణంగా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో శిక్షణా కాలంలో కొంత వేతనం చెల్లిస్తారు. యాసిన్ మాత్రం ఎలాంటి వేతనం చెల్లించలేదు. దీంతో అనుమానం వచ్చిన యువకుల తల్లిదండ్రులు అతడ్ని నిలదీశారు. తీసుకున్న డబ్బు ఇచ్చేస్తానని చెప్పి టంగుటూరుకు పిలిపించుకున్నాడు. అక్కడ వైసీపీ కార్యాలయం వద్ద పంచాయితీ పెట్టాలని భావించాడు. దీనికి బాధితులు ససేమిరా.. అనడంతో కొంతమంది యువకులతో ఇంటి వద్ద పంచాయితీ పెట్టాడు. త్వరలోనే డబ్బు చెల్లిస్తాడని హామీ ఇవ్వడంతో బాధితులు తిరిగి విజయవాడకు చేరుకున్నారు. అసలు యాసిన్ వ్యవహారాల గురించి ఆరా తీయగా, బెంగళూరులో ఉన్న స్నేహితుడితో కలిసి నిరుద్యోగ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు టోకరా వేసినట్టు తేలింది. బెంగళూరులో కొన్ని కంపెనీల పేర్లు ఉపయోగించుకుని నిరుద్యోగులను మోసం చేయడంతో యాసిన్ స్నేహితుడ్ని వైట్‌ఫీల్డ్ పోలీసులు అరెస్టు చేశారని తెలిసింది. యాసిన్ మాత్రం టంగుటూరు నుంచి వ్యవహారాలు నడుపుతున్నాడని సమాచారం. దీనిపై కృష్ణా, గుంటూరు జిల్లాకు చెందిన ఆరుగు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (శని)
సహర్ (ఉదయం) : 4-57 (ఆది)

వైసీపీలోకి మారలేదని కక్ష గట్టి..
ఇంటి గోడ కూల్చివేత!
జగ్గయ్యపేటలో వైసీపీ నేతల దాష్టీకం - 6లో



టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో కేశినేని చిన్ని, సౌమ్య

వైసీపీ నియంత పాలనపై తిరుగుబాటు

- కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు

విద్యాధరపురం, మార్చి 22 : వైసీపీ నియంతృత్వ పాలన పట్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా తిరగబడుతున్నారని విజయవాడ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందిగామకు చెందిన పలువురు వైసీపీ నేతలకు టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని తంగిరాల సౌమ్యతో కలిసి కేశినేని చిన్ని కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ, నందిగామలో వైసీపీ నుంచి టీడీపీలోకి వందలాదిగా చేరడం విప్లవాత్మక పరిణామమని పేర్కొన్నారు. త్వరలోనే నందిగామ వైసీపీ ఖాళీ అవుతుందని ఈ పరిణామాలు సాంకేతాన్ని ఇస్తున్నాయన్నారు. నందిగామ 9వ వార్డు వైసీపీ కౌన్సిలర్ విశ్వనాథపల్లి వాణి, మాజీ ఎంపీటీసీ ప్రత్తిపాటి జయరామరావు, వైసీపీ ఇన్‌చార్జ్ కృపారావు, ఆతోటి నాగరాజు, ఇంద్రకంటి కాశీ తదితరులు టీడీపీలో చేరారు.

రానున్నది ఎన్డీయే ప్రభుత్వమే..

అజిత్‌సింగ్‌నగర్ : రానున్నది ఎన్డీయే ప్రభుత్వమే అని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే కూటమికి ప్రజలు పట్టం కడతారని తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బీజేపీ సర్వసభ్య సమావేశానికి కేశినేని చిన్ని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశాభివృద్ధిని కాంక్షించే మోదీ, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు తపించే చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. సెంట్రల్ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమా, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్(చిన్ని) పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించడంపై సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం పైపులరోడ్డు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కేశినేని చిన్నికి ఘన స్వాగతం పలికి స్వీట్లు పంచిపెట్టారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్‌లు, దాసరి కనకారావులు కేశినేని చిన్నికి అభినందనలు తెలిపారు.



పురిటిపాడులో వృద్ధులతో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గుడివాడను అభివృద్ధి పథంలో నడిపిస్తా : వెనిగండ్ల

గుడ్లవల్లేరు, మార్చి 22 : గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని వచ్చా.. ఇక్కడి ప్రజల ఆదరణ ఆనందాన్నిస్తోంది. ఎంత కష్టమైనా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నిలిపి అభివృద్ధి చేసి చూపిస్తా.. అని గుడివాడ నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం పురిటిపాడు, చినగొన్నూరు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న రాము మాట్లాడుతూ, రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పురిటిపాడు, చినగొన్నూరు గ్రామాల్లో వెనిగండ్లకు ఘన స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, సీఎల్ వెంకట్రావు, జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, కాగిత నరేంద్ర, జయప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన జగన్ : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 22 : గంజాయి, డ్రగ్స్ రవాణాలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపి, విశాఖను డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిన సీఎం జగన్‌రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని మాజీ మంత్రి, ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రెజిల్ కంటైనర్‌లో రూ. కోట్ల విలువగల డ్రగ్‌ను పట్టుకుంటే.. రాష్ట్ర పోలీసులు ఎందుకు అడ్డుపడ్డారో సమాధానం చెప్పాలన్నారు. బ్రెజిల్ ప్రధానికి వైసీపీ నేత పూనం పూర్ణచంద్రరావు ట్విట్టర్‌లో ట్విట్ చేసిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబు విశాఖపట్నంను ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దితే.. జగన్ డ్రగ్స్ రాజధానిగా మార్చారన్నారు. పూనం పూర్ణచంద్రరావుకు విజయసాయిరెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ మాఫియా వల్ల యువత భవిత ఛిద్రమవుతోందన్నారు. డ్రగ్స్ రాకెట్‌లో చంద్రబాబు, లోకేశ్‌లకు సంబంధం ఉందని వైసీపీ నేతలు బురద చల్లడం సిగ్గుచేటన్నారు.

గంజాయి రాష్ట్రంగా మార్చిన జగన్ : దేవినేని ఉమా



గొల్లపూడి : ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్ రెడ్డి పాలనలో దేశం మొత్తానికి గంజాయి సరఫరా చేస్తూ గంజాయిప్రదేశ్‌గా మారిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో ఆయన శుక్రవారం రాత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. బ్రెజిల్ దేశ అధ్యక్షుడికి విజయసాయిరెడ్డి శుభాకాంక్షలు ఎందుకు తెలియజేశారు ప్రాంతీయ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి బ్రెజిల్ అధ్యక్షుడికి ఏం సంబంధాలు ఉన్నాయో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక మత్తుకు బానిసలై నాలుగేళ్లలో 1,745 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. డ్రగ్స్ సరఫరాపై సీబీఐ విచారణ చేసి బాధ్యును శిక్షించాలని డిమాండ్ చేశారు.

పామర్రులో 'బ్రెజిల్ కంటైనర్' కలకలం

పామర్రు, మార్చి 22 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశాఖలో సీబీఐకి చిక్కిన బ్రెజిల్ కంటైనర్ వ్యవహారం కృష్ణాజిల్లా పామర్రులో కలకలం రేపింది. పామర్రు పరిధిలోని మచిలీపట్నం-విజయవాడ జాతీయరహదారిపై కురుమద్దాలి వద్ద గల సంధ్య ఆక్వా సంస్థలో కూడా సోదాలు జరుగుతాయని స్థానికులు భావించినా.. శుక్రవారం రాత్రి వరకు అటువంటిది జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాకినాడ సమీపంలో గల సంధ్యా ఆక్వా సంస్థలపై సీబీఐ బృందాలు సోదాలు చేస్తున్నాయనే సమాచారంతో కురుమద్దాలిలో కూడా సోదాలు జరగవచ్చనే చర్చ స్థానికంగా కలకలం రేపింది.



కురుమద్దాలిలో ఉన్న సంధ్య ఆక్వా కర్మాగారం



ఎన్నికల నియమావళి అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ తదితరులు

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు : దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 22 : అధికారుల సమన్వయంతో జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు చెప్పారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలపై శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి జేసీ సంపత్ కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, కె.మాధవి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి దిల్లీరావు పాల్గొన్నారు. జిల్లాలో 42 ఫయింగ్ స్క్వాడ్‌లు పనిచేస్తున్నాయని, సీ విజిల్ ద్వారా ఈనెల 21 వతేదీ వరకు 109 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఒక పటిష్ట ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టర్ దిల్లీరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీ-విజిల్, 1950 హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, కలెక్టరేట్ కంట్రోల్ రూం తదితరాల ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు.

పార్టీలోకి మారలేదని కక్ష గట్టి..

ఇంటి గోడ కూల్చివేత!

- జగ్గయ్యపేటలో వైసీపీ నేతల దాష్టీకం
- ఫోన్ చేసినా స్పందించని పోలీసులు, అధికారులు
- పైగా బాధితులపైనే ఎస్సీ అట్రాసిటీ ఫిర్యాదు

జగ్గయ్యపేట, మార్చి 22 : జగ్గయ్యపేటలో టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న కార్యకర్త పార్టీ మారలేదన్న కక్షతో ఇంటి గోడను కూల్చివేశారు. గత కొద్ది రోజులుగా ఇంట్లోకి వెళ్లకుండా రాళ్లు అడ్డం పోసిన వ్యక్తులు శుక్రవారం ఏకంగా గోడను కూల్చారు. ఇంట్లో ఉన్న మోటారును ధ్వంసం చేశారు. పురపాలకసంఘం 30వ వార్డు పరిధిలో విజ్ఞాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ నాగుల్‌మీరా 20 సం.లకు పైగా పోరంబోకు భూమిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు. ఆయన సోదరుడు జాన్ సైదా టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ గత పురపాలకసంఘ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంటుగా పనిచేశాడు. ఇటీవల జాన్‌సైదాను వార్డులో వైసీపీ నేతలు పార్టీ మారాలని ఒత్తిడి చేశారు. అందుకు అంగీకరించకపోవటంతో ఆయన సోదరుడి ఇంటి వద్ద వివాదాన్ని సృష్టించారు. ఆయన ఇంటికి వెళ్లే మూడు అడుగుల బాటలో నడవనీయకుండా రాళ్లు అడ్డం వేశారు. మహిళలు, పిల్లలు బయటకు రాకుండా భయభ్రాంతులకు గురిచేశారు. పురపాలక సంఘం అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదు. మునిసిపాలిటి టౌన్‌ప్లానింగ్ అధికారులు వచ్చి రాళ్లు తీయాలని మొక్కుబడిగా హెచ్చరించి వెళ్లారు. రాళ్లు తీయకపోగా శుక్రవారం ఏకంగా గడ్డపారలు తెచ్చి ఇంటి గోడను కూల్చేశారు. గోడ కూలి మోటార్ మీద పడటంతో పైపులైన్, మోటారు ధ్వంసమైంది. ఆ సమయంలో 100కి ఫోన్ చేసినా, స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసినా వస్తున్నామని చెప్పటం మినహా ఎవరూ స్పందించలేదని బాధితులు ఆరోపించారు. పురపాలకసంఘ అధికారులు బాధితులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులు అధికార పార్టీకి బానిసలుగానే వ్యవహరించారని విమర్శలు మూటగట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఫోన్ చేసినా అధికారులు ఎన్నికల హడావుడిలో ఉన్నామంటు తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరకు బాధితులపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో కులం పేరుతో దూషించారని ఫిర్యాదు వచ్చిందని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. కేవలం తాను పార్టీ మారలేదనే అక్కసుతో తన సోదరుడు ఇంటి గోడను కూల్చారని, రెండు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న అక్కడ నుంచి బలవంతంగా ఖాళీ చేయించేందుకు ఇదంతా చేస్తున్నారని జాన్ సైదా ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడిని ఇంట్లో అన్నం తినేందుకు కూడా వెళ్లనివ్వలేదని, టీడీపీకి కట్టుబడి ఉండటమే తాము చేసిన నేరమని అన్నారు.





ఇంట్లోకి రాకపోకలులేకుండా అడ్డుగా వేసిన రాళ్లు

గోడ కూలుస్తున్న వైసీపీకి చెందిన వ్యక్తులు

రామలింగేశ్వరునికి నాట్య నీరాజనం

కూచిపూడి, మార్చి 22 : కూచిపూడి బాలాత్రిపు సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా మూడవ రోజైన శుక్రవారం పలువురు కళాకారులు నాట్యాంశాలు ప్రదర్శించి రామలింగేశ్వరునికి నాట్యనీరాజనాలు అందించారు. కూచిపూడి నాట్యాచార్యులు చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన మోహిని భస్మాశుర నృత్య రూపం అబ్బుర పర్చింది. నాట్యాచారిణి బత్తిన సరిత శిష్య బృందం తక్కువేమి మనకు, రుక్మిణి ప్రవేశ దరువు అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించారు. వేదాంతం కూచిపూడి కళాపరిషత్ దేవిభవాని శిష్య బృందం గణపతి స్తుతి, స్వాగతం కృష్ణ అంశాల్లో హావ భావాలు ఆకట్టుకున్నాయి. వేదాంతం పార్థసారథి శిష్య బృందం చందన చర్చిత అష్టపది, గోపికృష్ణ అంశాలు ప్రదర్శించి కనువిందు చేశారు. సుష్మ ఉదయ్ మహంతి శిష్య బృందం కీర్తించు గణనాథుని, త్యాగరాజ కీర్తన అంశాలు ప్రదర్శించి మెప్పించారు. హైదరాబాద్‌కు చెందిన వీణ అయ్యర్ విశ్వేశ్వర ప్రవేశ దరువు అంశాన్ని ప్రదర్శించారు. దామెర్ల కనక విజయలక్ష్మి భరతముని నాట్య శాస్త్రంలోని అంశాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశారు.



మహాషాసురమర్దిని నృత్య రూపకంలో కళాకారుల అభినయం

రొయ్యూర్యురులో అర్ధరాత్రి ఇసుక దోపిడీ!

- రెండు లారీలు, ట్రాక్టర్ పట్టుకున్న పోలీసులు

తోట్లవల్లూరు, మార్చి 22 : రొయ్యూరు క్వారీలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. పగలంతా జేసీబీలు, లారీలు ఖాళీగా పెట్టి అర్ధరాత్రి సమయంలో అక్రమాలకు తెరలేపుతున్నారు. గురువారం అర్ధరాత్రి రొయ్యూరు నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు లారీలు, ఒక ట్రాక్టర్‌ను పోలీసులు కరకట్టపై పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ తర్వాత ఇసుక తవ్వకాలను అధికారులు నిలుపుదల చేసినా చీకటి దందా కొనసాగిస్తునే ఉన్నారు.

రెండు వర్గాల మధ్య వివాదం

రొయ్యూరు ఎస్సీ సొసైటీ వద్ద పాయలో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని రైతులకు కొంత సొమ్ము ఇచ్చాడు. ఇంతవరకు ప్రైవేటు క్వారీకి అనుమతి రాలేదు. అయితే జీసీకేసీ సంస్థ, మంత్రి జోగి రమేశ్ అనుచరులు ఇక్కడి పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు రెండు రోజుల క్రితం సన్నద్ధమయ్యారు. దాంతో ప్రైవేటు క్వారీకి దరఖాస్తు పెట్టుకున్న వ్యక్తి మంత్రి అనుచరులను అడ్డుకోవడంతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వద్ద పంచాయితీ పెట్టారు. ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తున్నప్పటికీ ఒక వర్గం వారు రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. ప్రైవేటు క్వారీకి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. మరో సంస్థ ఇసుక తవ్వకాలు చేపట్టడం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక తోలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



రొయ్యూరు ఎస్సీ సొసైటీ దగ్గర్లో ఇసుక రవాణాకు వేసిన రహదారి, ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

వసంత నివాసంలో సంబరాలు

- తరలివచ్చిన మైలవరం, నందిగామ కార్యకర్తలు
- టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుస్తా : వసంత
- దేవినేని, బొమ్మసాని నా గెలుపునకు కృషి చేస్తారన్న నమ్మకం ఉంది

నందిగామ, మార్చి 22: మైలవరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టిక్కెట్ దక్కించుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు నందిగామలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మూడవ జాబితాలో మైలవరానికి వసంత పేరును చంద్రబాబు ఖరారు చేయడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి ఐతవరంలోని ఆయన నివాసానికి వస్తున్న కృష్ణప్రసాద్‌కు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. మైలవరం, నందిగామకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఐతవరంలోని వసంత నివాసం కిక్కిరిసింది. టీడీపీ టిక్కెట్టు దక్కించుకున్న కృష్ణప్రసాద్ తన తండ్రి వసంత నాగేశ్వరరావు పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తనపై నమ్మకంతో టిక్కెట్ ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తాను తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు కూడా స్వాగతిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిగా తాను మైలవరం నుంచి భారీ మెజారిటీతో గెలవబోతున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఇప్పటికే తనతో మాట్లాడుతూనే ఉన్నారని, ఒకరిద్దరు దూరంగా ఉన్నా తాను వారిని కలుస్తానని చెప్పారు. పార్టీ నిర్ణయాన్ని ఆ నేతలు వ్యతిరేకించరన్న నమ్మకం తనకుందన్నారు. సీటు ఆశించిన బొమ్మసాని సుబ్బారావుతో తాను ఫోన్‌లో మాట్లాడానని, త్వరలో ఆయన్ను కలుస్తానని చెప్పారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు పట్ల తనకు వ్యక్తిగత వైరం లేదని, ఆయన కూడా పార్టీ గెలుపుకోసం కృషిచేస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉన్న నేతలను కూడా తాను వ్యక్తిగతంగా కలుస్తానన్నారు.



ఐతవరం నివాసంలో వసంత కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

వసంత బయోడేటా

పేరు	: వసంత వెంకటకృష్ణప్రసాద్
పుట్టిన తేదీ	: 09-04-1970
తండ్రి	: వసంత నాగేశ్వరరావు, మాజీ మంత్రి
గ్రామం	: నందిగామ మండలం, ఐతవరం
కుటుంబ నేపథ్యం	: రాజకీయం
వృత్తి	: పారిశ్రామిక వేత్త, రియల్‌ఎస్టేట్.
భార్య	: శిరీష, గృహిణి
పిల్లలు	: ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి

వసంత రాజకీయ ప్రస్థానం..

ఐతవరం గ్రామానికి చెందిన మాజీ వసంత నాగేశ్వరరావు కుమారుడు కృష్ణప్రసాద్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అంచలంచలుగా ఎదిగారు. తొలిసారి 1999లో కాంగ్రెస్ పార్టీ తరఫున నందిగామ ఎమ్మెల్యే పదవికి పోటీ చేసి దేవినేని ఉమా చేతిలో ఓటమి పాలయ్యారు. 2004లో వసంత నాగేశ్వరరావు పోటీచేసి దేవినేని ఉమా చేతిలో స్వల్పతేడాతో ఓటమి పాలయ్యారు. 2009లో నందిగామ సీటు ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఆ ఎన్నికలలో పోటీ చేయలేదు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్న కృష్ణప్రసాద్ 2014 ఎన్నికలలో టీడీపీలో చేరారు. చంద్రబాబు సూచనలతో ఆయన నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఎన్నికల తరువాత పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన ఆయన అనూహ్యంగా వైసీపీలో చేరి మైలవరంలో దేవినేని ఉమాపై విజయం సాధించారు. జగన్ పాలన, పార్టీలో అంతర్గత పోరుతో విసుగు చెందిన ఆయన ఇటీవల టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన ఆయనకు చంద్రబాబు తిరిగి మైలవరం టిక్కెట్ ఇచ్చారు.

కార్యకర్త నుంచి నేతగా..

- సేవా కార్యక్రమాలతో జనంలోకి
- పార్టీకి విధేయుడిగా గుర్తింపు
- అధినేత, యువనేత మదిలో ప్రత్యేక స్థానం
- కేశినేని చిన్ని అనూహ్య ప్రస్థానం



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని ఏడాది క్రితం వరకు టీడీపీలో కొద్ది మందికి మాత్రమే తెలిసిన పేరు. కానీ ఏడాది నుంచి ఆయన పేరు విజయవాడ పార్లమెంటు ప్రజలకు సుపరిచితమైపోయింది. ఓవైపు సేవా కార్యక్రమాలతో జనం మదిలో చోటు సంపాదించుకుంటూనే మరో వైపు పార్టీని కష్టకాలంలో అన్నీ తానై ముందుకు నడిపించారు. ఈ అంశాలన్నీ ఆయన్ను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో తిరుగులేని టీడీపీ నాయకుడిగా నిలబెట్టాయి.

పేరు	: కేశినేని శివనాథ్ (చిన్ని)
పుట్టిన తేదీ	: 3-8-1969
విద్యార్హత	: బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్)
వృత్తి	: రియల్ ఎస్టేట్, కేశినేని డెవలపర్స్ సీఈవో
తండ్రి	: రామస్వామి
తల్లి	: ప్రసూనాంబ
భార్య	: జానకీ లక్ష్మి
పిల్లలు	వెంకట్ చౌదరి, స్నిగ్ధ

కేశినేని చిన్ని 1994 నుంచి టీడీపీ కుటుంబ సభ్యుడిగా ఉన్నా సామాన్య కార్యకర్తగానే కొనసాగుతూ వచ్చారు. తన సోదరుడు కేశినేని నాని రాజకీయ ఎదుగుదలలో చిన్నిది కీలక పాత్ర. 2019లో ఎంపీగా గెలుపొందిన తర్వాత కేశినేని నాని శైలి మారిపోయింది. పార్టీ అధినేత చంద్రబాబుపైన, యువనేత లోకేశ్‌పైన పదే పదే నోరుజారడం.. బహిరంగంగానే పార్టీని విమర్శించడంతో పార్టీ నాయకులకు నానికి దూరం పెరుగుతూ వచ్చింది. నాని శైలిని జీర్ణించుకోలేకపోయిన చిన్ని సోదరుడితో విభేదించి ఆయనకు దూరమయ్యారు. ఆయనతోపాటే ఒకప్పుడు నానికి అత్యంత సన్నిహితులుగా ఉన్న టీడీపీ నాయకులు కూడా ఒక్కొక్కరుగా దూరమవుతూ వచ్చారు. వారందరిపైనా నాని నోరు పారేసుకునేవారు. నాని తీరుతో ఇబ్బందిపడుతున్న పార్టీ నాయకులు నెమ్మదిగా చిన్ని వైపు మొగ్గుచూపారు. క్రమంగా చిన్ని విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కుగా మారారు. ఒకప్పుడు తెరవెనుక రాజకీయాలకే పరిమితమైన చిన్ని ఏడాది కాలంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి నిర్వహిస్తున్నారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి నిత్యం మూడువేల మందికి అన్నదానం చేస్తున్నారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చూస్తున్నారు. బసవతారకం ఇండో కేన్సర్ ఆసుపత్రి సహకారంతో అత్యంత ఖరీదైన కేన్సర్ పరీక్షలు మొబైల్ మెడికల్ వ్యాన్ ద్వారా మారుమూల పల్లెల్లోనూ ఉచితంగా చేయిస్తున్నారు. కృష్ణానది తీరాన ఉండి కూడా సరైన నీటి సౌకర్యం లేకపోవడంతో ఎ.కొండూరు గిరిజన ప్రాంతంలోని ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. సుమారు 500 మందికిపైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేస్తున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ విజయవాడ పార్లమెంటు పరిధిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించడంలో చిన్ని తనదైన ముద్ర వేశారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయడంలోనూ చిన్ని కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ చిన్నిని విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపింది.

కుటుంబసభ్యులతో..





ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న విచారణ అధికారి శ్రీనివాసరావు

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై విచారణ

అవనిగడ్డ, మార్చి 22 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారంటూ అవనిగడ్డ ఈవోపీఆర్డీ శైలజాకుమారిపై వచ్చిన ఆరోపణలపై ఆర్వో బాలసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈవోపిఆర్‌డిపై ఫిర్యాదు చేసిన అవనిగడ్డ మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మరో ఐదుగురిని ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి ఈవోపీఆర్డీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, గతంలోనూ ఆమె అధికార పార్టీకి అనుకూలంగా పనిచేశారని వివరించారు. విచారణ అనంతరం నివేదికను ఆర్వోకు అందజేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు

వన్‌టౌన్ : వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జే.సునీతతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంచినీటి సరఫరాపై జిల్లాలో పరిస్థితిని వివరించారు. తిరువూరు, గంపలగూడెం పరిధిలో తాగునీటికి సంబంధించి ఉపాధి పనుల కల్పనకు తీసుకున్న చర్యలను ప్రధానకార్యదర్శికి వివరించారు. జలవనరుల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మునిసిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్టు కలెక్టర్ వెల్లడిం

భజనచంద్ర చిట్‌'చాట్'!

(5వ పేజీ తరువాయి)

గ్రూపులలో ఇతర పార్టీలపై అభిమానం ఉన్నవారు కూడా ఉంటారు. వారేదైనా తమకు అనుకూలంగా పోస్టు పెడితే డీపీవో జయచంద్ర గాంధీ సహించరు. కౌంటర్లు ప్లే చేస్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీలపై బురదవేసే సెటైరికల్ వీడియోలను పోస్టు చేస్తారు. ఇలాంటి వాటిని చూసి సింహభాగం గ్రూపు సభ్యులు డీపీవోను భయంకరంగా ట్రోల్ చేస్తూ ఉంటారు. నువ్వు డీపీఓనా.. వైసీపీ కార్యకర్తవా అంటూ చెడుగుడు ఆడుతుంటారు. వైసీపీలో ఎంత అభివృద్ధి జరిగిందో తెలియచెప్పే వీడియోలను పోస్ట్ చేస్తారు. వీటితో పాటు ఇది కాదా అభివృద్ధి అంటూ వీడియోలు షేర్ చేస్తుంటారు. గతంలో కలెక్టర్ మందలించినా.. తలకెక్కించుకోకుండా.. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఇలాంటి రాజకీయ లక్ష్యం కలిగిన అధికారి జిల్లాలో ఉంటే.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపించే ప్రమాదం కూడా ఉంది. ఈ అధికారి రాజకీయ లీలలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.23

కేశినేని చిన్నికి అభినందనలు

గవర్నర్‌పేట, మార్చి 22: విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ తరఫున సీటు దక్కించుకున్న కేశినేని చిన్నికి 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి అభినందనలు తెలిపారు. శుక్రవారం కేశినేని చిన్ని కార్యాలయంలో ఆయన్ని కలిసిన డివిజన్ టీడీపీ బృందం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ కేశినేని శివనాథ్ మొబైల్ క్యాంటీన్లు నిర్వహిస్తూ టీడీపీ ప్రతిష్టను పెంచారని అన్నారు.



కేశినేని చిన్నిని అభినందిస్తున్న బాలస్వామి

మాదక ద్రవ్యాల కేంద్రంగా ఆంధ్ర రాష్ట్రం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, మార్చి 22 : మత్తు పదార్థాల వలన యువత భవిష్యత్ అంతా నాశనం అవుతోందని, దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 12వ డివిజన్‌లోని పండరీపురంలో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ జనసేన-బీజేపీ బలపరిచిన టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీగా కే శినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాల కేంద్రంగా మార్చారని అనురాధ విమర్శించారు. తాజాగా విశాఖపట్నంలో దొరికిన గంజాయి కంటైనరే నిదర్శనమని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌పై దాడి చేసి ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి వెళ్లిన వ్యక్తి నేడు వైసీపీ తూర్పు ఎమ్మెల్యేగా నిలిచాడని ప్రజలు ఈ విషయాన్ని గమనించి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. పొట్లూరి సాయిబాబు, శాయన సత్యనారాయణ, ధార్న చంద్రశేఖర్, అబ్దుల్ ఖాదర్, తుమ్మల శేషుబాబు, రవి, వెంకటరత్నం, వై.రవీంద్రలు పాల్గొన్నారు.

పండరీపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

టీడీపీకీ ఓటు వేద్దాం.. తూర్పుని అభివృద్ధి చేసుకుందాం

భారతీనగర్: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి టీడీపీని అధికారంలోకి తెచ్చుకుని తూర్పును అభివృద్ధి చేసుకుందామని గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి అన్నారు. తూర్పు పరిధి 3వ డివిజన్‌లో కరెన్సీ నగర్‌లో మెయిన్ రోడ్డులో శుక్రవారం గద్దె రామ్మోహన్ కుమారులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ. గద్దె రామ్మోహన్‌ను మూడవసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని తూర్పును అభివృద్ధి చేసుకుందామని అన్నారు. తాడి బాబూరావు, పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, కొత్తపల్లి హరీష్, జి.వెంకటేశ్వ రరావు, శ్యామ్ ప్రసాద్, జువ్వాది కొండయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

పటమట: 10వ డివిజన్ టీచర్సు కాలనీ 3వ రోడ్డులోని పార్కు వద్ద నుంచి కార్పొరేటర్ దేవినేని అపర్ణ, యువ నాయకులు గద్దె రాజేష్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి, కరపత్రాలు అందజేశారు. టీడీపీ-జనసేన, బీజేపీ ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పొన్నం శ్రీనివాస్, వై.రంగరావు, పి. శ్రీరామమూర్తి, కె.నాగమణి,ఎస్.రాజామణి, వాసు, ఎం. సూర్యకుమారిలు పాల్గొన్నారు.





మొక్కలు నాటుతున్న పీబీ సిద్ధార్థ విద్యార్థులు, ర్యాలీ నిర్వహిస్తున్న స్టెల్లా కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు

మంచినీటి వనరులను కాపాడుకోవాలి

జల్ జీవన్ మిషన్ జాతీయ నీరు, పారిశుధ్య నిపుణుడు అంగద వరప్రసాద్‌రావు

మొగల్రాజపురం, మార్చి 22: పంచభూతాలుగా చెపుతున్న గాలి, నీరు, భూమి, ఆకాశం, నిప్పు వంటి వాటి వల్లే మానవ మనుగడతో పాటు భూమి మీద ప్రాణి కోటి ఉంటుందని భారత ప్రభుత్వ జల వనరుల మంత్రిత్వ శాఖ జల్ జీవన్ మిషన్ జాతీయ నీరు, పారిశుధ్య నిపుణుడు అంగద వరప్రసాద్‌రావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో కళాశాల గ్రీన్ క్లబ్, ఎకో క్లబ్, వాటర్ కన్జర్వేషన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం, నీటి సంరక్షణ దినోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూమి మీద ఏ ప్రాణి జీవించాలన్నా నీరు లేనిదే సాధ్యం కాదని చెప్పారు. నదులను, కాల్వలను, మంచినీటి వనరులను కాపాడుకోవాలని, తాగునీటిని వృథా చేయవద్దని పిలుపు ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహించగా డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావణం గురించి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులైన స్టూడెంట్స్ క్లబ్ కన్వీనర్ ఐ. వెంకటేశ్వరరావు, గ్రీన్ క్లబ్ ఇన్‌చార్జి డి. శ్రావణి, ఎకో క్లబ్ ఇన్‌చార్జి వి. విశాలాక్షి, వాటర్ కన్జర్వేషన్ క్లబ్ ఇన్‌చార్జి ఈ. నాగార్జునను అభినందించారు. భాగం కళాశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు.

పటమట: మారిస్ స్టెల్లా కళాశాలలలో అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వరల్డ్ వాటర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి లభ్యతను పెంచడం, వాటిని సక్రమంగా వినియో గించడం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటి వనరులను సంరక్షిం చడం, సద్వినియోగం చేసుకోవడం భావితరాలకు నీటి వనరులు పుష్కలంగా లభించే విధంగా చూడటం తమ బాధ్యతగా గుర్తించాలన్నారు. నీటి వనరులు అందరికీ అందేలా చేయాలంటే సక్రమంగా పొదుపుగా వాడుకో వాలన్నారు. అగ్రికల్చర్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ వాటర్ రిసోర్సెస్ పరిరక్షణకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. అధ్యాపకులు విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

భవానీపురం, మార్చి 22 : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో వస్తే సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రజలకు అమలు పరిచే సూపర్‌సిక్స్ పథకాలను టీడీపీ నాయకులు ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. 44వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు నాలుగు స్థంభాల సెంటర్, ఎరుకుల బజార్‌ల్లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా వివరించారు. కస్లర్ ఇన్‌చార్జి బడుగు గణేష్, గుంజా ఏడుకొండలు, బాలు, గిరీష్, నాగరాజు పాల్గొన్నారు.



టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

రాణిగారితోట, మార్చి 22: బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ 18వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని బాలస్వామి వీధిలో జరిగిన ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య, సిద్దం నాగేందర్ రెడ్డి, ఆరెపల్లి సోమేశ్వరరావు, గంధ్ర రాజు, బీజేపీ నాయకులు రెడ్డెం ముఖేష్ రెడ్డి, మహలక్ష్మమ్మ పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

200వ బూత్ పరిధిలో: 18వ డివిజన్ 200వ బూత్ పరిధిలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. వేముల దుర్గారావు, వేజర్ల కాశయ్య, పీరుబాబు, పగడాల వేంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సెంట్రల్' ఫిర్యాదులకు వాట్సాప్ నంబర్

చిట్టినగర్, మార్చి 22: సెంట్రల్‌లో ఎన్నికల నియమావళికి సంబంధించి జరిగే ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయడానికి వీఎంసీ ప్రత్యేకంగా వాట్సాప్ నంబర్‌ను కేటాయించింది. 9959090025 నంబరు ఇందుకోసం కేటాయించింది. నియోజకవర్గంలో జరిగే ఉల్లంఘనలను ప్రజలు ఈ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు.

డ్రగ్స్ సూత్రధారులు, పాత్రధారులను అరెస్టు చేయాలి : కొలనుకొండ

వన్‌టౌన్, మార్చి 22: వైసీపీ పాలనలో ఏపీ డ్రగ్స్ రాజధానిగా మారిందనడంలో అతిశయోక్తి లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న గంజాయి, డ్రగ్స్ విక్రయాల వల్ల విద్యార్థులు, యువకులు బాధితులవుతున్నారన్నారు. లక్షల కోట్ల విలువైన 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడ్డాయంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో ఊహించుకోవచ్చునన్నారు. డ్రగ్స్ సూత్ర ధారులు, పాత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మొత్తంగా దీని మూలాలను అన్వేషించి నిగ్గు తేల్చాలని కోరారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ జోక్యం చేసుకుని ప్రజలకు వాస్తవాలు తెలిసేలా దర్యాప్తు చేయించాలన్నారు. సీఎం జగన్ కూడా రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడం అప్రజాస్వామికం

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఖాదర్‌బాషా

విద్యాధరపురం, మార్చి 22: ప్రతిపక్షాల గొంతు నొక్కడం అప్రజాస్వామికమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌కే ఖాదర్‌బాషా అన్నారు. శుక్రవారం ఆ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ విషయంలో బీజేపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల సంఘం కలుగజేసుకోవాలని కోరారు. మోదీ, అమిత్‌షాలను ఎవరు ప్రశ్నించినా ఈడీ, సీబీఐ, ఐటీ చేత దాడులు చేయించడం ఎన్నికల పొత్తును కుదుర్చుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. నిజంగా కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతదాడులు చేస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులందరూ జైలులో ఉంటారన్నారు.

ఏ పార్టీలోకి వెళ్లను: పోతిన మహేశ్

● పోతినకు సీటివ్వాలని కోరుతూ ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

వన్‌టౌన్, మార్చి 22: పశ్చిమ నుంచి పోతిన మహేశ్‌కు సీటు కేటాయించాలని, ఈ విషయంలో పవన్‌కల్యాణ్‌ను అంగీకరింప చేయాలని కోరుతూ శుక్రవారం ముస్లిం సోదర సోదరీ మణులు రంజాన్ ఉపవాసదీక్ష ప్రత్యేక ప్రార్థనలను పశ్చిమ జనసేన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిన మహేశ్ కూడా ఈ ప్రార్థనలలో పాల్గొన్నారు. తనకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై నమ్మకముందని ప్రకటించారు. తాను ఇంకే పార్టీలోకి వెళ్లనని, వేరే పార్టీకి పనిచేయనని, వేరే పార్టీ జండా మోయనని తెలిపారు. తనకు సీటు కేటాయించాలని కోరుతూ ముస్లిం సోదరీ సోదరీమణులు ప్రత్యేక ప్రార్థనలు చేయడం ఎంతో ఆనందంగా ఉందంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మొబీనా, అధికార ప్రతినిధి అబ్దుల్ నజీబ్, 46వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అమీర్ భాష, షర్మిల, హుసేన్, తదితరుల నాయకత్వాన పోతిన మహేశ్‌కు టికెట్ కేటాయించాలని కోరుతూ నినాదాలు చేశారు.



ముస్లింల ప్రార్థనలో పోతిన మహేశ్

పోతినకు సీటివ్వాలి

చిట్టినగర్: బీసీ ఉద్యమ నాయకుడు పోతిన మహేశ్‌కు పశ్చిమ సీటు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చిట్టినగర్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. కనిశెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ పశ్చిమ సీటును బీసీలకు కేటాయించాలన్నారు. సంఘనాయకులు అరుణ్‌కుమార్, పిళ్లా శ్రీనివాసరావు, దుర్గారావు, త్రినాథ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 95.43 శాతం మంది హాజరు

వన్‌టౌన్, మార్చి 22: జిల్లాలో శుక్రవారం జరిగిన పదవ తరగతి పరీక్షకు 31,695 మందికి 30,245 మంది పరీక్ష రాశారు. 1450 మంది గైర్హాజరు కాగా 95.43 శాతం హాజరు నమోదైంది. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ విజయవాడలోని ఏపీజే అబ్దుల్‌కలాం ఉర్దూ హైస్కూల్, ఐకాన్ హైస్కూళ్లలోని పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పాఠశాల విద్యాకమిషనర్ సురేష్‌కుమార్

కేశినేని చిన్ని విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు



పాతరాజరాజేశ్వరి పేట, మార్చి 22: కేశినేని శివనాథ్‌ను విజయవాడ తెలుగుదేశం పార్లమెంట్ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించిన సందర్భంగా పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ ఆధ్వర్యంలో 35వ డివిజన్ పూర్ణానందపేటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కేశినేని చిన్ని విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బూదాల నందకుమారి, టీడీపీ నాయకుడు ధనేకుల హరికృష్ణ, ఎస్. కుమారి, కె.రాజు శ్రీరామ్, మేరీ, కస్తీసునీత, అనురాధ కుమారి, దినేష్, సాయి పాల్గొన్నారు.

గాలీబ్ షహీద్ దర్గాలో రంజాన్ ప్రార్థనలు

భవానీపురం, మార్చి 22 : రంజాన్ మాసం ప్రారంభంలో భాగంగా శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భవానీపురంలోని అత్యంత పురాతనమైన గాలీబ్ షహీద్ దర్గాలో ముజావర్లు, దర్గా కమిటీ కార్యవర్గం ముస్తాక్, ఇషాక్‌ల ఆధ్వర్యంలో ముస్లింలు, మసీదు వీధిలో రజా మసీదులో కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నమాజ్‌లో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ

● లక్షలు వెచ్చించి నిర్మించిన యూజీడీ ఆరు నెలలకే పొంగుతున్న వైనం ● స్థానికుల ఆగ్రహం

రాణిగారితోట, మార్చి 22: నిండా ఆరు నెలలు గడవక ముందే లక్షలు ఖర్చు చేసి వేసిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగిపొర్లడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాణిగారితోట 18వ డివిజన్ బాలస్వామి వీధిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగిపొర్లుతుంది. గతంలో ఉన్న పైపులు చిన్నవి కావడంతో వాటిపైనే మరో పైప్ లైన్ నిర్మాణాన్ని కొనసాగించారు. పైప్ లైన్ వేసిన చాలా రోజులకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. తీరా ఇప్పుడు ఉదయం, సాయంత్రం అని తేడా లేకుండా నిత్యం డ్రెయినేజీ రోడ్డుపై పారుతోంది. అభివృద్ధి అంటూ ప్రజాధనం లక్షలు ఖర్చు చేసి గాంబీరాలు పోయిన వారు ఈ సమస్య తిరిగి ఉత్పన్నం కావడంపై సమాధానం చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ వ్యర్థాలు

మళ్లీ గోవా వెళ్లిన

దేవర

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'దేవర పార్ట్ 1. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన భారీ షెడ్యూల్ ఇటీవల గోవాలో జరిగింది. తాజా షెడ్యూల్ కూడా గోవాలో మొదలైంది. నృత్య దర్శకుడు రాజు సుందరం సారథ్యంలో ఓ మాంటేజ్ సాంగ్‌ను అక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ స్టిల్స్ మీడియాకు విడుదల



చేశారు. ఇందులో ఎన్టీఆర్ సరికొత్త లుక్‌తో కనిపించారు. ఓ కొత్త తరహా పాత్రలో ఆయన్ని చూడడానికి అభిమానులు, ప్రేక్షకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగాన్ని విజయదశమి సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'దేవర' గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేసిందనీ, ఇండియన్ సినిమాలోనే ఎక్కువ మంది చూసిన గ్లింప్స్‌గా సరికొత్త రికార్డ్ సృష్టించిందని నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ చెప్పారు. నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



ట్రాక్ రికార్డు కాదు టాలెంట్ ముఖ్యం అంటున్నారు మన హీరోలు. అందుకే ఒకట్రెండు సినిమాల అనుభవం ఉన్న దర్శకులకు సైతం అవకాశాల తివాచీ పరుస్తున్నారు. అరంగేట్రంతోనే అదరగొట్టిన దర్శకులకే కాదు, కమర్షియల్ సక్సెస్‌ను రుచి చూడని దర్శకులను సైతం మన హీరోలు ప్రోత్సహిస్తున్నారు. కొందరు సీనియర్లను కూడా పక్కనపెట్టి యువ దర్శకులతోనే సినిమాలు చేస్తుంటే, మరికొందరు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లను సైతం కుర్ర దర్శకుల చేతుల్లో పెడుతున్నారు.

యువ దర్శకులకే హీరోల ఓటు

సోషియో ఫాంటసీ డ్రామాగా తెరకెక్కుతోన్న 'విశ్వంభర' చిత్రంపై భారీ అంచనాలకు కారణం చిరంజీవి నటిస్తుండడమే అని చెప్పాల్సిన పనిలేదు. చిరంజీవిని డైరెక్ట్ చేయాలనేది ఎంతో మంది స్టార్ డైరెక్టర్ల కల. ఆయనకు కథ వినిపించి ఓకే చేయించుకునేందుకు పలువురు అగ్ర దర్శకులు ఎదురుచూస్తుంటారు. అలాంటిది రెండో చిత్రానికే చిరంజీవిని డైరెక్ట్ చేసే అవకాశం వశిష్ఠకు రావటానికి కారణం అతని ప్రతిభే! తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన 'బింబిసార' చిత్రం ఘన విజయం అందుకోవడంతో దర్శకుడిగా వశిష్ఠ పేరు ఇండస్ట్రీలో మార్మోగింది. హిట్ కోసం ఎదురుచూస్తున్న కల్యాణ్‌రామ్ కెరీర్‌ను ఈ చిత్రం మేలి మలుపు తిప్పింది. ఆ సినిమా సక్సెస్ వశిష్ఠకు ఈ అరుదైన అవకాశాన్ని అందించింది. 18 ఏళ్ల తర్వాత చిరంజీవి, త్రిష జత కడుతున్నారు. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. 2025 సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాన్న బాటలో

రామ్‌చరణ్ సైతం తండ్రి బాటలోనే నడుస్తున్నారు. దర్శకుడిగా కేవలం ఒక్క సినిమా అనుభవమున్న బుచ్చిబాబు సానాకు 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్)తో అవకాశమిచ్చారు. వైష్ణవ్‌తేజ్ నటించిన 'ఉప్పెన' చిత్రంతో దర్శకుడిగా ఆయన ఇండస్ట్రీ హిట్ ఇచ్చారు. ఇటీవలే చరణ్, బుచ్చిబాబు చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. జాన్వీ కపూర్ కథానాయిక.

ఒకరిద్దరు కాదు...

ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు యువ దర్శకులకు అవకాశమిచ్చారు శర్వానంద్. రామ అబ్బరాజు, శ్రీరామ్ ఆదిత్య, అభిలాష్ కంకరతో సినిమాలు పట్టాలెక్కించారు. తన మలి చిత్రంతోనే శర్వానంద్‌ను డైరెక్ట్ చేసే అవకాశం దక్కించుకున్నారు రామ్ అబ్బరాజు. కొన్నాళ్లుగా ఫ్లాప్‌లతో సతమతమవుతున్న శ్రీవిష్ణుకు 'సామజవరగమన' రూపంలో ఘన విజయం అందించి ఆయన పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు. శర్వా, కృతీశెట్టి జంటగా నటిస్తున్న 'మనమే' చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. లండన్ నేపథ్యంలో సాగ ఈ తరం యువతీ యువకుల ప్రేమకథ నేపథ్యంలో రూపొందుతోంది. గతంలో శ్రీరామ్ చేసిన సినిమాల్లో భారీ హిట్లు లేవు. కానీ అతని టాలెంట్‌ను గుర్తించి శర్వానంద్ అవకాశం ఇచ్చారు. టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'లూజర్' వెబ్‌సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న అభిలాష్



కంకరతో శర్వా మరో చిత్రం చేస్తున్నారు. బైక్ రేసింగ్ కాన్సెప్ట్ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. శర్వాకు 'రన్‌రాజా రన్, మహానుభావుడు' లాంటి హిట్లు ఇచ్చిన యూవీ క్రియేషన్స్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. వంశీ-ప్రమోద్ నిర్మిస్తున్నారు. మాళవికా నాయర్ కథానాయిక.

ఏరీ కోరి యువజోడీ

డీజే టిల్లు చిత్రంతో హీరోగా స్టార్ స్టేటస్‌ను సొంతం చేసుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఇప్పుడు ఆయనతో సినిమాలు చేసేందుకు పలువురు సీనియర్ దర్శకులు తహతహలాడుతున్నారు. ఆయన మాత్రం తన క్రేజీ ప్రాజెక్ట్ 'టిల్లూ స్క్వేర్'ను అంతగా ఫేమస్ కానీ యువ దర్శకుడి చేతుల్లో పెట్టి వెన్ను తట్టారు.

గతంలో 'నరుడా డోనరుడా', 'అద్భుతం' అనే చిత్రాలను తెరకెక్కించిన మల్లిక్‌రామ్ దీనికి దర్శకుడు. ఆ చిత్రాలు అంతగా ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. అయినా మల్లిక్‌రామ్ గురించి తెలిసిన సిద్ధు అతనితో ఓ సినిమా చేయాలనుకున్నారు కానీ కుదరలేదు. ఇప్పుడు ఈ చిత్రం చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఈ నెల 29న 'టిల్లూ స్క్వేర్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. తన మరో చిత్రానికి సైతం సిద్ధు జొన్నలగడ్డ కొత్త డైరెక్టర్‌తో పని చేస్తున్నారు. ఆయన నటిస్తున్న 'తెలుసు కదా' అనే చిత్రంతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ్ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు.

పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లోకి

'కార్తికేయ 2' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా నిలదొక్కుకున్నారు నిఖిల్ సిద్ధార్థ. ఆయనతో సినిమాలు చేసేందుకు అగ్ర దర్శకులు ఉత్సాహం చూపిస్తున్నారు. నిఖిల్ మాత్రం ఏరీ కోరీ కొత్త దర్శకులకు అవకాశం ఇస్తున్నారు. ఆయన తన గత చిత్రం 'స్పై'తో ఎడిటర్ గ్యారీ బీహెచ్‌ను దర్శకుడిగా పరిచయం చేశారు. ఈసారీ కొత్త దర్శకుడినే తన సినిమా కోసం రంగంలోకి దించారాయన. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ' చిత్రానికి భరత్ కృష్ణమాచారిని దర్శకుడిగా తీసుకున్నారు. తమిళ దర్శకుడు మిస్కిన్ వద్ద సహాయకుడిగా పనిచేసిన భరత్ తొలి చిత్రంతోనే నిఖిల్ లాంటి స్టార్‌ను డైరెక్ట్ చేసే అవకాశం అందుకున్నారు. ప్రచార చిత్రాలతోనే తన సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెంచిన తీరుతో నిఖిల్ ఖాతాలో మరో భారీ హిట్ ఖాయం అంటున్నారు పరిశ్రమ జనాలు.

సాహో జంట

మలి చిత్రం 'సాహో' తోనే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌ను డైరెక్ట్ చేశారు సుజిత్. ఆ సినిమా అభిమానుల అంచనాలు అందుకోలేకపోయింది. అయినా సుజిత్ టేకింగ్ మన అగ్రహీరోలను మెప్పించింది. పవన్ కల్యాణ్‌తో 'ఓజీ' అవకాశం అందిపుచ్చుకున్నారు. ఈ సినిమా ప్రచార చిత్రాలతోనే తనమార్క్ చూపించారు సుజిత్. ఆ చిత్రం సెట్స్‌పైన ఉండగానే నానితో మరో సినిమా (నాని 32)ను ఆయన ఓకే చేయించుకున్నారు. నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రాన్ని నిర్మిస్తున్న డీవీవీ ఎంటర్టైన్మెంట్స్‌లోనే 'నాని 32' సైతం రూపుదిద్దుకోనుంది.



యువతకే మేజర్

మేజర్ చిత్రంతో ఉత్తరాదినా విజయ పతాక ఎగురవేశారు అడివి శేష్. ప్రస్తుతం తను నటిస్తున్న రెండు చిత్రాలను యువ దర్శకుల చేతిలో పెట్టారు. 'గూఢచారి 2' చిత్రీకరణలో ఉంది. పాన్ ఇండియా లెవల్లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడును శేష్ దర్శకుడిగా ఎంచుకున్నారు. డైరెక్టర్‌గా ఆయనకు ఇదే తొలి చిత్రం. శేష్ నటించిన 'మేజర్' చిత్రానికి ఆయన ఎడిటర్‌గా పనిచేశారు. ఆ సమయంలో వినయ్‌లోని టాలెంట్‌ను పసిగట్టిన శేష్ 'గూఢచారి 2' లాంటి భారీ ప్రాజెక్ట్‌ను ఆయన చేతుల్లో పెట్టారు. అడివి శేష్ హీరోగా నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'డెకాయిట్'తో కెమెరామ్యాన్ షానీ డియోల్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆయనే కథను అందిస్తున్నారు. శ్రుతీహాసన్ కథానాయిక. మాజీ ప్రేమికుల జంట మధ్య శత్రుత్వం నేపథ్యంలో కథ సాగుతుందని యూనిట్ తెలిపింది.

'సెహరి' అనే చిన్న చిత్రంతో ఇండస్ట్రీకి దర్శకుడిగా పరిచయమయ్యారు జ్ఞానసాగర్ ద్వారక. ఆ సినిమాకు మంచి టాక్ వచ్చినా కమర్షియల్ సక్సెస్ రాలేదు. అయితే సుధీర్‌బాబు అతని ప్రయత్నాన్ని మెచ్చి అవకాశం ఇచ్చారు. వారి కలయికలో 'హరోం హర' చిత్రం వస్తోంది. 1980ల నాటి కుప్పం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

• తొలి చిత్రం 'దసరా'తోనే దర్శకుడిగా భారీ కమర్షియల్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు శ్రీకాంత్ ఓదెల. ఆ తర్వాత ఆయన ప్రభాస్, ఎన్టీఆర్‌తో సినిమా చేయబోతున్నట్లు వార్తలు వచ్చాయి. శ్రీకాంత్ వాటిపై స్పష్టత ఇస్తూ తన రెండో చిత్రం కూడా నానితోనే చేయబోతున్నట్లు చెప్పారు.

మరిన్ని యువ కెరటాలు

పలువురు మీడియం రేంజ్ హీరోలు సైతం కొత్త దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. నితిన్‌తో 'ఛల్ మోహన్ రంగ', నారా రోహిత్‌తో 'రౌడీ ఫెలో' చిత్రాలను తెరకెక్కించారు కృష్ణచైతన్య. ఆ రెండు చిత్రాలు నిరాశపరిచినా రెట్టించిన ఉత్సాహంతో విష్వక్సేన్ హీరోగా నటిస్తున్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం అందిపుచ్చుకున్నాడు. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికి మల్లి అంకం దర్శకత్వ వహిస్తున్నారు. సుకుమార్ శిష్యుడు అర్జున్ సుహాస్‌తో సినిమా ఓకే చేయించుకున్నాడు. వారి కలయికలో 'ప్రసన్నవదనం' చిత్రం రూపొందుతోంది.



రస్టిక్ లవ్‌స్టోరీ.. షూట్ డైరీస్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న 'తండేల్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంతో జరుగుతోంది. దేశభక్తి అంశాలు కలిగిన ఈ రస్టిక్ లవ్‌స్టోరీని చందు మొండేటి రూపొందిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 'తండేల్' సెట్స్‌లో నాగచైతన్య, అల్లు అరవింద్, సాయిపల్లవి, చందు మొండేటి, నిర్మాత బన్నీ వాసు ఉన్న వర్కింగ్ స్టిల్స్‌ను షూట్ డైరీస్ పేరుతో విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి ఇద్దరూ పాత్రలకు తగినట్లుగా డీ గ్లామరెస్‌గా కనిపిస్తున్నారు. ఒక ప్రామాణికంగా ఈ కథను చెప్పాలని దర్శకుడు చందు నటీనటుల గెటప్స్, కాస్ట్యూమ్స్, యాస విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తండేల్ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు.

ఈ సినిమా కోసం బరువు పెరిగి, 31 కిలోలు తగ్గా



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. మలయాళ, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగులో ప్రేక్షకులకు అందిస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ' తొంభైవ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి నజీబ్ అనే వ్యక్తి తన ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ ఓ పుస్తకం రాశారు. 2008లో వచ్చిన ఆ పుస్తకం ఎంతో పాపులర్ అయింది. మలయాళ చిత్ర పరిశ్రమలో చాలా మంది ఆ నవల హక్కులు కొనాలని ప్రయత్నించారు కానీ మా దర్శకుడు బ్లెస్సీ సాధించారు. ఇందులో నజీబ్‌గా నేను నటించా. 2009లో ఈ సినిమా అనుకున్నాం. కానీ భారీ బడ్జెట్ అవసరం కావడంతో వెనుకంజ వేశాం. ప్రాంతీయ సినిమాల మార్కెట్ పరిధి పెరగడంతో పదేళ్ల తర్వాత 2018లో షూటింగ్ ప్రారంభించాం. ఈ చిత్రం కోసం నేను మొదట బరువు పెరిగి ఆ తర్వాత 31 కిలోలు తగ్గా. ఏడాదిన్నర పాటు అల్జీరియాలోని టిము హౌస్ అనే ప్రాంతంలో షూటింగ్ చేశాం. సహార ఎడారి మధ్యలో ఉంటుందా లొకేషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏడాదిన్నర పాటు జరిగాయి' అని వివరించారు. 'ఈ సినిమాను మొదట రాజస్థాన్ ఎడారిలో తీయాలనుకున్నాం. అయితే డీప్ డిజర్ట్ దొరకలేదు. అందుకే విదేశాలకు వెళ్లి షూటింగ్ చేశాం. ఏడారిలోనే 150 రోజులు షూట్ చేశాం. బడ్జెట్ పెరిగినా మేం అనుకున్న ఫీల్ తీసుకురాగలిగాం' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. సమావేశంలో పాల్గొన్న హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్ తను నటించిన తొలి భారతీయ చిత్రమిదని చెప్పారు. నజీబ్‌కు సాయం చేసే కీలక పాత్ర తనదని తెలిపారు. ఇలాంటి అద్భుత చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

కష్టపడే వాళ్లే ఫ్యామిలీ స్టార్లు

దిల్ రాజు



తమ కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కష్టపడేవాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని నిర్మాత దిల్ రాజు అన్నారు. శుక్రవారం తెలుగు సినీ జర్నలిస్టుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా సినిమాకు 'ఫ్యామిలీస్టార్' అని డిఫరెంట్ టైటిల్ పెట్టినప్పుడు చాలా మంది ఏమనుకున్నారంటే, 'విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికే ఇలాంటి టైటిల్ పెట్టారు' అని అనుకున్నారు. ఈ టైటిల్ పెట్టడానికి ఓ కారణం ఉంది. మీరంతా మీ కుటుంబాలను వృద్ధిలోకి తెచ్చేందుకు కష్టపడుతున్నారు. అలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని చెప్పడమే మా ఆలోచన. నాలాంటి వాళ్లం సినీ రంగంలోకి వచ్చి ప్రయోజకులమై మా కుటుంబానికి సంఘంలో ఒక గౌరవం కల్పించాం. అందుకే మాలాంటి వాళ్లు, మీలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే. అదే మా ఫ్యామిలీ స్టార్ టైటిల్ కథ. అంతేగానీ విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికి ఈ సినిమా చేయలేదు. దిల్ రాజు బ్రాండ్‌తో వచ్చే ఒక కుటుంబ కథా చిత్రం అంటే చాలా గొప్పగా ఉంటుంది. ఆ పేరు నిలబెడుతుంది. మీ అందరిలోనూ ఫ్యామిలీ స్టార్లు ఉన్నారు అని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అని తెలిపారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పరశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

పార్టీ కాదు పెద్ద బాధ్యత



'ఇప్పటిదాకా నా జీవితంలో శని, ఆదివారాలు రిలాక్స్ అవ్వడం అనేది లేదు. ఏదో ఒక సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండేదాన్ని. ఆ రోజున ఫ్రెండ్స్ కలుద్దామని అడిగినా వీలు కాదని చెప్పేదాన్ని. ఇక నుంచి వారాంతంలో రిలాక్స్ అవ్వడం గురించి ఆలోచిస్తున్నాను' అని అన్నారు తమన్నా. నటుడు విజయ్ వర్మతో ఆమె ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. త్వరలోనే వారిద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఈనేపథ్యంలో తన జీవితంలో సరికొత్త మార్పుకు శ్రీకారం చుడుతున్నట్లు తమన్నా తెలిపారు. 'పెళ్లంటే పార్టీ కాదు. అది చాలా పెద్ద బాధ్యత. జీవితం పూర్తి భిన్నంగా ఉంటుంది. షూటింగ్ పూర్తి చేసుకొని సాయంత్రానికల్లా ఇంటికి చేరి పిల్లలతో గడపాలి. ఎందుకంటే అదే భూమ్మీద మనం సంతోషంగా ఉండే ప్లేస్. ఇదంతా తలుచుకున్నప్పుడల్లా ఎంతో ఉద్విగ్నంగా అనిపిస్తుంది' అని తమన్నా అన్నారు.

డబుల్ ధమాకా



సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రం యూత్‌ను బాగా అలరించింది, ఇప్పుడు దానికి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్' చిత్రం అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుంది. సెన్సార్ ఫార్మలిటీస్ కూడా అవడంతో ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. 'డీజె టిల్లు' చిత్రం కంటే రెట్టింపు వినోదం ఈ సినిమా అందిస్తుందనీ, ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు అలరిస్తాయని దర్శకనిర్మాతలు చెప్పారు. టిల్లు డబుల్ ధమాకా ను చిత్రంలో చూడవచ్చని అన్నారు. ఈ సినిమాలో లిల్లీ పేరు కలిగిన బోల్డ్ క్యారెక్టర్‌ను అనుపమ తన కెరీర్‌లోనే తొలిసారిగా పోషించిందని చెప్పారు. లిల్లీతో టిల్లు ప్రయాణం కూడా విభిన్నంగా ఉంటుందని అన్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 23 మార్చి 2024



రంగుల పండగ హోలీ రోజు రంగు నీళ్లలో తడుస్తాం, రంగుల్లో మునకలేస్తాం. అయినా మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే అందుకు కొన్ని చిట్కాలు పాటించాలి.

మేకప్

హోలీ కేళీ

వాటర్‌ప్రూఫ్ కలర్స్

ఈ రోజు వాడే మేకప్ ఉత్పత్తులన్నీ వాటర్‌ప్రూఫ్ అయి ఉండేలా చూసుకోవాలి. ఫౌండేషన్, మస్కారా, ఐలైనర్, లిప్‌స్టిక్ నీరు కారిపోకుండా ఉండడం కోసం, వాటర్‌ప్రూఫ్ ప్రొడక్ట్స్ మాత్రమే ఎంచుకోవాలి.

ప్రైమర్ ఇలా...

మేకప్‌కు అనువుగా చర్మాన్ని సిద్ధం చేయడంతో పాటు చర్మ రంధ్రాలు కనిపించకుండా చేయడం కోసం మొదట ఫేస్ ప్రైమర్ అప్లై చేయాలి. అలాగే నీళ్ల చిందినా చెక్కుచెదరకుండా ఉండడం కోసం నాణ్యమైన ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. వీటిలో ఫుల్ కవరేజ్ ఫౌండేషన్లు 24 గంటల పాటు నిలిచి ఉంటాయి. అలాగే మచ్చలు, డాగులను దాచడం కోసం కాన్‌సెంట్రేటెడ్ స్పాట్ కరెక్టింగ్ కన్‌సీలర్ వాడుకోవాలి. చివర్లో సెట్టింగ్ పౌడర్‌తో మేకప్ ముగించాలి.

రంగులద్దుకోవాలి

ముఖానికి హోలీ కళ తెచ్చిపెట్టడం కోసం గులాబీ రంగు బ్లష్‌ను చెక్కిళ్ల మీద అప్లై చేసుకోవాలి. అలాగే కనురెప్పలకు అదే రంగు మ్యాట్ లేదా షిమ్మర్ ఐషాడో అప్లై చేసుకోవాలి. కనురెప్పల చివర్లలో డీప్ బ్రౌన్ లేదా నలుపు రంగు షాడో అప్లై చేయాలి. మరింత గ్లామరస్ లుక్ కావాలనుకునేవాళ్లు గోల్డ్ ఐషాడో కూడా వాడుకోవచ్చు.

పెదవుల కోసం...

హోలీ కళ తెచ్చిపెట్టేలా గులాబీ లేదా ఎరుపు షేడ్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. అది వాటర్‌ప్రూఫ్ అయి ఉండాలి. లిప్‌స్టిక్ అప్లై చేసిన తర్వాత, అదనపు రంగును బ్లాటింగ్ పేపర్‌తో తొలగించి అవసరమనుకుంటే లిప్ గ్లాస్ అప్లై చేసుకోవచ్చు.

వంటిల్లు

వారెవ్వా స్నాక్స్

స్నాక్స్ అంటే ఎవరికైనా ఇష్టమే. సాయంకాలం పూట విభిన్నంగా చేసుకునే రుచికరమైన స్నాక్స్ కొన్ని ఉన్నాయి. అవే పోహ నగ్గెట్స్, భర్వన్ ఆలూ తిన్లాజ్, బ్రెడ్ పిజ్జా పాకెట్స్, పనీర్ గోల్డెన్ ఫ్రై. వీటిని సులువుగా చేసుకోవచ్చు ఇలా...

పోహ నగ్గెట్స్

కావాల్సిన పదార్థాలు:

పోహ- 1 కప్పు, బంగాళ దుంపలు- 2, పచ్చి మిరపకాయ- 1 (సన్నగా తరగాలి), అల్లం- 2 చిన్న ముక్కలు (సన్నగా తరగాలి), ఎండు మిరప గింజలు- అర టీస్పూన్, వామాకు పొడి- అర టీస్పూన్, పెప్పర్ పౌడర్- పావు టీస్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు (సన్నగా తరగాలి), ఉప్పు- రుచికి తగినంత, మైదా- పావు కప్పు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం:

ముందుగా బంగాళదుంపలను ఉడకబెట్టి.. వాటి తొక్క తీసి మెత్తగా చేసుకోవాలి. ఆ తర్వాత పోహను జార్‌లో వేసి మెత్తటి పిండిలా మిక్సీ పట్టాలి. ఈ పిండిలో బంగాళదుంపల మిశ్రమాన్ని వేయాలి. సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వామాకు పొడి, పెప్పర్ పౌడర్, కొత్తిమీర, ఉప్పు వేసి మిశ్రమాన్ని మెత్తగా కలపాలి. చపాతీ ముద్దలా చేసుకోవాలి. ఆ తర్వాత మైదా పిండి వేయాలి. ముద్దలో మైదాపిండి బాగా కలిసేట్లు కలపాలి. ఆ తర్వాత కొంచెం కొంచెం తీసుకుని.. చిన్న లడ్డులా చేసుకోవాలి. దీన్ని చిన్నపాటి ఫింగర్స్‌లా చేసుకోవాలి. నూనెను వేడిచేసి ఈ పోహ ఫింగర్స్‌ను నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. సాయంత్రం పూట చేసుకుని ఈ స్నాక్స్ తినాలి. పిల్లలు బాగా ఇష్టపడతారు.



పనీర్ గోల్డెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు:

పనీర్- 200 గ్రాములు, గరం మసాలా పౌడర్- 1 టీస్పూన్, బ్రెడ్ క్రంబ్స్- పావు కప్పు, నిమ్మరసం- 4 టీస్పూన్లు, బ్లాక్ పెప్పర్- పావు టీస్పూన్, కారం పొడి- పావు టీస్పూన్, కార్న్ ఫ్లోర్- పావు కప్పు, ధనియాలపొడి- 1 టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం:

బౌల్‌లో కార్న్ ఫ్లోర్, ఉప్పు, బ్లాక్ పెప్పర్, కారంపొడి, గరం మసాలా, ధనియాల పొడి వేసి కొద్దిగా నీళ్లు పోసి చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత మరో బౌల్‌లో పనీర్ ముక్కలను కట్ చేసి వేయాలి. పనీర్ ముక్కల మీద నిమ్మరసం వేసి.. నిమ్మరసం పనీర్ ముక్కలకు అంతా తగిలేట్లు కలపాలి.

పనీర్ ముక్కలను తీసుకుని కార్న్‌ఫ్లోర్‌లో ముంచి వీటిని బ్రెడ్ క్రంబ్స్‌లో వేయలి. బ్రెడ్ క్రంబ్స్ అతుక్కుపోతాయి. ప్యాన్‌లో నూనె వేసి ఈ పనీర్ క్యూబ్స్‌ను గోల్డెన్ రంగు వచ్చే వరకు వేయించాలి. వీటిని పుదీనా చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.



భర్వన్ ఆలూ తిన్లాజ్

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజ్ బంగాళదుంపలు- 4, పచ్చి బఠాణీలు- 60 గ్రాములు, పనీర్- 30 గ్రాములు (సన్నగా తరగాలి), తెల్ల నువ్వులు- 30 గ్రాములు, గరం మసాలా పౌడర్- 5 గ్రాములు, నెయ్యి- 30 గ్రాములు, కోవా- 100 గ్రాములు, జీడిపప్పు- 60 గ్రాములు, జీలకర్ర పొడి- 5 గ్రాములు, కారంపొడి- 5 గ్రాములు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, ఉప్పు- రుచికి తగినంత

తయారీ విధానం

ముందుగా నువ్వులను వేయించాలి. ఆ తర్వాత బంగాళదుంపల తొక్కలను పీలర్‌తో తీయాలి. బంగాళదుంపల రెండు చివర్ల కూడా కట్ చేయాలి. బంగాళదుంపలను రోల్‌లా చేసుకోవాలి. బంగాళదుంప మధ్యలో మిశ్రమాన్ని చిన్న కత్తి లేదా పీలర్‌తో బయటకు తీయాలి. లోపల్ స్టఫ్ కూరటానికి ఇలా చేసుకోవాలి. నూనె తీసుకుని మీడియమ్ ఫ్లేమ్‌లో ఈ స్క్కూప్డ్ బంగాళదుంపలను రంగు మారేంత వరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత వీటిని పక్కన ఉంచుకోవాలి.

స్టఫ్ కోసం మొదట ప్యాన్ తీసుకుని అందులో కొద్దిగా నూనె లేదా నెయ్యిని వేయాలి. నూనె హీట్ అయ్యాక కోవా, పచ్చి బఠాణీలు, క్రష్ చేసిన జీడిపప్పు ముక్కలు, తగినంత ఉప్పు, కారంపొడి, గరం మసాలా, జీలకర్ర పొడి వేయాలి. మిశ్రమాన్ని కలుపుతూ నాలుగు నిముషాల పాటు వేయించాలి. ఈ స్టఫ్‌ను ఒక ప్లేట్‌లో ఉంచుకోవాలి. నాలుగు బంగాళదుంపల్లో స్టఫ్‌ను కూరాలి. ఆ తర్వాత వీటిని తందూరి పొయ్యిమీద పది నిముషాల పాటు వేడి చేశాక.. వీటికి కొద్దిగా నెయ్యి పట్టించి.. చివరగా వేయించిన నువ్వులలో ఈ స్టఫ్డ్ బంగాళదుంపల్ని రోల్ చేయాలి. నువ్వులన్నీ బంగాళదుంపలకు అతుక్కుంటాయి. భర్వాన్ ఆలూ తిన్లాజ్ రెడీ. బంగాదుంపల్ని రెండు ముక్కలుగా కట్ చేసి టమోటా కెచప్ లేదా పుదీనా చట్నీతో తింటే రుచిగా ఉంటుంది.



బ్రెడ్ పిజ్జా పాకెట్స్

కావాల్సిన పదార్థాలు

వెన్న- 1 టీస్పూన్, వెల్లుల్లి-1 (సన్నగా తరగాలి), పెద్ద ఉల్లిపాయ- సగం (సన్నగా తరగాలి), క్యారెట్- 1 (సన్నగా తరగాలి), స్వీట్ కార్న్- 3 టేబుల్ స్పూన్లు, క్యాప్సికం- సగం (సన్నగా తరగాలి), ఉప్పు- రుచికి తగినంత, పిజ్జా సాస్- 3 టేబుల్ స్పూన్లు, ఆలివ్ ముక్కలు- 2 (గుండ్రంగా కట్ చేసుకోవాలి), చీజ్- పావుకప్పు, బ్రెడ్ ముక్కలు- 5

తయారీ విధానం

ప్యాన్‌లో వెన్న వేసి కరిగిన తర్వాత వెల్లుల్లి ముక్కలు వేసి గరిటెతో బాగా కలపాలి. ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ కదుపుతూ వేయించాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన క్యారెట్ ముక్కలు, స్వీట్ కార్న్, క్యాప్సికం ముక్కలు వేశాక రుచికి సరిపడ ఉప్పు వేసి గరిటెతో బాగా కలపాలి. హైఫ్లేమ్‌లో కుక్ అయ్యేంత వరకూ గరిటెతో కదుపుతూ వేయించుకోవాలి. పిజ్జా సాస్ వేసి మిశ్రమంలో కలిసేట్లు కలపాలి. రెండు మూడు నిముషాలు వేగించాక స్టఫ్ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వేసుకోవాలి. దీన్ని చల్లబర్చాలి. ఆ తర్వాత ఆలివ్ ముక్కలు వేశాక చీజ్ వేసి బాగా మిశ్రమాన్ని కలపాలి.

చివరగా ఐదు చతురస్రాకారం బ్రెడ్ ముక్కలను తీసుకుని వాటికి నాలుగు పక్కల ఉండే గోధుమరంగు చివరి లేయర్‌ను కట్ చేసుకోవాలి. ఇపుడు ఒక్కో బ్రెడ్ ముక్క తీసుకుని రోటీ మేకర్ కట్టెతో గట్టిగా చపాతీ చేసినట్లు అనాలి. ఇప్పుడు మధ్యలో స్టఫ్ ఉంచి దీన్ని చివర్ల కొద్దిగా నీళ్లు తగిలిస్తే చాలు రెండు వైపులా క్లోజ్ అవుతుంది. అలా అన్నీ చేసుకోవాలి. వీటన్నింటినీ డీప్ ఫ్రై చేసుకుని.. టమోటా కెచప్‌తో తినేయవచ్చు.



అన్నయ్య ఆట చూడడానికి మైదానానికి వెళితే... బౌండరీ దాటిన బంతి ఆమె చేతికి దొరికింది. దాన్ని తిరిగి మైదానంలోకి విసిరితే... స్టంప్ ఎగిరిపడింది. అదే ఆమె జీవితాన్ని అనుకోని మలుపు తిప్పింది. ఇప్పుడు ఆ అమ్మాయే ఐసీసీ మహిళల టీ20, వన్డే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో నిలిచింది. ఐసీసీ టీ20 అంతర్జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఏకైక భారత మహిళా క్రికెటర్‌గానూ చరిత్ర సృష్టించింది. తాజాగా 'ఫోర్బ్స్' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ విమెన్-2024' జాబితాకు ఎక్కిన మేటి ఆల్‌రౌండర్... దీప్తీశర్మ జర్నీ ఇది...

సవాళ్లకు సిద్ధం

ఇటీవల ఓ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో 'నీకు క్రికెట్‌లో ఇష్టమైంది ఏంటి..? బౌలింగా? బ్యాటింగా?' అని అడిగితే వెంటనే చెప్పలేకపోయింది దీప్తీ భగవాన్ శర్మ. 'ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం చాలా కష్టం' అన్న దీప్తి... 'బ్యాటింగ్, బౌలింగే కాదు... క్రికెట్‌లో ఫీల్డింగ్ కూడా నేను ఆస్వాదిస్తా' అంటూ చెప్పుకొచ్చింది. క్రికెట్‌ను దీప్తి ఎంతగా ప్రేమిస్తుందో... ఆమెను క్రికెట్ కూడా అంతే ఇష్టపడుతుంది. ఇది ఆటను అభిమానించేవారి మాట. ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో పుట్టిన దీప్తీకి తొమ్మిదేళ్లప్పుడే క్రికెట్‌పై ఆసక్తి కలిగింది. ఆమె తండ్రి భగవాన్ శర్మ భారతీయ రైల్వేలో బుకింగ్ సూపర్‌వైజర్‌గా రిటైర్ అయ్యారు. తల్లి సుశీల గృహిణి. సంతానంలో అందరికంటే దీప్తీనే చిన్న. ఆమె అన్నయ్య సుమిత్ శర్మ ఉత్తర ప్రదేశ్ జట్టు మాజీ పేస్ బౌలర్. అన్నను చూసే దీప్తీకి ఆటపై మరింత మక్కువ పెరిగింది. తనను కూడా మైదానానికి తీసుకువెళ్లేలా అన్నను ఒప్పించమని రోజూ నాన్నను అడిగేది. అన్నయ్య మ్యాచ్‌లు, నెట్ ప్రాక్టీస్ చూడాలనేది దీప్తీ కోరిక.



రాత మార్చిన త్రో...

అలా ఒక రోజు ఆగ్రాలోని 'ఏకలవ్య స్పోర్ట్స్ స్టేడియం'కు వెళ్లిన దీప్తీ... దూరం నుంచి అన్నయ్య, అతని సహచర ఆటగాళ్ల నెట్ ప్రాక్టీస్ చూస్తోంది. ఇంతలో ఓ బంతి దూరాన ఉన్న ఆమె దగ్గరకు వచ్చి పడింది. ఆ బంతిని నెట్స్ వైపు వేయమని అన్నయ్యావాళ్లు అడగడంతో... దీప్తీ బలంగా విసిరింది. యాభై మీటర్లకు పైగా దూరం నుంచి ఆమె విసిరిన ఆ బంతి... నేరుగా దూసుకువచ్చి స్టంప్స్‌ను గిరాటేసింది. అంత చిన్న వయసులో దీప్తీ వేసిన ఆ త్రోకు అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యం అక్కడే ఉన్న నాటి భారత మహిళా క్రికెట్ జట్టు సెలెక్టర్ హేమలత కంట్లో పడింది. ఇక దీప్తీ జీవితం అనుకూని మలుపు తిరిగింది. అప్పటి నుంచి ఆమె క్రికెట్‌కు అంకితమైంది.

ఎంపిక చేయకపోయినా...

ఆరంభంలో దీప్తీకి ఆమె అన్నయ్య సుమిత్‌శర్మ కోచింగ్ ఇచ్చేవాడు. తొలి రోజుల్లో దీప్తీ రైట్ ఆర్మ్ మీడియమ్ పేసర్. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్. పదిహేనేళ్లు వచ్చేసరికి వివిధ దశల్లో ఆడి ఎంతో అనుభవం గడించింది. అయితే రాష్ట్ర స్థాయి జట్టు సెలక్షన్స్‌లో సెలక్టర్లు ఆమెను పట్టించుకునేవారు కాదు. అది నిరాశ పరిచినా... మరింత పట్టుదలతో శ్రమించింది. ఆ క్రమంలోనే ఆల్‌రౌండర్‌గా దీప్తీ ప్రతిభను భారత మాజీ క్రికెటర్ రీతా డే గమనించారు. ఆమెలోని అద్భుతమైన నైపుణ్యానికి మెరుగులు అద్దాలని నిర్ణయించుకున్నారు. దీప్తీకి మార్గదర్శకురాలిగా మారారు. మీడియమ్ పేసర్ అయిన దీప్తీ నిదానంగా ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మారింది. కానీ ఆ పరివర్తన అంత సులువుగా జరగలేదు. ఏదో కష్టంగా బంతి రిలీజ్ చేస్తున్నట్టు, అసహజంగా, లయ తప్పినట్టు ఉండేది ఆమె బౌలింగ్ యాక్షన్. దీనిపై దృష్టి పెట్టి... స్థానిక కోచ్‌లు, సెలెక్టర్ల శిక్షణ, పర్యవేక్షణలో కొద్ది కాలంలోనే స్పిన్ బౌలింగ్‌లో మాస్టర్ అయింది దీప్తీ.

> **సెంచరీనా... ఐదు వికెట్లా..!**
>
> జనవరిలో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ సందర్భంగా దీప్తీశర్మ పొట్టి ఫార్మాట్‌లో 1000 పరుగులు, 100 వికెట్లు పూర్తి చేసుకుంది. ఈ ఘనత సాధించిన ఏకైక భారత మహిళా ఆల్‌రౌండర్‌గా నిలిచింది. భారత మహిళా క్రికెట్ జట్టుకు వెన్నెముకగా మారిన దీప్తీని 'సెంచరీ కొట్టడమా..? ఐదు వికెట్లు తీయడమా? దేనికి నీ ఓటు' అని అడిగితే... ఆమె సెంచరీనే ఎంచుకుంది. 'ఎందుకంటే... బాగా పరుగులు చేస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపిస్తారనే ఆలోచన. దానివల్ల క్రీజ్‌లో కుదురుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుంది. జట్టు కోసం మరిన్ని పరుగులు చేసే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రస్తుతం నాకు సెంచరీనే ముఖ్యం. అలాగని ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీయడం తక్కువని కాదు' అంటూ చెప్పుకొచ్చింది దీప్తీ. 'నెట్స్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు ఒక బంతికి మూడు రకాల షాట్లకు సన్నద్ధమై ఉంటాను. పవర్‌ప్లే, మిడిల్ ఓవర్స్, డెత్ ఓవర్స్... జట్టు అవసరానికి తగినట్టు ఏ సమయంలోనైనా బౌలింగ్ వేయగలిగేలా సిద్ధం అవుతా' అంటున్న దీప్తీకి క్రికెట్ అంటే ఆట మాత్రమే కాదు... జీవితం కూడా.

అదిరిపోయే ఆటతో...

పట్టు వదలని ప్రయత్నంతో రాష్ట్ర జట్టుకు ఎంపికైన దీప్తీ... ఇక వెనుదిరిగి చూడలేదు. ఉత్తరప్రదేశ్ జట్టు తరుపున అద్భుతమైన ప్రదర్శనలతో ఆల్‌రౌండర్‌గా అందరినీ ఆకట్టుకుంది. చివరకు ఆమె ఆశయం ఫలించింది. కల నెరవేరింది. భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. 2014 నవంబర్... బెంగళూరు చిన్నస్వామి స్టేడియం... దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌తో దీప్తీ



విన్నర్

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. మూడేళ్లకు బెంగాల్ జట్టుకు మారింది. తరువాత భారత టెస్ట్, టీ20 మహిళా జట్లలో స్థానం సంపాదించింది. ఇప్పుడు ఆల్‌రౌండర్‌గా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. 2017... మహిళల వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్. ప్రత్యర్థి ఆస్ట్రేలియా బౌలర్లను చెండాడిన హర్మన్‌ప్రీత్ కౌర్... 171 పరుగులతో అజేయంగా నిలిచింది. 'ఒకవేళ దీప్తీశర్మ కనుక సరైన భాగస్వామ్యం ఇవ్వకపోయి ఉన్నా... స్ట్రయిక్ రొటేట్ చేయకపోయినా హర్మన్‌ప్రీత్ ఈ ఘనత సాధించగలిగేది కాదు' అంటూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, కామెంటేటర్ లిసా స్తాలేకర్ కొనియాడారు. ప్రస్తుతం ఆమె దీప్తీ ప్రాతినిధ్యం వహిస్తున్న డబ్ల్యూపీఎల్ (విమెన్ ప్రీమియర్ లీగ్) 'యూపీ వారియర్జ్' జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు.

ఒకే ఒక్క క్రీడాకారిణి...

ఎన్నో మైలురాళ్లను అధిగమించిన 26 ఏళ్ల దీప్తీ శర్మ... ప్రస్తుతం ఐసీసీ టీ20, వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-5లో కొనసాగుతోంది. టాప్5లో నిలిచిన ఏకైక భారత ఆల్‌రౌండర్‌గా రికార్డులకు ఎక్కింది. అలాగే ఈ ఏడాది ఐసీసీ టీ20 అంతర్జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్న ఏకైక భారత మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రకటించిన 'సెల్ఫ్‌మేడ్ విమెన్' జాబితాలోనూ చోటు సంపాదించిన దీప్తీ... రేపటి తరం క్రికెటర్లకు స్ఫూర్తి మంత్రమయింది. అంతేకాదు... ఇటీవల ముగిసిన డబ్ల్యూపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా మరో అరుదైన రికార్డు సాధించింది. 'సవాళ్లంటే ఎంతో ఇష్టం. అంచనాలను ఒత్తిడిగా భావించను' అంటున్న దీప్తీ... తన సీనియర్ క్రికెటర్లు ఝులన్ గోస్వామి, మిథాలీరాజ్‌లా యువ క్రీడాకారులకు మార్గదర్శిగా నిలవాలని కోరుకొంటోంది.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6yu6qnv లో చదవండి.

ఉసిరికాయతో కొత్త రకం ఊరగాయ

స్నిగ్ధం ధాత్రీఫలం యజ్జ్వలదనల శిఖాసన్నిభం
స్నిగ్ధపాత్రే క్షిప్తం ప్రభృష్ట హింగుకణ రజనిరజస్తైల సింధుత్యోపైః!
సంలిప్తం జాతపాకం కతిపయదివ సౌరాల్ల సత్సైలభాడ్యం
తస్య స్వాదానువాదం కథితుమపి వరో నేశ్వరః కస్తదన్యః!

ఉసిరి కాయ అగ్నిశిఖతో సమానమైనది. జీర్ణశక్తిని కాపాడే బలకరమైన ఔషధం. దీన్ని 'ధాత్రీ, ఆమలకి'.. ఇలా పిలుస్తారు. 'ధాత్రి' అంటే భూమి, ఆదిశక్తి, అని కూడా! 'ఎంబ్లిక్ మైరోబలన్' అంటారు ఈ మొక్కని. ఇంగ్లీషువాళ్లు 'ఇండియన్ గూస్‌బెర్రీ' అంటారు. తల్లితో సమానమైనది కాబట్టి దీన్ని 'ధాత్రి' అన్నారు. దాదాపు అన్ని వ్యాధుల్లోనూ ఉసిరికాయ ప్రయోగం ఉంది.

ఉసిరికాయతో తొక్కు పచ్చడి (నల్లపచ్చడి), ఆవకాయ మాదిరిగా ఊరగాయ పచ్చడి... ఇలా రెండు రకాలుగా మనం నిల్వ పచ్చళ్లు పెడుతుంటాం. మామూలుగా అయితే గోంగూర తొక్కు, చింతకాయ తొక్కులాగా ఉసిరికాయని కూడా దంచి, లోపలి గింజలు ఏరేసి నిల్వ పచ్చడి లేదా తొక్కుపచ్చడి పెడుతుంటారు. ఇలా తొక్కినందువలన ఉసిరికాయ పులుస్తుంది. అతిగా పులుపు వలన ఈ ఉసిరి కాయ తొక్కుపచ్చడి కొంతవరకూ ఎసిడిటీ పెరగటానికి కారణం అవుతుంది.

> **హంతిపిత్తంతు మాధుర్యాత్,**
> **కఫం తిక్తకషాయాత్!**
> **వాయుమమ్ల ప్రభావత్వద్ధాత్రీ దోషత్రయాపః!**
> **ఇందులో తీపి, పులుపు, వగరు మూడు రుచులూ ఉన్నాయి. తీపి రుచివల్ల పైత్యాన్ని హరిస్తుంది. వగరు, చేదులవల్ల కఫాన్ని పూర్తిగా హరిస్తుంది. ఉసిరి కాయలోని పులుపునకు వాతాన్ని హరించే గుణం ఉంది. ఈ విధంగా వాతం, వేడి, కఫంతో కూడిన అన్ని వ్యాధులనూ హరించే దివ్యౌషధం ఇది.**

ఉసిరి కాయల్ని నూనె వేసి మగ్గబెట్టి, అవి చల్లారాక ఉప్పు, కారం, ఆవపిండి కలిపి, తగినంత నూనె పోసి ఉసిరి ఆవకాయ పెడుతుంటారు. ఈ పద్ధతిలో ఉసిరి కాయను ఉడికించటంవల్ల ప్రధానమైన సి-విటమిన్ అందులోంచి ఎగిరిపోతుంది. కాబట్టి, ఉసిరి ఆవకాయ మనం ఆశించిన ప్రయోజనాన్ని పెద్దగా ఇవ్వదు.

ఉసిరి కాయ విషయంలో మనం అనుసరించే ఈ రెండు విధానాలూ అంతగా ఆరోగ్యదాయకమైనవి కాదు. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఉసిరికాయ నిల్వ పచ్చడిని ఆరోగ్యదాయకంగా ఎలా పెట్టుకోవాలో వివరంగా పేర్కొన్నాడు.

- బాగా కండ ఉన్న నాణ్యమైన ఉసిరికాయల్ని కడిగి, పొడి బట్టతో తుడిచి, కొద్దిసేపు గాలికి ఆరనివ్వండి.
- పింగాణీ జాడీ తీసుకొని దాని లోపల నూనె పట్టించి, ఆరిన ఉసిరి కాయల్ని అందులో వేయండి.
- ఈ ఉసిరికాయల మీద తగినంత పసుపు, ఇంగువ పొడి, ముక్కలన్నీ మునిగేలాగా నువ్వుల నూనె, చాలినంత సైంధవ లవణం, శొంఠి పిప్పళ్లు, మిరియాల పొడి... వీటన్నిటినీ కలపండి. కాయలన్నిటినీ కిందవి పైకి, పైవి కిందకీ వచ్చే లాగా కలియబెట్టి, మూతబెట్టి ఒక శుభ్రమైన తెల్లని వస్త్రాన్ని మూతికి వాసెన కట్టి ఓ మూల భద్రపరచండి.
- రెండు నెలలపాటు ఈ సంగతే మరిచిపోయేలా ఆ జాడీని అలా వదిలేయండి. కొన్నాళ్లు కదల్చకుండా ఉంటే, ఉసిరి కాయలు మెత్తబడి ఊరతాయి. తోడుగా శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడి, పసుపు కూడా కలిసి, చక్కని గ్రేవీ మధ్య ఈ కాయలు తేలుతూ ఉంటాయి. దీని రుచిని శివుడు కూడా వర్ణించలేడంటాడు క్షేమశర్మ.



ఉసిరికాయలకు సమానమైన తూకంలో పసుపు కలపటంవల్ల ఈ ఊరుగాయ షుగరు మీద అద్భుతంగా పని చేసే ఔషధంగా మారుతుంది.

పసుపును 'నిశ' అని, ఉసిరికాయను 'ఆమలకి' అనీ పిలుస్తారు. 'నిశా, ఆమలకీ'ల కలయిక షుగరు వ్యాధిలో వచ్చే ఉపద్రవాల్ని నివారిస్తుంది. 'నిశామలకీ' చూర్ణం పేరుతో ఒక ఔషధం కూడా ఆయుర్వేద మందులషాపుల్లో దొరుకుతుంది.

ఈ పద్ధతిలో తయారైన ఉసిరి ఊరగాయని రోజుకొక కాయ చొప్పున ఇంటిల్లిపాదీ తినేందుకు వీలుగా కాయల్ని లెక్కబెట్టి ఈ ఊరుగాయని పెట్టుకోండి. ఇందులో సి-విటమిన్ సహా అన్ని పోషకాలూ బాగా వృద్ధిపొంది ఉంటాయి. దీన్ని ముందుగానే దంచటం లాంటివి చేయటంలేదు కాబట్టి అతిగా పులవదు. ఆరోగ్యదాయకం, గుణాత్మకం, పోషకం. ఊరగాయల్ని ఎవరైనా పెట్టుకునేది దేనికంటే... అన్ సీజన్లో కూడా తినటానికి అనువుగా ఉంటాయని. ఉసిరి కాయని ఏడాదంతా తినాలంటే ఈ చెప్పిన పద్ధతిలో ఊరగాయని పెట్టుకోండి. ఇది చాలా కాలం నిల్వ ఉంటుంది. ఇందులో మిరపకారమూ, ఆవపిండి, మెంతి పిండీ లాంటివి ఉండవు. కారానికి శొంఠి, పిప్పళ్లు, మిరియాలే ఆరోగ్యదాయకం.

• గంగరాజు అరుణాదేవి

సూపర్ బోణీ

బెంగళూరుపై చెన్నై విజయం

ముస్తాఫిజుర్‌కు నాలుగు వికెట్లు ● రాణించిన రచిన్



రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 37)

1 టీ20ల్లో 12 వేలకు పైగా పరుగులు చేసిన తొలి భారత ఆటగాడిగా విరాట్. అలాగే తక్కువ ఇన్నింగ్స్ (360)లో ఈ ఫీట్ సాధించిన రెండో బ్యాటర్. గేల్ (345) ముందున్నాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 21, డుప్లెసి (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 35, పటీదార్ (సి) ధోనీ (బి) ముస్తాఫిజుర్ 0, మ్యాక్స్‌వెల్ (సి) ధోనీ (బి) చాహర్ 0, గ్రీన్ (బి) ముస్తాఫిజుర్ 18, రావత్ (రనౌట్) 48, దినేశ్ (నాటౌట్) 38, ఎక్స్‌ట్రాలు: **13; మొత్తం: 20 ఓవర్లలో 173/6; వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-42, 4-77, 5-78, 6-173; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-37-1, దేశ్‌పాండే 4-0-47-0, తీక్షణ 4-0-36-0, ముస్తాఫిజుర్ 4-0-29-4, జడేజా 4-0-21-0.

చెన్నై: రుతురాజ్ (సి) గ్రీన్ (బి) యశ్ 15, రచిన్ (సి) పటీదార్ (బి) కర్ణ్ 37, రహానె (సి) మ్యాక్స్‌వెల్ (బి) గ్రీన్ 27, డారిల్ మిచెల్ (సి) పటీదార్ (బి) గ్రీన్ 22, శివమ్ దూబే (నాటౌట్) 34, జడేజా (నాటౌట్) 25, ఎక్స్‌ట్రాలు: **16, మొత్తం: 18.4 ఓవర్లలో 176/4; వికెట్ల పతనం:** 1-38, 2-71, 3-99, 4-110; **బౌలింగ్:** సిరాజ్ 4-0-38-0, యశ్ దయాల్ 3-0-28-1, జోసెఫ్ 3.4-0-38-0, కర్ణ్ శర్మ 2-0-24-1, దాగర్ 2-0-6-0, గ్రీన్ 3-0-27-2, మ్యాక్స్‌వెల్ 1-0-7-0.



ముస్తాఫిజుర్ (4-0-29-4)

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఆరంభ మ్యాచ్‌లోనే అదరగొట్టింది. కొత్త కెప్టెన్ రుతురాజ్ నేతృత్వంలో బరిలోకి దిగిన ఈ జట్టు బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో రాణిస్తూ.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును 6 వికెట్ల తేడాతో ఓడించింది. అటు చెపాక్ మైదానంలో ఆర్సీబీకిది వరుసగా ఎనిమిదో ఓటమి కావడం గమనార్హం. సీఎస్కే తరఫున తొలి మ్యాచ్ ఆడిన పేసర్ ముస్తాఫిజుర్ నాలుగు వికెట్లతో ఆర్సీబీ వెన్నువిరిచాడు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48), దినేశ్ కార్తీక్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) డుప్లెసి (23 బంతుల్లో 8 ఫోర్లతో 35) రాణించారు. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 176 పరుగులు చేసి గెలిచింది. రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), శివమ్ దూబే (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 34 నాటౌట్) కీలకంగా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముస్తాఫిజుర్ నిలిచాడు.

కలిసికట్టుగా..: సీఎస్కే ఛేదన జోరుగా ఆరంభం కాగా.. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ ఉన్న కాసేపు బ్యాట్లు ఝుళిపించారు. ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌గా మలిచిన కెప్టెన్ రుతురాజ్ (15) మొదటి వికెట్‌కు 38 పరుగులు జోడించి నాలుగో ఓవర్‌లో వెనుదిరిగాడు. అయితే కెరీర్‌లో తొలి ఐపీఎల్ ఆడిన రచిన్ ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్‌లో 4,6 బాదిన అతను ఐదో ఓవర్‌లోనూ సిక్సర్ సాధించాడు. అటు రహానె (27) కూడా ఉన్న కాసేపు వేగం కనబరిచాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 62/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. కర్ణ్ శర్మ ఓవర్‌లో సిక్సర్ బాదాక మరో భారీ షాట్‌కు యత్నించిన రచిన్ క్యాచ్ అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తొమ్మిదో ఓవర్‌లో డారిల్ మిచెల్ (22) రెండు వరుస సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. మరోవైపు రహానె ఓ భారీ సిక్సర్ బాదిన వెంటనే మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇవ్వగా, కాసేపటికే మిచెల్ వెనుదిరగడంతో 110కి 4 వికెట్లు కోల్పోయిన చెన్నై ఒత్తిడిలో పడింది. దూబే, జడేజా ఓపిగ్గా ఆడుతూ అడపాదడపా ఫోర్లతో ఆదుకునే ప్రయత్నం చేశారు. 17వ ఓవర్‌లో 16 రన్స్ రావడంతో కోలుకుంది. ఇక దూబేను షార్ట్ బాల్స్‌తో విసిగించే ప్రయత్నం చేసినా.. 18వ ఓవర్‌లో 2 ఫోర్లు, 19వ ఓవర్‌లో 6,4తో మరో 9 బంతులుండగానే జట్టును గెలిపించాడు.


చివర్లో ధనాధన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయినా.. డెత్ ఓవర్లలో అదరగొట్టింది. 140 కూడా కష్టమే అనుకున్న వేళ అనూజ్ రావత్, దినేశ్ కార్తీక్ జోడీ ఆరో వికెట్‌కు 50 బాల్స్‌లో 95 పరుగులు జత చేయడంతో జట్టు సవాల్ విసిరే స్కోరు సాధించగలిగింది. అయితే మధ్య ఓవర్లలో పేసర్ ముస్తాఫిజుర్ ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్ డుప్లెసి 30 పరుగులు సాధించగా, అటు మరో ఓపెనర్ విరాట్ కోహ్లీ (21) ఈ సమయంలో ఒక్క బంతినే ఆడడం గమనార్హం. అయితే చక్కటి రన్‌రేట్‌తో సాగుతున్న ఆర్సీబీకి పేసర్ ముస్తాఫిజుర్ బ్రేకులు వేశాడు. ఐదో ఓవర్‌లో తను డుప్లెసి, రజత్ (0)ల వికెట్లు తీసి షాక్ ఇచ్చాడు. వెంటనే మ్యాక్స్‌వెల్‌ను చాహర్ డకౌట్ చేయడంతో ఆర్సీబీ పవర్‌ప్లేలో 42/3తో నిలిచింది. ఈ దశలో విరాట్, గ్రీన్ (18) నాలుగో వికెట్‌కు 35 రన్స్ జోడించారు. 12వ ఓవర్‌లో ఈ ఇద్దరినీ ముస్తాఫిజుర్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికి స్కోరు 78/5. ఈ స్థితిలో దినేశ్ కార్తీక్, రావత్ నిదానంగా ఆడడంతో 28 బంతులపాటు ఒక్క ఫోర్ కూడా రాలేదు. కానీ 15వ ఓవర్‌లో రావత్ రెండు ఫోర్లు, తర్వాత ఓవర్‌లో డీకే 4,6తో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. తుషార్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లోనైతే రావత్ 6,6,4 డీకే 6తో 25 రన్స్ వచ్చాయి. అయితే ఆఖరి ఓవర్‌లో అతడు 9 రన్స్‌తో కాస్త కట్టడి చేయగలిగాడు.

అదిరెను.. ఆటాపాట



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ ఆట పాటలతో పాటు కళ్లు మిరుమిట్లు గొలిపే లేజర్ షో, బాణాసంచా వెలుగులతో ఘనంగా ఆరంభమైంది. 20 నిమిషాలపాటు సాగిన ఈ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ల డ్యాన్స్‌తో పాటు ప్రఖ్యాత సింగర్ సోనూ నిగమ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ బృందం సంగీత విభావరి అలరించింది. అలాగే స్టేడియం మధ్యలో త్రీడీ గ్రాఫిక్స్ ద్వారా ఇండియా గేట్, యోగ ముద్రలో వ్యక్తి, చందమామలను సృష్టించడం విశేషంగా ఆకట్టుకుంది. మొదట అక్షయ్ కుమార్ చేతిలో జాతీయ జెండా పట్టుకుని స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత టైగర్ ష్రాఫ్‌తో కలిసి స్టేజిపై నృత్యం చేశాడు. ఇద్దరూ త్రివర్ణ పతాకం చేతపట్టి స్టేడియం కలియతిరిగి ప్రేక్షకులను హుషారెత్తించారు. ఇక వందేమాతర గీతాన్ని సోనూ నిగమ్, రెహమాన్ కలిసి ఆలపించడంతో స్టేడియం దద్దరిల్లింది. అనంతరం సింగర్స్ మోహిత్ చౌహాన్, శ్వేతా మోహన్ తదితరులతో కలిపి కాసేపు రెహమాన్ తన హిట్ సాంగ్స్‌తో ప్రేక్షకులను మైమరిపింపజేశాడు. చివర్లో జయహో సాంగ్‌తో ముగించగా.. అటు బాణసంచా వెలుగులతో చిదంబరం స్టేడియం కళకళలాడింది. ప్రదర్శన అనంతరం ఐపీఎల్ ట్రోఫీతో బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జైషా, ఐపీఎల్ చైర్మన్ ధూమల్‌తో పాటు చెన్నై, బెంగళూరు కెప్టెన్లు రుతురాజ్, డుప్లెసి, నటులు అక్షర్, టైగర్ ష్రాఫ్, రెహమాన్, సోనూ నిగమ్ వేదికపై ఫొటో దిగారు.

జోష్‌లో సన్‌రైజర్స్



కమిన్స్

నేటి మ్యాచ్‌లు	
పంజాబ్ x ఢిల్లీ	మ. 3.30 నుంచి
కోల్‌కతా x హైదరాబాద్	రాత్రి 7.30 గం. నుంచి

కోల్‌కతా: నిరుడు ఐపీఎల్‌లో అట్టడుగున నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఈసారి కొత్త కెప్టెన్ పాట్ కమిన్స్ సారథ్యంలో నవోత్తేజంతో బరిలోకి దిగుతోంది. శనివారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనున్న తమ తొలి మ్యాచ్‌లో లోకల్ టీమ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఇరు జట్లు ఇప్పటివరకు 25 సార్లు తలపడగా కేకేఆర్ 16, ఎస్ఆర్‌హెచ్ 9 మ్యాచ్‌ల్లో నెగ్గాయి. గత ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు తన సారథ్యంలో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్‌కప్ టైటిళ్లను అందించిన కమిన్స్‌పై ఎస్ఆర్‌హెచ్ టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఆశలు పెట్టుకుంది. ఇక, నిరుడు ఐపీఎల్‌కు దూరమైన శ్రేయాస్ అయ్యర్ ఈసారి కెప్టెన్‌గా కేకేఆర్‌ను ఎలా నడిపిస్తాడనే దానిపైన, మెంటార్‌గా గౌతం గంభీర్ వ్యూహాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



కొత్త స్టేడియంలో పంజాబ్ పోరు ఆరంభం

చండీగఢ్: పంజాబ్ కింగ్స్ తన పోరును కొత్త స్టేడియంలో ప్రారంభించనుంది. చండీగఢ్ శివారులోని ముల్లాపూర్ గ్రామంలో మహరాజా యదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పేరిట పంజాబ్ క్రికెట్ సంఘం ఈ నూతన స్టేడియాన్ని నిర్మించింది. దాదాపు 33 వేల సీటింగ్ కెపాసిటీ కలిగిన, అధునాతన సౌకర్యాలతో కూడిన ఈ స్టేడియంలో శనివారం రిషబ్ పంత్ నాయకత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో ధవన్ సారథ్యంలోని పంజాబ్ జట్టు తలపడనుంది. మొదటిసారి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న ఈ స్టేడియం ఇకనుంచి పంజాబ్ ఫ్రాంచైజీకి సొంత మైదానం.

ఆసియా టెన్నిస్ రన్నరప్‌గా నిషిత్

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆసియా టెన్నిస్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో బాలుర అండర్-16 కేటగిరీలో విశాఖపట్నానికి చెందిన అరిమిల్లి నిషిత్ రన్నరప్‌గా నిలిచాడు. రాయపూర్‌లో జరిగిన ఫైనల్స్‌లో 1-6తో తొలి సెట్‌లో ఓడిన నిషిత్, రెండో సెట్‌లో 4-0తో పుంజుకున్నాడు. రెండో సెట్‌లో గెలుపు దిశగా పయనిస్తున్న నిషిత్ దురదృష్టవశాత్తు గాయపడి, మ్యాచ్ నుంచి నిష్క్రమించడంతో రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, ఈ ప్రదర్శనతో నిషిత్ జాతీయ ర్యాంకింగ్‌లో టాప్-10లోకి చేరాడు.

సెమీఫైనల్లో శ్రీకాంత్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-10, 21-14తో లి చియా (తైపీ)ని చిత్తుచేశాడు. కాగా, డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 14-21, 15-21తో ఆస్ట్రేలియా జంట సెట్యానా/ఏంజెలా చేతిలో పరాజయం పాలైంది. ఇక..గురువారం అర్ధరాత్రి జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో లక్ష్యసేన్ 17-21, 15-21తో లి చియా చేతిలో, మిక్స్‌డ్‌లో సుమీత్/సిక్కిరెడ్డి ద్వయం 11-21, 14-21తో రాబిన్/సెలెనా జోడీ చేతిలో ఓడారు.

క్లిష్టమైన గ్రూపుల్లో భారత్

థామస్, ఉబర్ కప్ డ్రాలు

చెంగ్డూ (చైనా): ప్రతిష్ఠాత్మక థామస్, ఉబర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ డ్రాలను శుక్రవారం విడుదలజేశారు. డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు 14 సార్లు చాంప్ ఇండోనేసియాతోపాటు ఇంగ్లండ్, థాయ్‌లాండ్‌లతో కలిసి గ్రూప్-సిలో ఉంది. అలాగే భారత మహిళల జట్టు గ్రూప్ 'ఎ'నుంచి 15 సార్లు విజేత చైనాతోపాటు కెనడా, సింగపూర్‌లతో తలపడనుంది. గత విజేతగా భారత్ థామస్ కప్‌కు, ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గడం ద్వారా మహిళల జట్టు ఉబర్ కప్‌కు అర్హత సాధించాయి. ఈ పోటీలు వచ్చేనెల 27 నుంచి ఇక్కడ జరగనున్నాయి.

డబ్ల్యూటీటీ ఫీడర్ విజేత సాథియన్



బీరూట్ (లెబనాన్): డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్‌లో టైటిల్ నెగ్గిన తొలి భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడిగా సాథియన్ చరిత్ర సృష్టించాడు. ఫైనల్‌లో సాథియన్ 3-1తో సహచర ప్యాడ్లర్ మానవ్ టక్కర్‌పై గెలిచాడు.

భారత్-అఫ్ఘాన్ మ్యాచ్ డ్రా

అభా (సౌదీ అరేబియా): భారత్-అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య జరిగిన వరల్డ్ కప్ సాకర్ క్వాలిఫయింగ్ మ్యాచ్ డ్రా (0-0)గా ముగిసింది. ఈ మ్యాచ్ అనంతరం.. మొత్తం నాలుగు పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో భారత్ రెండో స్థానానికి చేరింది. ఖతార్ (9) అగ్రస్థానంలో ఉండగా, కువైట్ (3), అఫ్ఘానిస్థాన్ (1) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఐపీఎల్‌లో తనుష్ కోటియన్

న్యూఢిల్లీ: వ్యక్తిగత కారణాలతో తప్పుకొన్న రాజస్తాన్ రాయల్స్ స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ జట్టులో చేరాడు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్ వికెట్ కీపర్ రాబిన్ మింజ్ స్థానంలో బీఆర్ శరత్‌ను తీసుకున్నారు.

మూడో రోజూ లాభాలొచ్చాయ్..

190 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. ఎల్ అండ్ టీ, ఐటీసీ, మారుతి సుజుకీ వంటి ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లలో అమ్మకాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 474 పాయింట్ల మేర పుంజుకుని మళ్లీ 73,000 స్థాయిని దాటినప్పటికీ, చివరికి 190.75 పాయింట్ల లాభంతో 72,831.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 84.80 పాయింట్ల వృద్ధితో 22,096.75 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 లాభపడగా.. మారుతి సుజుకీ షేరు మూడు శాతానికి పైగా పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా, టైటాన్ 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.06 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.38 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో టెలికాం 2.28 శాతం లాభపడగా.. కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, కమోడిటీస్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్ సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి.

ఐటీ షేర్లు ఢమాల్ : అమెరికన్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ఈ ఆర్థిక సంవత్సరానికి ఐటీ రంగ ఆదాయ వృద్ధి అంచనాను 2-5 శాతం నుంచి 1-3 శాతానికి తగ్గించిన నేపథ్యంలో దేశీయ ఐటీ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు అత్యధికంగా 3.01 శాతం క్షీణించగా.. ఇన్ఫోసిస్ 2.98 శాతం నష్టంతో సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. విప్రో 2.73 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.46 శాతం పతనమవగా.. టీసీఎస్, ఎల్‌టీఎస్, టెక్ మహీంద్రా షేర్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. దాంతో బీఎస్ఈలోని ఐటీ రంగ సూచీ 2 శాతం క్షీణించగా.. టెక్నాలజీ ఇండెక్స్ 1.47 శాతం నష్టపోయింది.

28 నుంచి క్రియేటివ్ గ్రాఫిక్స్ ఐపీఓ: ఇంటిగ్రేటెడ్ ప్యాకేజింగ్ సిస్టమ్ కంపెనీ క్రియేటివ్ గ్రాఫిక్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.54.4 కోట్ల వరకు సమీకరించనుంది. ఆ తర్వాత కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేయనుంది.

రికార్డు కనిష్ఠానికి రూపాయి

- ఒక్కరోజులో 48 పైసల క్షీణత
- 83.61కి డాలర్‌తో మారకం రేటు



భారత కరెన్సీ విలువ మరింత పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజులోనే 35 పైసలు క్షీణించి సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయి 83.48 వద్ద ముగిసింది. శుక్రవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు 83.28 వద్ద ప్రారంభమై.. ఒక దశలో 83.65 వద్దకు చేరుకుంది. చివరికి 83.61 వద్ద స్థిరపడింది. క్రితం సెషన్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 48 పైసలు తగ్గింది. అంతర్జాతీయంగా మిగతా కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోవడం రూపాయిని బాగా కుంగదీశాయని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. డాలర్-రూపాయి ఎక్స్ఛేంజీ రేటులో గత కనిష్ఠ స్థాయి 2023 డిసెంబరు 13న 83.40 వద్ద నమోదైంది.

కాస్త దిగివచ్చిన పసిడి

సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠాలకు ఎగబాకిన పసిడి ధర శుక్రవారం కాస్త దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.875 తగ్గి రూ.66,575కు పరిమితమైంది. గురువారం 10 గ్రాముల బంగారం రేటు రూ.67,450కి చేరుకుంది. వెండి విషయానికి వస్తే, క్రితం రోజు రూ.77,750 పలికిన కిలో ధర.. శుక్రవారం రూ.760 తగ్గి రూ.76,990కి జారుకుంది. అంతర్జాతీయంగా వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు క్రితం సెషన్‌తో పోలిస్తే 35 డాలర్లు 2,167 డాలర్ల వద్దకు దిగిరాగా.. సిల్వర్ 24.45 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఆల్‌టైం గరిష్ఠానికి మారుతి షేరు

దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా షేరు సరికొత్త శిఖరాలకు చేరుకుంది. తొలిసారిగా రూ.12,000 మైలురాయిని దాటిన కంపెనీ షేరు ధర ఒక దశలో 4.28 శాతం లాభంతో రూ.12,423.45 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 3.55 శాతం వృద్ధితో రూ.12,336.20 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 20 శాతం పుంజుకున్న మారుతి సుజుకీ షేరు.. గడిచిన ఏడాది కాలంలో 50 శాతం పెరిగింది. శుక్రవారం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.88 లక్షల కోట్లకు (4,690 కోట్ల డాలర్లు) చేరుకుంది. మారుతి సుజుకీ మాతృసంస్థ సుజుకీ మోటార్ కార్ప్ మార్కెట్ క్యాప్ 2,210 కోట్ల డాలర్లతో పోలిస్తే రెండు రెట్ల కన్నా అధికమిది. పదేళ్ల క్రితం సుజుకీ మోటార్ కార్ప్ మార్కెట్ క్యాప్‌లో సగం ఉన్న మారుతి సుజుకీ మార్కెట్ విలువ.. 2015 జనవరిలో తొలిసారిగా మాతృసంస్థను మించిపోయింది.

- ఎస్‌బీఐ కార్డ్, టైటాన్ కంపెనీతో కలిసి టైటాన్ ఎస్‌బీఐ కార్డ్‌ను తీసుకువచ్చింది. వినియోగదారుల షాపింగ్ అవసరాలకు తగ్గట్టుగా ఈ కార్డును రూపొందించినట్లు ఎస్‌బీఐ కార్డ్ వెల్లడించింది. ఈ కార్డు ద్వారా సంవత్సర కాలంలో రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేసిన వారికి ప్రత్యేక బెనిఫిట్స్‌ను అందించనున్నట్లు ప్రకటించింది.
- కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్.. కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా ఈఎస్ఏఎఫ్ తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెందిన సమగ్ర సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.
- ధనూకా అగ్రిటెక్‌తో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్).. అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ధనూకా తన పరిశోధనా కార్యకలాపాలను మరింత బలోపేతం చేయటంతో పాటు రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనుంది.

రెడీమిక్స్ కాంక్రీట్‌లోకి శ్రీ సిమెంట్

హైదరాబాద్‌లో తొలి ప్లాంట్ ఏర్పాటు



హైదరాబాద్: బంగూర్ ఫ్యామిలీ ప్రమోట్ చేసిన శ్రీ సిమెంట్ రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం బంగూర్ కాంక్రీట్ పేరుతో హైదరాబాద్‌లో గంటకు 90 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో తన తొలి ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. కంపెనీ త్వరలో ముంబై ఆర్ఎంసీ మార్కెట్లోకి ప్రవేశించబోతుంది. ఇందుకోసం స్టార్‌క్రెట్ ఎల్ఎల్‌పీకి చెందిన ఐదు ఆర్ఎంసీ ప్లాంట్లను ఈ నెలారంభంలో రూ.33.5 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో తమ ఆర్ఎంసీ ప్లాంట్ల మొత్తం ఉత్పత్తి సామర్థ్యం గంటకు 512 క్యూబిక్ మీటర్లకు చేరుకుందని తెలిపింది. రెడీమిక్స్ కాంక్రీట్ రంగంలో ఉన్న వృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖోరి తెలిపారు. శ్రీ సిమెంట్.. బంగూర్ బ్రాండ్ కింద దేశవ్యాప్తంగా సిమెంట్‌ను విక్రయిస్తోంది.

జూన్‌లో మార్కెట్లోకి బజాజ్ సీఎన్‌జీ బైక్

సంస్థ ఎండీ రాజీవ్ బజాజ్ వెల్లడి



పుణె: బజాజ్ ఆటో.. దేశంలోనే సీఎన్‌జీతో నడిచే తొలి మోటార్ సైకిల్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ బైక్ జూన్ నెలలో మార్కెట్లోకి వస్తుందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ తెలిపారు. అధిక మైలేజీ కోరుకునే కస్టమర్లను ఉద్దేశించి తయారుచేస్తున్న ఈ బైక్ పూర్తిగా కొత్త బ్రాండ్‌గా విడుదల అవుతుందని ఆయన చెప్పారు. పెట్రోల్ బైక్‌లతో పోల్చితే సీఎన్‌జీ బైక్‌ల తయారీ వ్యయాలు అధికంగా ఉంటాయి గనుక ధర కూడా కొంత ఎక్కువగానే ఉంటుంది. ఈ బైక్‌లకు పెట్రోల్, సీఎన్‌జీ కోసం రెండు ఇంధన ట్యాంకులు అమర్చాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా 20 ఏళ్ల క్రితం మార్కెట్లోకి తెచ్చిన పల్సర్ త్వరలో 20 లక్షల అమ్మకాల మైలురాయిని చేరనున్నట్టు కంపెనీ తెలిపింది.

సీఎస్ఆర్ కోసం రూ.5,000 కోట్లు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యకలాపాల కోసం బజాజ్ గ్రూప్... వచ్చే ఐదేళ్ల కాలంలో రూ.5,000 కోట్లు ఖర్చు చేయనుంది. సీఎస్ఆర్, దాతృత్వ కార్యకలాపాల నిర్వహణ కోసం కొత్తగా ఆవిష్కరించిన గ్రూప్ గుర్తింపు "బజాజ్ బియాండ్" కింద ఈ నిధితో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ కార్యక్రమం రెండు కోట్ల మంది నవ యువతరానికి ప్రయోజనకారి అవుతుందని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అందిస్తున్న ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్ అవకాశాలను చేపట్టేందుకు వారికి ఉపయోగపడుతుందని పేర్కొంది. గత 10 సంవత్సరాల కాలంలో సీఎస్ఆర్ కార్యకలాపాలకు రూ.4,000 కోట్లు ఖర్చు చేశామని, ఆ సొమ్ము నైపుణ్యాలు, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, జల సంరక్షణ వంటి విభాగాల్లో ఖర్చు చేశామని బజాజ్ ఆటో చైర్మన్ నీరజ్ బజాజ్ తెలిపారు.

బిజినెస్



వారానికో కొత్త విమానం

6,000 మంది కొత్త ఉద్యోగులు: ఇండిగో

న్యూఢిల్లీ: దేశీయ ఇండిగో విమానయాన సంస్థ తన కార్యకలాపాలను పెద్దఎత్తున విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో వారానికి ఒకటి కంటే ఎక్కువ కొత్త విమానాలు తమకు అందుతాయని అనలిస్టుల భేటీలో తెలిపింది. పెరుగుతున్న విమానాలను దృష్టిలో ఉంచుకుని 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,000 మంది ఉద్యోగులను కొత్తగా నియమించుకోవాలని నిర్ణయించింది. లాభసాటి వృద్ధితో వాటాదారుల షేర్ల విలువ పెంచడమే తమ లక్ష్యమని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తమ సామర్థ్యంతో పాటు విమాన ప్రయాణికుల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని తెలిపింది. కొత్త విమానాల రాకతో కొత్తగా మరో పది మార్గాల్లో విమాన సర్వీసులు ప్రారంభించాలని ఇండిగో భావిస్తోంది.

2030 నాటికి 600కు పైగా విమానాలు

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఇండిగో చేతిలో 366 విమానాలు ఉన్నాయి. 2030 నాటికి ఈ సంఖ్య 600కు పైగా ఉంటుందని తెలిపింది. గతంలో ఏ విమానయాన సంస్థ పెట్టనంత భారీ సంఖ్యలో 500 విమానాల కొనుగోలుకు కంపెనీ ఎయిర్‌బస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ, విదేశాల్లోని మరిన్ని మార్గాలకు విమాన సర్వీసులు ప్రారంభించాలని యోచిస్తున్నట్టు ఇండిగో తెలిపింది.

త్వరలో మరిన్ని రాష్ట్రాలకు

విజయ డయాగ్నొస్టిక్స్ విస్తరణ

అందుబాటులోకి ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్

హైదరాబాద్: విజయ డయాగ్నొస్టిక్స్ సరికొత్త ఎంఆర్ఐ మెషిన్‌ను సమకూర్చుకుంది. జపాన్‌కు చెందిన ఫుజి ఫిల్మ్ తయారు చేసిన అధునాతన ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్‌ను కొనుగోలు చేసింది. ఈ అధునాతన ఎంఆర్ఐను కంపెనీ తన అమీర్‌పేట కేంద్రంలో ఏర్పాటు చేసింది. దేశంలో ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్‌ను ఏర్పాటు చేసిన తొలి డయాగ్నొస్టిక్ సంస్థ తమదేనని విజయ డయాగ్నొస్టిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) శేషాద్రి వాసన్ విలేకరులతో చెప్పారు. ఈ ఎంఆర్ఐ కోసం రూ.6 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు తెలిపారు. కాగా విజయ డయాగ్నొస్టిక్ విస్తరణ కొనసాగుతుందని వాసన్ చెప్పారు. తమ కంపెనీకి ఇప్పటికే దేశంలోని ఐదు రాష్ట్రాల్లో 140 డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. అందులో 125 కేంద్రాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉండగా మిగతా 15 కేంద్రాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టు తెలిపారు. కొత్తగా మహారాష్ట్రలోని పుణే, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో తమ డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏటా ఏడు లేదా ఎనిమిది కొత్త డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వాసన్ తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ నుంచి

సెంథాక్విన్ ఔషధం


హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మరో ప్రాణ రక్షక ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేస్తోంది. అమెరికాకు చెందిన ఫార్మాజ్ కంపెనీ అభివృద్ధి చేసిన 'సెంథాక్విన్' అనే ఔషధాన్ని 'లిఫాక్విన్' పేరుతో తయారు చేసి భారత్, నేపాల్ దేశాల్లో మార్కెట్ చేయనుంది. ఇందుకోసం ఫార్మాజ్ కంపెనీతో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. విపరీతమైన స్రావం కారణంగా రక్తం లేదా ద్రవ పదార్థాలు తగినంతగా శరీరంలో లేనప్పుడు.. గుండె, ఇతర అవయవాలు పనిచేయడం ఆగిపోయి ఆ వ్యక్తులు చనిపోయే ప్రమాదం ఉంది. సెంథాక్విన్ ద్వారా ఈ ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చు. పేటెంట్ ఉన్న ఈ ఔషధాన్ని భారత్‌లో తయారు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఔషధ తయారీకి అనుమతించినందుకు డాక్టర్ రెడ్డీస్.. ఫార్మాజ్‌కు కొంత అప్‌ఫ్రంట్ ఫీజు, రాయల్టీ చెల్లిస్తుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,930 ▼	61,350 ▼	79,500 ▼
ముంబై	66,268 ▼	60,702 ▼	74,052 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ		విజయవాడ	425
హైదరాబాద్	415	విశాఖపట్నం	415
23వ తేదీ		వరంగల్	417
చిత్తూరు	478	దజను గుడ్లు రూ.72	
గోదావరి	425		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	113	గోదావరి	111
వరంగల్	113	విజయవాడ	111
కరీంనగర్	113	గుంటూరు	112
మహబూబ్‌నగర్	113	ఒంగోలు	112
కర్నూలు	113	చిత్తూరు	108
విశాఖపట్నం	105		



మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న లోకేశ్

2 నెలల్లో అమరావతి నిర్మాణ పనులు

▸ రాజధాని రైతులకు పూర్తి న్యాయం చేస్తాం : లోకేశ్

మంగళగిరి, మార్చి 22: నిలిచిపోయిన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరో రెండు మాసాల్లో ప్రారంభించి, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పూర్తి న్యాయం చేస్తామని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని రాజధాని గ్రామాలైన బేతపూడి, నవులూరు, తాడేపల్లి డోలాస్‌నగర్ ఏరియాలలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించి రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం అమరావతి రైతులు 33 వేల ఎకరాలను త్యాగం చేశారని, చరిత్ర ఆ త్యాగాలను గుర్తుంచుకుంటుందని అన్నారు. నవులూరులో ఆయన మాట్లాడుతూ...మైనారిటీలకు జగన్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేనివిధంగా జగన్ హయాంలో ముస్లింలపై దాడులు, మైనారిటీ సంక్షేమ కార్యక్రమాల రద్దు, వక్ఫ్ ఆస్తుల కబ్జాలే జరిగాయన్నారు. టీడీపీ ఎప్పుడూ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ రద్దుచేసిన మైనారిటీ సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి ప్రారంభిస్తామని లోకేశ్ చెప్పారు. ఇక, 'ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని రెండుమార్లు గెలిపించారు. మీ జీవితాలలో ఏవైనా మార్పులు వచ్చాయా? లేదు కదా! మరోమారు ఆళ్ల మాటలు నమ్మి నియోజకవర్గ ప్రజలు మోసపోరాద'ని లోకేశ్ కోరారు.

సమగ్రాభివృద్ధికి బాబును బలపరచండి

"కత్తి పట్టినవాడు ఆ కత్తితోనే పోతాడన్న నానుడిని చంద్రబాబు బలంగా నమ్ముతారు. అందుకే ఆయన హత్యారాజకీయాలు నడపరు. వాటిని అసలు ప్రోత్సహించరు.." అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన మంగళగిరిలోని పీఈపీఎల్ పార్క్వ్యూ టవర్స్ అపార్టుమెంట్ వాసులను 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్ కార్యక్రమంలో కలుసుకున్నారు. హత్యారాజకీయాలతో గత ఎన్నికల్లో జగన్ లబ్ధి పొందారన్నారు. జగన్ అరాచకాలకు చంద్రబాబు అరెస్టు ఓ పరాకాష్ఠ అని చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజలంతా చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఐదేళ్లు వదిలేసి.. ఎన్నికల ముందు హడావుడి

▸ క్లస్టర్ వర్సిటీకి 139 కోట్లు...ఆన్‌లైన్ కోర్సులకు రూ.50 కోట్లు

▸ ఓ మంత్రి సిఫారసుతో బడ్జెట్ మంజూరు ఉత్తర్వులు

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు యూనివర్సిటీ భవనాల గురించి పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు హడావుడిగా నిధుల మంజూరు జీవోలు విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రభుత్వం విద్యారంగానికి ఈ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీ భవనాలు, సిల్వర్ జూబ్లీ కాలేజీలో కొత్త కాంప్లెక్ భవనాల నిర్మాణానికి రూ.139.5కోట్లు విడుదలకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌వో) విడుదల చేస్తూ శుక్రవారం జీవో విడుదల చేసింది. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోకి వచ్చిన సిల్వర్ జూబ్లీ కాలేజీలో కొత్త నిర్మాణాలతోపాటు, జగన్నాథగట్టులో యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నట్లు తెలిపింది. అయితే, ప్రభుత్వం కీలకంగా వ్యవహరించే రాయలసీమకు చెందిన ఓ మంత్రి ఈ పనులను చేయిస్తున్నారని, ఆయన ఆదేశాలతోనే ఈ జీవో జారీచేశారని తెలిసింది. ఇప్పటికిప్పుడు నిధులు విడుదల చేయకపోయినా ఎన్నికల అనంతరం ఈ జీవోను ఆధారంగా చూపించి నిధుల విడుదలకు అడ్డంకి లేకుండా చేసుకున్నారని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందువల్లే ఎన్నికల షెడ్యూలు విడుదలకు సరిగ్గా రెండు రోజుల ముందు మార్చి 13న జీవో విడుదల చేశారు. విదేశీ యూనివర్సిటీల్లోని కోర్సులను ఆన్‌లైన్ విధానంలో చదివే ఉద్దేశంతో ఎడెక్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా రూ.50కోట్ల మంజూరుకు మరో ఉత్తర్వు జారీ చేశారు. ఈ నిధులు ఆ కంపెనీకి చెల్లించబోతున్నారు. 4లక్షల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదివేందుకు వీలుగా 4లక్షల లైసెన్సులు ఎడెక్స్ కంపెనీ ఇవ్వనుంది. అయితే అందుకోసం అయ్యే ఖర్చు రూ.50కోట్లు ముందే చెల్లించాలని ఎడెక్స్ కంపెనీ షరతు పెట్టింది. అందుకు అనుగుణంగా ఎన్నికల షెడ్యూలు వస్తుందని భావించి ఈనెల 12న జీవో విడుదల చేశారు. అలాగే యూనివర్సిటీల జీతాల బిల్లుల జీవోలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆంధ్రా వర్సిటీకి జీతాల బిల్లుల కోసం రూ.వంద కోట్ల బీఆర్‌వో ఇచ్చింది.

పురందేశ్వరిపై దుష్ప్రచారం!

▸ పదవికి రాజీనామా చేశారంటూ ఫేక్ ప్రెస్ నోట్

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై కొందరు దుష్ప్రచారానికి తెగబడ్డారు. విశాఖలో డ్రగ్స్ పట్టుబడిన వ్యవహారంలో తన పదవికి రాజీనామా చేసినట్లు ఒక నకిలీ లెటర్ హెడ్‌పై ఆమె సంతకాన్ని స్కాన్ చేసి పత్రికా ప్రకటన విడుదల చేశారు. "మా సమీప బంధువు, వ్యాపార భాగస్వామి పేరుతో విశాఖ పోర్టుకు వచ్చిన కంటైనర్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ సీబీఐకి పట్టుబడటంలో సోషల్ మీడియాలో నాతో పాటు భర్త, కుమారుడిపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. అయితే దోషులెవరో తేలేవరకూ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా. త్వరలో రాజీనామా పత్రాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడికి పంపుతాను" అని ఆమె చెప్పినట్లుగా ఆ ఫేక్ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ ప్రకటనపై బీజేపీ రాష్ట్ర కార్యాలయం తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ మీడియా విభాగం తెలిపింది.

విరుధునగర్ బరిలో సినీ నటి రాధిక

చెన్నై, మార్చి 22: తమిళనాడు పార్లమెంటు స్థానాలకు సంబంధించి బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ శుక్రవారం 14 మందితో కూడిన 4వ జాబితాను విడుదల చేసింది. అదేవిధంగా పుదుచ్చేరిలోని ఒక స్థానానికి కూడా అభ్యర్థిని ప్రకటించింది. వీటిలో ప్రముఖ నటి రాధిక శరత్‌కుమార్‌కు విరుధనగర్ స్థానాన్ని కేటాయించారు. ఈమె దివంగత నటుడు విజయకాంత్ కుమారుడిని ఇదే నియోజకవర్గం నుంచి ఢీ కొననున్నారు. ఇక, తమిళనాడు బీజేపీ శాఖ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత కేపీ రామలింగంకు నమ్మక్కల్ నియోజకవర్గాన్ని కేటాయించారు.

26కల్లా పెండింగ్ ఫారం-7ల పరిష్కారం

▸ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా



అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-7, ఫారం-8లను ఈ నెల 26 కల్లా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలుపరిచే అంశంపై శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి ఆయన వారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లలో కనీస వసతులు కల్పించడం, అనుమతుల జారీని వేగవంతం చేయడం, సీవిజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)ను సమర్థవంతంగా అమలుచేయడం తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. వచ్చేనెల 3న ఇదే ఈ అంశంపై సీఎస్, డీజీపీలతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో.. ఈఎస్ఎంఎస్ వినియోగాన్ని విస్తృతస్థాయిలో మెరుగు పర్చాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతి తప్పనిసరి అని మీనా అన్నారు. అయితే నేరుగా గానీ, పోర్టల్ ద్వారా గానీ అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి దుర్ఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతన ఓటర్ల నమోదులోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షుణ్ణంగా పరిశీలించాకే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు.

పెంచలకోన సన్నిధిలో చంద్రబాబు

లక్ష్మీనృసింహుడికి ప్రత్యేక పూజలు

నెల్లూరు, అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గోనుపల్లికి చేరుకున్న చంద్రబాబు అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెంచలకోనకు వచ్చారు. శ్రీవారి సన్నిధిలో సుమారు సుమారు 20 నిమిషాలు గడిపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే కొలువైన ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. చంద్రబాబు గోత్ర నామాలతో అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి తిరుగుపయనమయ్యారు. కాగా గోనుపల్లిలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ తదితరులు స్వాగతం పలికారు. పెంచలకోన పర్యటనపై చంద్రబాబు శుక్రవారం ఎక్స్‌లో స్పందించారు. 'ఉమ్మడి నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నా. అడవులు, కొండల మధ్య కొలువైన స్వామివారి దర్శనం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చింది. ప్రజల కోసం పోరాడే శక్తిని, పనిచేసే సామర్థ్యాన్ని ఇవ్వాలని స్వామివారిని వేడుకున్నా. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి, ప్రజలకు అంతా మంచి జరగాలని స్వామివారిని ప్రార్థించా' అని చంద్రబాబు పేర్కొన్నారు.



పెంచలకోనలో లక్ష్మీనృసింహుడిని దర్శనం చేసుకుంటున్న బాబు

పాత-కొత్త కలయిక!

▸ 13 లోక్‌సభ, 11 అసెంబ్లీ అభ్యర్థులతో టీడీపీ మూడో జాబితా

▸ ఇద్దరు సిటింగ్ ఎంపీలకు చాన్సు..

▸ శ్రీకాకుళంలో రామ్మోహన్.. నరసరావుపేటలో లావు

▸ అసెంబ్లీ సీట్లలో చాలావరకు పాతవారే..

▸ ఇంకా 4 లోక్‌సభ, 5 అసెంబ్లీ స్థానాలు పెండింగ్



లావు శ్రీకృష్ణదేవరాయలు



కింజరాపు రామ్మోహన్



వేమిరెడ్డి ప్రభాకర్

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాతవారు, కొత్త నేతల సమాహారంతో టీడీపీ మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో 13 మంది లోక్‌సభ అభ్యర్థులు, 11 మంది అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. జనసేన, బీజేపీతో పొత్తులో భాగంగా టీడీపీ రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ, 144 సీట్లలో పోటీ చేస్తుండగా.. శుక్రవారం 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. 11 మంది అసెంబ్లీ అభ్యర్థులతో కలిపితే ఇప్పటి వరకు 139 సీట్లకు పేర్లను ఖరారుచేసినట్లయింది. ఇంకా ఐదు అసెంబ్లీ, 4 లోక్‌సభ స్థానాల అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. లోక్‌సభకు పోటీచేసేవారి జాబితాలో ఇద్దరు సిటింగ్ ఎంపీలు ఉన్నారు. రామ్మోహన్ నాయుడు(శ్రీకాకుళం), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట-వైసీపీ) లోక్‌సభ సభ్యులు కాగా.. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. హిందూపురం అభ్యర్థి బీకే పార్థసారథి గతంలో కూడా ఇక్కడి నుంచే లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎం.భరత్ (విశాఖపట్నం), హరీశ్ మాధుర్ (అమలాపురం-ఎస్సీ) గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. పుట్టా మహేశ్ యాదవ్(ఏలూరు), కేశినేని శివనాథ్(విజయవాడ), పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు), మాజీ ఐపీఎస్ అధికారి టి.కృష్ణ ప్రసాద్ (బాపట్ల-ఎస్సీ), మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు (చిత్తూరు), బైరెడ్డి శబరి (నంద్యాల) మొదటిసారి పోటీ చేస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థుల్లో ఇద్దరు ఎంబీబీఎస్ చదవగా ముగ్గురు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. ఆరుగురు అండర్ గ్రాడ్యుయేట్లు. వయసురీత్యా చూస్తే 25-30 ఏళ్ల వయసువారు ఇద్దరు.. 36-45 ఏళ్లవారు ఐదుగురు, 46-60 మధ్య ఇద్దరు, 61-75 ఏళ్ల మధ్యలో నలుగురు ఉన్నారు. 12 మంది పురుషులు కాగా ఒకరు మహిళ. లోక్‌సభ అభ్యర్థుల్లో ఆరుగురు ఓసీలు కాగా.. నలుగురు బీసీ, ముగ్గురు ఎస్సీ వర్గాలకు చెందిన వారు. వీరిలో కొందరు రాజకీయ కుటుంబాల నుంచి వచ్చారు. భరత్ తాత ఎంవీవీఎస్ మూర్తి గతంలో విశాఖ ఎంపీగా పనిచేశారు. హరీశ్ తండ్రి గంటి మోహనచంద్ర బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా పనిచేయగా.. మహేశ్ యాదవ్ తండ్రి టీటీడీ మాజీ చైర్మన్, మైదుకూరు అసెంబ్లీ అభ్యర్థి సుధాకర్ యాదవ్. ఆయన మామ టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు. ఇక కృష్ణప్రసాద్ అత్త శమంతకమణి గతంలో మంత్రిగా పనిచేశారు. శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి గతంలో కర్నూలు జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఎక్కువ మంది ఇన్‌చార్జులకే అసెంబ్లీ టికెట్లు

ఇక 11 మంది అసెంబ్లీ అభ్యర్థుల్లో అధికులు పాతవారే. వసంత కృష్ణప్రసాద్ వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యే. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి (సర్వేపల్లి), గౌతు శిరీష (పలాస), కోళ్ల లలితకుమారి (శృంగవరపు కోట), వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ సిటీ), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం-ఎస్సీ), బోడె ప్రసాద్ (పెనమలూరు) మాజీ ఎమ్మెల్యేలు. డాక్టర్ అరవిందబాబు (నరసరావుపేట), కొండయ్య యాదవ్ (చీరాల) ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జులుగా ఉన్నారు. ఇన్‌చార్జులు కాకున్నా.. పాతపట్నంలో సామాజికవేత్త మామిడి గోవిందరావు, శ్రీకాకుళంలో కృష్ణాపేట సర్పంచ్ గొండు శంకర్ తొలిసారి టికెట్ దక్కించుకున్నారు. కొండయ్య యాదవ్ అసెంబ్లీకి పోటీచేయడం ఇదే మొదటిసారి. అయితే ఆయన 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఒంగోలు నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓడిపోయారు. ఇక మూడో జాబితా అసెంబ్లీ అభ్యర్థుల్లో ఒకరు ఎంబీబీఎస్ చదవగా.. ముగ్గురు పోస్టు గ్రాడ్యుయేట్లు, ఇద్దరు గ్రాడ్యుయేట్లు. ఇద్దరు ఇంటర్ చదివారు. ముగ్గురు పదో తరగతిలోపు చదివారు. వీరిలో తొమ్మిది మంది పురుషులు కాగా.. ఇద్దరు మహిళలు. వయసు రీత్యా చూస్తే 36-45 సంవత్సరాల మధ్యలో ఇద్దరు, 46-60 మధ్య ఆరుగురు, 61-75 ఏళ్ల వారు ముగ్గురు ఉన్నారు. వీరిలో రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారు ముగ్గురు ఉన్నారు. గౌతు శిరీష ఉత్తరాంధ్ర ప్రముఖ నేత గౌతు లచ్చన్న మనవరాలు. ఆమె తండ్రి శ్యామసుందర్ శివాజీ కూడా మంత్రిగా చేశారు. వసంత కృష్ణప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరరావు ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు. కోళ్ల లలితకుమారి తండ్రి కోళ్ల అప్పలనాయుడు ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

ఎమ్మెల్యే అభ్యర్థులు...(11 మంది)

పేరు	నియోజకవర్గం
పలాస	గౌతు శిరీష
పాతపట్నం	మామిడి గోవిందరావు
శ్రీకాకుళం	గొండు శంకర్
శృంగవరపు కోట	కోళ్ల లలిత కుమారి
కాకినాడ	వనమాడి వెంకటేశ్వరరావు
అమలాపురం (ఎస్సీ)	అయితాబత్తుల ఆనందరావు
పెనమలూరు	బోడె ప్రసాద్
మైలవరం	వసంత కృష్ణప్రసాద్
నరసరావుపేట	చదలవాడ అరవింద్‌బాబు
చీరాల	మద్దులూరి మాలకొండయ్య
సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

టీడీపీ లోక్‌సభ అభ్యర్థులు...(13 మంది)

పేరు	నియోజకవర్గం
శ్రీకాకుళం	కింజరాపు రామ్మోహన్‌నాయుడు
విశాఖపట్నం	మతుకుమిల్లి భరత్
అమలాపురం (ఎస్సీ)	గంటి హరీశ్ మాధుర్
ఏలూరు	పుట్టా మహేశ్ యాదవ్
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)
గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్
నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయలు
బాపట్ల (ఎస్సీ)	టి. కృష్ణప్రసాద్
నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
చిత్తూరు (ఎస్సీ)	దగ్గుమళ్ల ప్రసాదరావు
కర్నూలు	బస్తిపాటి నాగరాజు
నంద్యాల	బైరెడ్డి శబరి
హిందూపురం	బీకే పార్థసారథి

కళావెంకట్రావుకు గజపతినగరం?

▸ టీడీపీ అధిష్ఠానం యోచన

▸ బీజేపీకి ఆదోని బదులు ఆలూరు?

▸ రెండు పార్టీల మధ్య చర్చ

▸ ఒంగోలు లోక్‌సభ బరిలో మాగుంట!

▸ ఢిల్లీ లిక్కర్ స్కాం పరిణామాలతో ఆయన కుమారుడి పేరు వెనక్కి?



అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకట్రావును విజయనగరం జిల్లా గజపతినగరంలో నిలపాలని ఆ పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది. ఆయన గతంలో ఎచ్చెర్లకు ప్రాతినిధ్యం వహించారు. మొదట శ్రీకాకుళం అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి ఇచ్చిన ఆ పార్టీ.. తర్వాత వెనక్కి తీసుకుని ఎచ్చెర్లను కేటాయించింది. దీంతో కళాను గజపతినగరానికి మార్చే విషయమై చర్చ నడుస్తోందంటున్నారు. కొద్ది రోజుల క్రితమే గజపతినగరానికి కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే ఆయనకు అంత అనుకూలత రావడం లేదని ప్రచారం జరుగుతోంది. చీపురుపల్లికి ప్రస్తుతం కిమిడి నాగార్జున ఇన్‌చార్జిగా ఉన్నారు. అక్కడ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును నిలపాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. విశాఖలోని భీమిలిపై ఇంకా తర్జనభర్జనలు సాగుతున్నాయి. ప్రకాశం జిల్లా దర్శిలో ప్రవాసాంధ్రుడు గరికపాటి వెంకట్, ప్రస్తుత ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్, గొట్టిపాటి లక్ష్మి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వెంకట్ కొంతకాలంగా ఆ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతపురం జిల్లా అనంతపురం అర్బన్, గుంతకల్లు, అన్నమయ్య జిల్లా రాజంపేట, కర్నూలు జిల్లా ఆలూరుపై టీడీపీ ఇంకా నిర్ణయానికి రాలేదు. కర్నూలు జిల్లా ఆదోని సీటును బీజేపీకి ఇచ్చారు. ఇప్పుడు దానిని వెనక్కి తీసుకుని ఆలూరు కేటాయించే ప్రతిపాదనపై మధ్య చర్చ నడుస్తోంది. లోక్‌సభ సీట్లలో ఇంకా ఒంగోలు, అనంతపురం, కడప, రాజంపేట అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇందులో ఒంగోలులో మాగుంట రాఘవరెడ్డిని నిలపాలని గతంలో అనుకున్నారు. కానీ ఢిల్లీ మద్యం కేసులో తాజా పరిణామాలతో రాఘవరెడ్డి స్థానంలో ఆయన తండ్రి, సిటింగ్ వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేరు ముందుకొచ్చినట్లు చెబుతున్నారు.

దారికాచి.. కంట్లో కారం కొట్టి!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న జనసేన పార్టీ నాయకులే లక్ష్యంగా వైసీపీ రౌడీలు రెచ్చిపోయారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడు గ్రామంలో జనసైనికులపై వైసీపీ నేత, రౌడీ షీటర్ మన్నెయ్య సహా మరో 20 మంది గొడ్డళ్లతో విరుచుకుపడ్డారు. కారును ధ్వంసం చేసి, నేతలపై పిడిగుద్దులు కురిపించారు. మళ్లీ ఇక్కడ ప్రచారం చేస్తే చంపేస్తామని బెదిరించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దుర్గి మండలం మించాలపాడుకు చెందిన జనసేన నేతలు గురువారం రాత్రి దుర్గిలో జరిగిన పార్టీ సమావేశానికి ఓ వాహనంలో వచ్చారు. విషయం తెలుసుకున్న జంగమహేశ్వరపాడుకు చెందిన వైసీపీ నేతలు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, రౌడీ షీటర్ ఊరిబండి మన్నెయ్య, అతని సోదరుడు ఏగయ్యతోపాటు సుమారు 20మంది వైసీపీ రౌడీలు, మరికొంత మంది మహిళలు దారి కాచారు. గురువారం అర్ధరాత్రి సమయంలో జనసేన నేతలు తిరిగి స్వగ్రామం వెళ్తుండగా జంగమహేశ్వరపురం గ్రామం నడిబొడ్డున వారి వాహనానికి బండ రాళ్లు అడ్డు పెట్టి నిలువరించారు. అప్రమత్తమైన జనసేన నాయకులు తమ కారును వెనక్కి తిప్పే ప్రయత్నం చేశారు. అయితే, వాహనం టైర్లు పక్కనే ఉన్న కాలువలో కూరుకుపోయాయి. అదే అదనుగా భావించిన మన్నెయ్య మరో 20 మంది వాహనంలోని పసుపులేటి ప్రసాద్, సింగంశెట్టి మధు, పసుపులేటి హనుమంతురావు, దాసరి చెన్నయ్యను కాలర్లు పట్టుకుని బయటకు లాగారు. మహిళలు వీరిని చుట్టుముట్టి కళ్లల్లో కారం కొట్టారు. వైసీపీ రౌడీలు కర్రలు, గొడ్డళ్లతో దాడికి దిగారు. "ప్రచారం చేసేంత మగాళ్లారా మీరు.. మీ అంతు చూస్తాం.. చంపేస్తాం" అంటూ గాయాలుపైకి కనపడకుండా పిడిగుద్దులు గుప్పించారు. నలుగురు జనసేన నేతలను దారుణంగా చితకబాదారు. గొడ్డళ్లతో కారును ధ్వంసం చేశారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు జంగమహేశ్వరపాడుకు చేరుకుని, జనసేన నేతలను దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం వైద్యచికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైసీపీ రౌడీ మూకల దాడిలో ధ్వంసమైన జనసేన నేతల వాహనాన్ని దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వైసీపీ రౌడీల దాడిని పోలీసులు ప్రత్యక్షంగా చూస్తున్నా.. కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని జనసేన నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం జరిగిన దాడిలో కీలక పాత్ర పోషించిన మన్నెయ్య వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడుగా కొనసాగుతున్నాడు. జిల్లాలో జరుగుతున్న రాజకీయ హింసపై పల్నాడు ఎస్పీని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి స్వయంగా పిలిపించి మరీ హెచ్చరించారు. కానీ, అదే రోజు(గురువారం) మరో దారుణం జరగడం గమనార్హం. కాగా, జంగమహేశ్వరపాడుకు చెందిన ఊరిబండి మన్నెయ్య పలు హత్యలు, దాడులు, భూకబ్జాలు, రేషన్‌బియ్యం మాఫియా వంటి కేసుల్లో నిందితుడు. వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లిలో జరిగిన హత్య కేసులోనూ నిందితునిగా ఉన్నాడు. జంగమహేశ్వరపాడులో రెండేళ్ల క్రితం టీడీపీ నేత కంచర్ల జల్లయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు. మూడేళ్ల క్రితం ఆవుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై రాడ్లతో దాడి చేసి కాళ్లు విరగొట్టిన కేసులోనూ నిందితుడే. జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేతలు గ్రామంలో ఉండకుండా చేయడంలో ఇతనిదే ప్రధాన పాత్ర అని చెబుతారు. సుమారు 100 టీడీపీ కుటుంబాలు గ్రామం విడిచి వేరే ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాయి. ఇతనిపై రౌడీషీటు నమోదైంది. అధికారపార్టీ నేతల బలం, అధికారుల తోడ్పాటుతో మన్నెయ్య అడ్డగోలుగా రెచ్చిపోతున్నాడని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.





గన్నవరంలో టీడీపీ నాయకురాలి కారు ముందు అడ్డుగా నిలిపిన వాహనం
టీడీపీ మహిళా నేతలను బెదిరిస్తున్న వంశీ అనుచరుడు రంగా

వైసీపీ పోస్టర్ల ఫొటోలు తీశారని..!

▸ గన్నవరంలో టీడీపీ మహిళా నేతలపై ఎమ్మెల్యే వంశీ అనుచరుల వీరంగం

గన్నవరం, మార్చి 22: గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ అనుచరులు టీడీపీ మహిళా నాయకులపై దాడికి తెగబడ్డారు. దీంతో తీవ్ర భయాందోళనలకు గురైన ఆ మహిళా నేతలు కారులోనే ఉండి 100కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం గన్నవరం వైసీపీ కార్యాలయం గోడకు రంగులు, సిద్ధం బ్యానర్, జగన్ బొమ్మతో జెండా దిమ్మకు రంగులు ఉండటాన్ని గమనించిన మహిళలు.. 'సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఫొటోలు తీస్తున్నారు. దీన్ని గమనించిన వైసీపీ కార్యాలయంలో ఉన్న వంశీ అనుచరులు, కార్యకర్తలు 30మంది కారును చుట్టుముట్టారు. కారు అద్దాలను చేతులతో బాదారు. ఇద్దరు మహిళలను తీసుకువచ్చి దాడి చేయాలని ప్రయత్నించడంతో కారులో ఉన్న మహిళలు తీవ్ర భయాందోళనలకు గురై.. అక్కడ నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. అయితే, వీరి కారు ముందుకు కదలకుండా టాటా ఏస్ వ్యాన్, వెనుక టైర్లకు రాళ్లు, ద్విచక్రవాహనం అడ్డుపెట్టి దౌర్జన్యానికి దిగారు. కొద్దిసేపటికి ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ప్రసాద్.. బాధిత మహిళలకు అండగా ఉండడం పోయి.. వారి కారును స్టేషన్‌కు తీసుకురావాలని గద్దించారు. అక్కడికి చేరుకున్న టీడీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. దీంతో సీఐ వారిపై సీరియస్ అయ్యారు. ఇంతలో కారుకు అడ్డుగా పెట్టిన టాటాఏస్ వ్యాన్‌ను వైసీపీ నాయకులు అక్కడి నుంచి పంపేశారు. కేసు కావాలంటే స్టేషన్‌కు రావాలని సీఐ చెప్పటంతో అవసరంలేదని మహిళలు ముందుకు కదిలారు. కాగా, గన్నవరంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందా? లేదా? అని కడప టీడీపీ అభ్యర్థి రెడ్డప్పగారి మాధవి ప్రశ్నించారు. సిద్ధం పోస్టర్, వైసీపీ రంగుల ఫొటోలు తీస్తుంటే ఒక మహిళ అని కూడా చూడకుండా వంశీ అనుచరులు దాడికి ప్రయత్నించారని మండిపడ్డారు. అయినా భయపడేది లేదన్నారు. దాడి చేసినవారిలో ఓలుపల్లి మోహన రంగా, మేచినేని బాబు, ఆర్.వెంకటేశ్వరరావు, చిరంజీవి, మరో ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిపారు. నాయకులపైనే దాడులకు తెగబడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గన్నవరంలో పోలీస్ స్టేషన్‌ను తీసేయాలన్నారు. పౌరులు.. వారి ప్రాణాలు, వారి ఆస్తులను వాళ్లే కాపాడుకుంటారన్నారు.

తప్పని పరిస్థితుల్లోనే

సీటు ఇవ్వలేకపోయా

▸ ఆలపాటి రాజాకు సర్దిచెప్పిన చంద్రబాబు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు వల్ల ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా)కు సీటు ఇవ్వలేకపోయామని, తప్పని పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మాజీ మంత్రి, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆలపాటి రాజా శుక్రవారం రాత్రి చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఆయనతోపాటు మరో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ప్రజా జీవితంలో లేనప్పుడు రాజకీయాల్లో ఉండదలుచుకోలేదని, రాజకీయాల నుంచి తప్పుకోవాలని అనుకుంటున్నానని రాజా.. తన మనసులోని మాటను చంద్రబాబుకు చెప్పారు. వెంటనే స్పందించిన చంద్రబాబు.. అంత కఠిన నిర్ణయం తీసుకోవద్దని కోరారు. భవిష్యత్‌లో ఆయన సేవలను పార్టీకి వినియోగించుకుంటామని చెప్పారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కూడా చంద్రబాబును కలిశారు. పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజును చంద్రబాబు పిలిపించి మాట్లాడారు. ఏ కారణం వల్ల బాపట్ల ఎంపీ సీటు ఇవ్వలేకపోయామో ఆయనకు వివరించారు. కాగా, టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు శనివారం విజయవాడలో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఏ కన్వెన్షన్ సమావేశ మందిరంలో దీన్ని నిర్వహిస్తున్నారు.

తెలంగాణ బీజేపీ నేతకు

బాపట్ల టీడీపీ టికెట్

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి.. ఆంధ్రలో టీడీపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేయబోతున్నారు. ఈ అనూహ్య పరిణామం వివరాల్లోకి వెళ్తే.. మాజీ డీజీపీ టి.కృష్ణప్రసాద్ గడచిన రెండేళ్లుగా తెలంగాణ బీజేపీలో కొనసాగుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ స్థానాన్ని ఆశించారు. ఒకదశలో ఆయన అభ్యర్థిత్వం ఖరారైనట్లు ప్రచారం కూడా జరిగింది. చివరి క్షణంలో అక్కడ గణేశ్ అనే నేతకు ఇచ్చారు. అనంతరం వరంగల్ నుంచి లోక్‌సభకు పోటీచేయాలని భావించారు. అయితే ఇది కూడా ఫలించే అవకాశం లేదని గుర్తించిన ఆయన.. టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. ఆంధ్రలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా చంద్రబాబు ఆయనకు బాపట్ల లోక్‌సభ టికెట్‌ను శుక్రవారం ప్రకటించారు.

పిఠాపురంపై వైసీపీ కుట్రలు

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

▸ ఎన్నికల్లో విజయం కూటమిదే

▸ జనసేన నేతలకు పవన్ స్పష్టీకరణ

▸ అక్కడి నుంచే వారాహితో ప్రచారానికి శ్రీకారం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): "పిఠాపురంలో నేను పోటీ చేస్తున్నానని తెలిసి.. వైసీపీ కుట్రలు పన్నుతోంది. వీటిని ఎదుర్కొనేందుకు కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రణాళికలపై మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో ఆయన చర్చించారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పార్టీ ప్రెసిడెంట్, టూర్ మేనేజ్‌మెంట్ టీం కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులతో సమావేశమయ్యారు. పవన్ పోటీ చేయనున్న పిఠాపురం నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. శక్తిపీఠం, శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్ర భూమి పిఠాపురం నుంచి ప్రచారం మొదలుపెట్టాలని నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. పవన్ నిర్ణయంపై పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పురుహూతిక దేవికి పూజలు నిర్వహించి వారాహి వాహనం నుంచి ప్రచారం మొదలుపెడతానని తెలిపారు. ఆ నియోజకవర్గంలో మూడు రోజుల పాటు పవన్ ఉండి ప్రచారం చేయనున్నారు. నియోజకవర్గం ముఖ్య నాయకులు, మండల నేతలతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం నుంచి ప్రచారం ప్రారంభించనున్న నేపథ్యంలో దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పవన్ పార్టీ కేంద్ర కార్యాలయం వర్గాలను ఆదేశించారు. ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. తాను పోటీ చేస్తున్న స్థానం కావడంతో వైసీపీ ఎన్నో కుట్రలు, పన్నాగాలు పన్నుతోందన్నారు. ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని, ఖచ్చితంగా విజయం మనదేనని చెప్పారు. పిఠాపురం నుంచే జనసేన శంఖం పూరిస్తుందన్నారు. ఈ విజయనాదం రాష్ట్రం నాలుగు వైపులా వినిపించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటించడం, టూర్ మేనేజ్‌మెంట్‌పైనా సభ్యులు పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పిఠాపురం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభంపై పార్టీ నేతలతో చర్చిస్తున్న పవన్

బ్రెజిల్‌తో సాయిరెడ్డికి ఏం సంబంధం?

- విశాఖ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ అక్కడి నుంచే...
- రాష్ట్రాన్ని డ్రగ్స్ రాజధాని చేసిన జగన్: టీడీపీ

అమరావతి(ఆంధ్రజ్యోతి), నక్కపల్లి, మార్చి 22: బ్రెజిల్ దేశంతో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఉన్న సంబంధం ఏమిటో తేల్చాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం శనివారం మాట్లాడారు. "ఎక్కడో ఉన్న బ్రెజిల్‌కి ఒక ప్రాంతీయ పార్టీ అధ్యక్షుడు రెండేళ్ల కిందట దేశాధ్యక్షుడు కాగానే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. బ్రెజిల్‌కు, సాయిరెడ్డికి ఏం సంబంధం? ఇప్పుడు అదే దేశం నుంచి విశాఖ పోర్టుకు డ్రగ్స్ వస్తే సీబీఐ అధికారులు పట్టుకొన్నారు. బ్రెజిల్ దేశంతో సాయిరెడ్డి సంబంధాలపై విచారణ చేయిస్తే ఆ దేశం నుంచి వచ్చిన డ్రగ్స్ లోతుపాతులు తెలుస్తాయి. రెండేళ్ల కిందట తన ఫోన్ పోయిందంటూ విజయసాయిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరి ఫోన్ పోయినా పట్టుకొంటున్నామని చెబుతున్న పోలీసులు ఇంతవరకూ విజయసాయిరెడ్డి ఫోన్ మాత్రం పట్టుకోలేదు. 'ఆ ఫోన్లో బ్రెజిల్ దేశానికి చెందిన ఆర్థిక వ్యవహారాలు ఏమైనా ఉన్నాయా?' అంటూ టీడీపీ యువ నేత లోకేశ్ ఆ రోజే ప్రశ్నించారు. అదే ఇప్పుడు నిజమైంది. బ్రెజిల్ మాఫియా ముఠాలతో వైసీపీ నేతలకు సంబంధాలు ఉన్నాయని మాకు బలంగా అనుమానాలు ఉన్నాయి. సీబీఐ స్వాధీనం చేసుకొన్న కంటైనర్ల వద్దకు రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు, స్థానిక వైసీపీ నేతలు వెళ్లి చాలా హడావుడి చేశారు. సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లోనూ రాశారు. ఆ కంటైనర్లు సీబీఐ స్వాధీనం చేసుకోకుండా ఆపడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. ఎందుకు అంత తాపత్రయం? ఎవరి ఆదేశాలతో ఇలా వ్యవహరించారు?" అని పట్టాభి డిమాండ్ చేశారు.

సంధ్య ఆక్వా యజమాని సాయికి సన్నిహితుడు: అనిత

25 వేల కిలోల డ్రగ్స్‌తో కూడిన కంటెయినర్ బ్రెజిల్ నుంచి విశాఖ వచ్చిందన్నారు. ఆ డ్రగ్స్‌ను దిగుమతి చేసుకొన్న సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ యజమాని ప్రకాశం జిల్లా నాగలుప్పలపాడుకు చెందినవారని, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి అత్యంత సన్నిహితుడని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. కాగా, టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, 'విశాఖలో దొరికిన డ్రగ్స్ వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉంది. సీఎం జగన్ విదేశాల్లో దాచిన డబ్బుతో డ్రగ్స్ బిజినెస్ చేస్తూ సమాజానికి డ్రగ్స్‌ను అలవాటు చేయించడమే కాక, అదే డబ్బుతో ఎన్నికలకు సిద్ధమవుతున్నాడనే అనుమానాలు ఉన్నాయి. సీబీఐ దీనిపై సమగ్ర విచారణ జరిపాలి' అని డిమాండ్ చేశారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి: సీపీఐ

అమరావతి(ఆంధ్రజ్యోతి), అనకాపల్లి, మార్చి 22: డ్రగ్స్ రాకెట్ వెనుక అధికార వైసీపీ నేతలు, పలువురు అధికారుల హస్తం, ఒత్తిళ్లు ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. విశాఖలో డ్రగ్స్ పట్టుబడిన ఉదంతంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అదానీకి దాసోహమంటూ పోర్టులను ప్రైవేట్‌పరం చేయడం వల్లే మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు రెక్కలొచ్చాయని విమర్శించారు.

సాయిరెడ్డి, సుబ్బారెడ్డి అనుచరుడే డ్రగ్స్ బుక్ చేశారు: యామినీ శర్మ

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'విశాఖలో పట్టుబడ్డ డ్రగ్స్ కంటైనర్ కూనం వీరభద్రరావు పేరుతో వచ్చింది. ఆయన సంక్రాంతి సంబరాల్లో విజయసాయిరెడ్డితో కలసి ఫ్లెక్సీలు కట్టారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో సుబ్బారెడ్డికి అనుచరుడు. ఎక్కడ గుట్టు బయట పడుతుందోనని వైసీపీ డ్రామాలు ఆడుతోంది. ఏ మాత్రం సంబంధంలేని పురందేశ్వరిపై నిందలు వేస్తోంది' అని బీజేపీ అధికార ప్రతినిధి యామినీ సాదినేని మండిపడ్డారు. వీరభద్రరావుకు సుబ్బారెడ్డి, సాయిరెడ్డితో సంబంధాలు ఉన్నాయన్నారు.

సీబీఐకి అడ్డు పడలేదట!



కొకైన్ కేసుపై విశాఖపట్నం సీపీ వివరణ

- డాగ్ స్క్వాడ్‌ను పంపాలని కోరితే పోలీస్ పెద్దలు ఎందుకు వెళ్లినట్టు?
- పోర్టు అధికారులకు అక్కడ ఏం పని?
- వారి పరిధిలోకి రాని వీసీటీపీఎల్



విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన కొకైన్ దిగుమతి కేసులో సీబీఐ విచారణకు తాము ఎలాంటి ఆటంకం కలిగించలేదని విశాఖపట్నం పోలీసులు చెబుతున్నారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఇదే విషయం స్పష్టం చేశారు. విశాఖపట్నం కంటెయినర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్(వీసీటీపీఎల్) తమ పరిధిలో లేదని, డ్రగ్స్ కేసు ను సీబీఐ అధికారులే దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. కస్టమ్స్ ఎస్పీ ఫోన్ చేసి నార్కోటిక్ డ్రగ్స్ గుర్తించాల్సి ఉన్నందున డాగ్ స్క్వాడ్ కావాలని అడిగారని వివరించారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ సంబంధం లేదన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో తాము ఎవరి తరఫునా వకాల్తా పుచ్చుకోలేదని వివరించారు.

ఎందుకు వెళ్లారో?

డ్రగ్స్‌ను గుర్తించడానికి డాగ్ స్క్వాడ్‌ను పంపించాలని కోరితే వాటినే పంపుతారు. కానీ పోలీస్ కమిషనర్ వెళ్లరు కదా? వీసీటీపీఎల్‌కు వచ్చిన కంటెయినర్‌లో డ్రగ్స్ ఉన్నాయని అనుమానంగా ఉందని, వాటిని గుర్తించేందుకు సాయం కావాలని కస్టమ్స్ అధికారులు సాయం కోరారని, ఆ తరువాత వద్దని కూడా చెప్పారని అంటున్నారు. విశాఖ పోలీసుల పరిధిలో వీసీటీపీఎల్ లేనప్పుడు, డాగ్ స్క్వాడ్‌ను కూడా కస్టమ్స్ అధికారులు నిరాకరించినప్పుడు పోలీసు ఉన్నతాధికారులు అక్కడకు ఎందుకు వెళ్లినట్టు? కొకైన్ ఉన్నట్టు తేలిన తరువాత.. వాటి శాంపిల్ ఎందుకు అడిగినట్టు అనేది ప్రశ్న. సీబీఐ అధికారులు కంటెయినర్ ఓపెన్ చేసి డ్రై ఈస్ట్‌ను పరిశీలిస్తున్నప్పుడు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు అడ్డుపడ్డారు. వర్షం పడే సూచన ఉన్నందున సరుకు(డ్రై ఈస్ట్) తడిచి పాడైపోతుందని, కంటెయినర్‌లో ఆ సరుకు వేసేసి తాళం వేయాలని, తరువాత తీరిగ్గా పరిశీలించుకోవచ్చని కోరారు. దీనికి సీబీఐ అధికారులు అంగీకరించలేదు. ఇదే విషయాన్ని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంటూ తమ విచారణ జాప్యం కావడానికి పోర్టు అధికారుల రాష్ట్ర అధికారులు కారణమని వివరించారు. విశాఖ పోలీస్ కమిషనర్ దీనిని 'సీబీఐ టెక్నికల్ రీజన్' అంటూ వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ జరుగుతున్న ప్రాంతానికి ఎవరూ వెళ్లడానికి వీల్లేదు. అయితే పోర్టు అధికారులు కూడా ఉన్నారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

సీబీఐకి ఏ అడ్డంకులూ కల్పించలేదు: కమిషనర్

విశాఖలో డ్రగ్స్‌కు సంబంధించి సీబీఐ చేపట్టిన దర్యాప్తునకు ఎటువంటి అడ్డంకులు కల్పించలేదని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ చెప్పారు. నార్కోటిక్ డ్రగ్స్‌ను తనిఖీ చేయడానికి డాగ్ స్క్వాడ్ కావాలని కస్టమ్స్ ఎస్పీ ఫోన్ చేసి అడిగితే పంపించామన్నారు. ఏపీ అధికారులు తమ విధులకు అడ్డంకులు కల్పించారని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశం గురించి మాట్లాడుతూ.. అది టెక్నికల్ రీజన్ అని కొట్టిపారేశారు. కాగా, మీడియా ప్రశ్నలకు ఆయన అవకాశం ఇవ్వలేదు.

ఎవరెవరు వెళ్లారంటే..

వీసీటీపీఎల్‌కు డాగ్ స్క్వాడ్‌తో పాటు మరికొందరు రాష్ట్ర అధికారులు వెళ్లారు. విశాఖ సిటీ సెక్యూరిటీ వింగ్ నుంచి ఒక ఏసీపీ, పోలీస్ కమిషనర్ రవిశంకర్, మరో మహిళా అధికారి వెళ్లారు. విశాఖపట్నం పోర్టు తరఫున ఇద్దరు విజిలెన్స్ అధికారులు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు. వారివల్ల తమ విధి నిర్వహణలో జాప్యం జరిగిందని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.



కాకినాడ జిల్లా మూలపేట సెజ్‌లో సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పరిశ్రమ

కొకైన్ గుట్టు విప్పేద్దాం

- వేగవంతంగా సీబీఐ దర్యాప్తు

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి)/కొత్తపల్లి/శంఖవరం, మార్చి 22: కొకైన్ కేసులో దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. కంటెయినర్‌లోని మొత్తం డ్రై ఈస్ట్ బ్యాగుల నుంచి శాంపిల్స్ సేకరించడంతో పాటు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సోదాలు నిర్వహించింది. విశాఖపట్నం కంటెయినర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్)కు డ్రై ఈస్ట్ పేరుతో వచ్చిన డ్రగ్స్‌ను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిషింగ్ హార్బర్ పక్కనున్న వీపీటీఎల్‌కు శుక్రవారం ఉదయం సీబీఐ కోర్టు న్యాయాధికారి కొందరు సహాయకులతో కలిసి వెళ్లారు. కొకైన్ వచ్చిన కంటెయినర్‌ను ఆయన సమక్షంలో సీబీఐ అధికారులు తెరిపించి అందులో అన్ని బ్యాగుల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ నెల 19న సీబీఐ విచారణ జరిపినప్పుడు మొత్తం వెయ్యి బ్యాగుల్లో 40 తెరిచారు. అందులో 27 బ్యాగుల నుంచి సేకరించిన నమూనాలను నార్కోటిక్ డ్రగ్స్ కిట్ సాయంతో పరీక్షించి వాటిలో కొకైన్ ఉన్నట్టు గుర్తించారు. ఇంకా 960 డ్రై ఈస్ట్ సంచులు ఉండడంతో వాటన్నింటి నుంచి శుక్రవారం నమూనాలు తీసి, వాటికి సీల్ వేసి పరీక్షలకు పంపించారు. నమూనాలు తీసిన తరువాత వేయి బ్యాగులను కంటెయినర్‌లో పెట్టి సీజ్ చేశారు. సాధారణంగా ఇలాంటి తనిఖీలు జరిగినప్పుడు సీజ్ చేసిన కంటెయినర్లను వీసీటీపీఎల్‌లోనే ఓ పక్కన ఉంచుతారు. ఎర్రచందనంతో వచ్చి దొరికిపోయిన కంటెయినర్లు కొన్ని ఇప్పటికీ ఇక్కడే ఉన్నాయి. అయితే కొకైన్ కేసును సీబీఐ సీరియస్‌గా తీసుకోవడంతో ఆ కంటెయినర్‌ను వీసీటీపీఎల్‌లో ఉంచకుండా ప్రభుత్వానికి చెందిన బామర్ లారీ లాజిస్టిక్స్ పార్కుకు తరలించే ఏర్పాటు చేసింది. తాజాగా తీసిన 960 నమూనాల ఫలితం చూసుకొని తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది.

సంధ్యా ఆక్వాలో తనిఖీలు

కాకినాడ జిల్లా కొత్తపల్లి, శంఖవరం మండలాల్లోని సంధ్యా ఆక్వాలో సీబీఐ సోదాలు నిర్వహించింది. బ్రెజిల్ నుంచి విశాఖలోని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున దిగుమతి చేసుకున్న 25 వేల కిలోల డ్రగ్స్ కంటెయినర్‌ను విశాఖ పోర్టులో సీబీఐ అధికారులు పట్టుకున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సదరు పరిశ్రమ బ్రాంచ్‌ల్లో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలం మూలపేటలోని కేఎస్ఈజెడ్‌లో నెలకొల్పిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌లో గురువారం అర్ధరాత్రి దాటాక.. శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐకి చెందిన ఏడుగురు అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల నుంచి వివరాలను సేకరించింది. పరిశ్రమ లేబొరేటరీలో రొయ్యలకు వేసే మేతను పరిశీలించింది. అనంతరం ఆ మేత శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ నిపుణులు విశాఖ తరలించినట్లు సమాచారం. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వీరభద్రరావుచౌదరి ప్రకాశం జిల్లాకు చెందినవారు. ఆయన విశాఖపట్నం, కేఎస్ఈజెడ్‌లో, ప్రకాశం జిల్లాలోని సంధ్యా ఆక్వా పరిశ్రమలను నిర్వహిస్తారని సమాచారం. కాకినాడకు చెందిన పర్వతనేని నరసింహరాజుచౌదరి ఎండీ-2గా ఎస్ఈజెడ్‌లో ఉన్న సంధ్యా ఆక్వా పరిశ్రమల నిర్వాహణ బాధ్యతలు చేపడుతున్నట్లు తెలిసింది. శంఖవరం మండలం వజ్రకూటంలో నూతనంగా నిర్మితమైన సంధ్యా ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కూడా సీబీఐ సోదాలు నిర్వహించింది. ఐదుగురు సభ్యుల బృందం ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించి కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేసింది. కంపెనీ సిబ్బంది, ఉద్యోగులు ఎవరూ బయటకు వెళ్లకుండా కట్టడి చేసి సోదాలు నిర్వహించింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని సీబీఐ అధికారులు తెలిపారు.

'సంధ్య' కుటుంబమంతా వైసీపీలోనే..!

- సీఈవో కోటయ్య పెదనాన్న ఈదుమూడి సింగిల్ విండో చైర్మన్
- వీరభద్రరావు, కోటయ్యలకు విజయసాయిరెడ్డితో సాన్నిహిత్యం
- ఇవన్నీ దాచి టీడీపీపై వైసీపీ ప్రచారం

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)

విశాఖ డ్రగ్స్ కేసులో చిక్కుకున్న సంధ్య ఆక్వా ఇండస్ట్రీస్ యాజమాన్య కుటుంబమంతా వైసీపీలోనే ఉంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి వారి స్వగ్రామం. ఆ సంస్థ సీఈవో కోటయ్యచౌదరి పెదనాన్న కూనం పూర్ణచంద్రరావును గ్రామ సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జిగా వైసీపీ ప్రభుత్వం నియమించింది. నాగులుప్పలపాడు మండలంలో ఆయన అధికార పక్ష నేతగా ఉన్నారు. ప్రస్తుత సంతనూతలపాడు వైసీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఆ నియోజకవర్గ ప్రస్తుత వైసీపీ అభ్యర్థి, మంత్రి మేరుగ నాగార్జున.. కూనం కుటుంబంతో కలిసి ఆ మండలంలో రాజకీయ వ్యవహారాలు సాగిస్తున్నారు. సంస్థ యజమాని కూనం వీరభద్రరావు జీవిత చరిత్ర అనేక ఆరోపణలతో కూడుకుని ఉంది. విదేశాల్లో అరెస్టయిన చరిత్ర కూడా ఆయనకు ఉంది. ఆయన కుమారుడే సీఈవో కోటయ్యచౌదరి. వీరభద్రరావు, మరో సోదరుడు రమణ.. సంధ్య ఆక్వా మెరైన్స్ సంస్థ నిర్వాహకులు (ప్రస్తుతం వారి కుమారులు చూస్తున్నారు). తొలుత వీరభద్రరావు బ్యాంకులో ఉద్యోగిగా పనిచేసేవారు. చీరాలలో రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తితో కలిసి 3 దశాబ్దాల క్రితం రొయ్యల వ్యాపారం ప్రారంభించారు. కొంతకాలానికే రాజేంద్రప్రసాద్‌ను, వైజాగ్‌కు చెందిన మరో భాగస్వామిని పక్కకు తప్పించి వీరభద్రరావు, రమణ ఆ సంస్థను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం వీరి ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వందల ఎకరాల్లో ఆక్వా చెరువులు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు నడుస్తున్నాయి. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రెండు దశాబ్దాలుగా విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు నడుపుతోంది. కాకినాడ జిల్లా కత్తిపూడిలో కొత్తగా ఏర్పాటుచేసిన వ్యాపార సంస్థ కోసం బ్రెజిల్ నుంచి డ్రై ఈస్ట్‌ను తెప్పించినట్లు యాజమాన్యం చెబుతోంది. అయితే ఆ కంటైనర్‌లో కొకైన్ బయటపడడం సంచలనంగా మారింది. కాగా.. వీరభద్రరావు కుటుంబం గతంలో కాంగ్రెస్‌లో ఉండేది. వైసీపీ ఏర్పడిన తర్వాత ఆ పార్టీలో చేరారు. పూర్ణచంద్రరావు ప్రస్తుతం వైసీపీ ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొంటున్నారు.

పండుగలూ ఆ పార్టీ పేరిటే!

ఏటా సంక్రాంతికి కుటుంబసభ్యులందరూ ఈదుమూడి వస్తారు. సంక్రాంతి సంబరాల పేరుతో వైసీపీ తరఫున కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ కుటుంబం ఆర్థికంగా బలంగా ఉండడంతో వైసీపీకి సహకారం అందిస్తుంటారు. వీరభద్రరావు, కోటయ్యలకు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డితోపాటు ఆపార్టీకి చెందిన ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ వాస్తవాలన్నిటినీ వైసీపీ పక్కనపెట్టింది. కోటయ్యచౌదరి చదువుకునే సమయంలో టీడీపీ నేతలతో ఆయనకున్న పరిచయాలను తెరపైకి తెచ్చి సంధ్యా ఆక్వా నిర్వాహకులకు టీడీపీ నేతలతో సంబంధాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం చేస్తోంది.



కొకైన్ ఎలా వచ్చింది?

- బ్రెజిల్‌లో తనిఖీలు సరిగా చేయలేదా?
- అక్కడి కస్టమ్స్ తీరుపై సందేహాలు
- ఆ దేశంతో వైసీపీ నేతలకు సంబంధాలు
- భారత రాయబారిగా సురేశ్‌రెడ్డి
- నియామకంలో చక్రం తిప్పినట్టు ఆరోపణలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బ్రెజిల్ నుంచి విశాఖకు వచ్చిన కంటెయినర్‌లో కొకైన్ పట్టుబడిన నేపథ్యంలో ఎన్నో ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతున్నాయి. బ్రెజిల్‌తో వైసీపీ నేతలకు ఉన్న సంబంధాలు వెలుగు చూస్తున్నాయి. డ్రై ఈస్ట్ పేరుతో వచ్చిన కంటెయినర్‌ను విశాఖ పోర్టులో సీబీఐ అధికారులు అనుమానంతో తెరిచి పరీక్షించినప్పుడు నార్కోటిక్ డ్రగ్స్ ఉన్నట్టు తేలింది. అంటే.. డ్రగ్స్‌ను కంటెయినర్ ద్వారా అక్రమంగా బ్రెజిల్ నుంచి విశాఖపట్నం సరఫరా చేసినట్టు తేలింది. బ్రెజిల్‌లో కస్టమ్స్ అధికారులు సరిగ్గా తనిఖీలు చేయలేదా? లేదంటే మార్గ మధ్యంలో ఇంకేమైనా జరిగిందా?...అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కస్టమ్స్ సర్టిఫై చేశాకే...

ప్రపంచవ్యాప్తంగా కంటెయినర్ల రవాణా భారీగా పెరుగుతోంది. ఎటువంటి సరుకునైనా సురక్షితంగా తక్కువ వ్యయంతో గమ్యం చేర్చుకునే అవకాశం ఉండడంతో వ్యాపారులు వీటి వైపే మొగ్గు చూపుతున్నారు. అయితే కొందరు వీటిని సరుకు అక్రమ రవాణాకు, డ్రగ్స్ తరలింపునకు వాడుకుంటున్నారు. ఇటువంటి వాటిని పరిశీలించి, నివారించాల్సిన విభాగమే కస్టమ్స్. అన్ని దేశాల్లోను కస్టమ్స్ విభాగం ఉంటుంది. సముద్ర మార్గం ద్వారా పంపించే కంటెయినర్లను వీరు పరిశీలించి, సర్టిఫై చేశాకే నౌకలోకి ఎక్కించాలి. ఉదాహరణకు ఒక కంటెయినర్‌లో ఫలానా కంపెనీ కార్లను ఫలానా దేశానికి రవాణా చేస్తున్నామని వ్యాపారి దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆ కంటెయినర్‌లో ఆ కంపెనీ కార్లే ఉన్నాయా? వేరే ఇంకేమైనా ఉన్నాయా? ఆ కార్లలో ఇంకేమైనా పెట్టి తరలిస్తున్నారా? వంటి విషయాలను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేసి సర్టిఫై చేయాలి. ఆ తర్వాతే కంటెయినర్ నౌకలోకి వెళుతుంది. గమ్యస్థానం చేరిన తరువాత అక్కడి కస్టమ్స్ అధికారులు కూడా ఆ కంటెయినర్ తెరిచి క్షుణ్ణంగా పరిశీలించాలి. సక్రమంగా ఉంటే 'అవుట్ ఆఫ్ చార్జ్' అని సర్టిఫై చేస్తారు. అప్పుడే వాటిని వ్యాపారి బయటకు తీసుకువెళ్లగలుగుతారు. బ్రెజిల్ నుంచి విశాఖకు వచ్చిన కంటెయినర్‌ను అక్కడి కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేశారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాకతాళీయమా? ప్రణాళికా?: బ్రెజిల్ దేశంతో వైసీపీ నాయకులు ఇటీవల కాలంలో సంబంధాలు పెంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 అక్టోబరులో అక్కడ కొత్త అధ్యక్షుడు ఎన్నికైతే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఆయన్ను అభినందించారనే వార్తలు వచ్చాయి. బ్రెజిల్‌లో భారత రాయబారిగా సురేశ్ కె. రెడ్డి పనిచేస్తున్నారు. వైసీపీ నేతలే ఢిల్లీలో చక్రం తిప్పి ఆయన్ను నియమింపజేశారని అంటున్నారు. ఇప్పుడు బ్రెజిల్ నుంచే భారీగా డ్రగ్స్ విశాఖపట్నం పోర్టుకు రావడం కాకతాళీయమా? లేక ప్రణాళిక ప్రకారమే జరిగిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అక్కడ సత్సంబంధాలు ఉన్న మాట నిజమైతే కంటెయినర్‌ని తనిఖీ చేయకుండానే పంపించే అవకాశాలు ఉన్నాయని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



ద్వారకాతిరుమల దేవస్థానంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రామదాసు, నారాయణ, రమణ(సర్కిల్‌లో ఉన్న వ్యక్తులు)

వైసీపీ ఎన్నికల ప్రచారంలో

దుర్గగుడి కేశఖండనశాల ఉద్యోగులు

వన్‌టౌన్, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులెవ్వరూ ఏ రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. అయినా దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం కేశఖండనశాలలో పనిచేస్తున్న ఆలయాల కేశ ఖండనశాల జేఏసీ నాయకులుగా చెప్పుకుంటున్న రామదాసు, ఏజీఎల్ నారాయణ, ఆర్వీ రమణ ద్వారకాతిరుమల దేవస్థానంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు దుర్గ గుడి కేశఖండనశాలలోని విధులకు వారు హాజరయ్యారు. తర్వాత టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్యతో కలిసి ఉదయం 7గంటలకు ద్వారకా తిరుమల దేవస్థానం కేశఖండనశాలలో వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. దీనిపై ఆ దేవస్థానంలో పలువురు ఉద్యోగులు ఆలయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో త్రినాథరావు వెంటనే పూర్తి విచారణ చేసి కేశఖండన శాల సూపరిండెంటెంట్‌ను సస్పెం డ్ చేశారు. కరపత్రాలు పంపిణీ చేసిన నాయీబ్రాహ్మణులనూ విధుల నుంచి తొలగించారు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు. రామ దాసు, నారాయణ, రమణలపై చర్యలు తీసుకోలేదు. దీనిపై పలువురు దుర్గ గుడి ఉద్యోగులు విమర్శిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ ఈ ముగ్గురు చంద్రబాబును దూషించినట్లు పలువురు క్షురకులు చెబుతు న్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావును ఫోన్ లో వివరణ కోరగా కేశఖండనశాలలో పనిచేస్తున్న రామదాసు, నారాయణ, రమణ ద్వారకాతిరుమలలో వైసీపీ తరఫున ఎన్ని కల ప్రచారం చేసినట్లు తెలిసిందని తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారామ్ డిమాండ్

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఆలయాలు, కేశఖండనశాలలో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారామ్ శుక్ర వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు సిద్ధవటం యానాదయ్య, నాయీబ్రాహ్మణ జేఏసీ నాయకులు రామదాసు, నారాయణ, రమణ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ద్వారకాతిరుమలలో వైసీపీ కర పత్రాలు పంపిణీ చేస్తూ ఎలా ప్రచారం చేస్తారని ఆయన ప్రశ్నించారు. వారితోపాటు ప్రచారంలో పాల్గొన్నవారిపైనా వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



అప్సర థియేటర్ వద్ద రజాకార్ చిత్ర యూనిట్

నగరంలో రజాకార్ సందడి

గవర్నర్‌పేట, మార్చి 22: తెలంగాణలో నిజాం ప్రైవేట్ సైన్యం రజా కార్లు సాగించిన అరాచకాలు, అకృత్యాలు కథాంశంగా రూపొందించిన రజా కార్ చిత్రం ఉభయ తెలుగురాష్ట్రాల్లో బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపి స్తోందని అని చిత్ర దర్శకుడు మాట సత్యనారాయణ తెలిపారు. రజాకార్ చిత్ర యూనిట్ శుక్రవారం వి జయవాడలో సందడి చేసింది. సినిమా ప్రమో షన్‌లో భాగంగా చిత్రం ప్రదర్శిస్తున్న అప్సర థియేటర్‌కు యూనిట్ వచ్చిం ది. యూనిట్ సభ్యులకు థియేటర్ యాజమాన్యం ఘనస్వాగతం పలికింది. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రేక్షకులు చిత్ర యూనిట్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ప్రధాన పాత్రధారి రాజ్ అర్జున్ ధన్యవాదాలు తెలిపారు. మార్నింగ్‌షోను ప్రేక్షకులతో కలిసి చిత్రయూనిట్ వీక్షించింది. నటి ఇంద్రజ, సహ నిర్మాత పోతిరెడ్డి అంజిరెడ్డి ప్రమోషన్‌లో పాల్గొన్నారు.



కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తున్న ఇండియా కూటమి నేతలు

కేజ్రీవాల్ అరెస్టు అప్రజాస్వామికం

ధర్నాచౌక్, మార్చి 22: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఇం డియా కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన అధికారులు ప్రతిపక్ష పార్టీలపై మాత్రమే దాడులు చేస్తున్నారని వారు ఆగ్ర హం వ్యక్తంచేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అధికారులు అధికార పార్టీ నియంతృత్వ విధానాలకు మద్దతు పలుకుతున్నారని కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి నేతి మహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేజ్రీవాల్ ఎన్నికల కోసం నిధులు తీసుకున్నారని ఆరోపిస్తున్నారని, బీజేపీ రూ. 5 వేల కోట్లకుపైగా నిధులు అడ్డదారిలో సేకరించిందని దీనిపై ఈడీ చర్యలు ఉం డవా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆప్ కన్వీనర్ రమేష్ అన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రతో బీజేపీ భయపడిందని కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ అన్నారు. అందువల్లే తమ పార్టీ ఆర్థిక లావాదేవీలను స్తంభింపజేసి ఎన్నికల్లో దెబ్బకొట్టాలని చూస్తోందని ఆమె ఆరోపించారు. ఫ్యూచర్ గేమింగ్ కంపెనీతో సంబంధా లున్న అమిత్‌షాను అరెస్టు చెయ్యరా? అని సీపీఐ రాష్ట్ర నాయకురాలు అక్కి నేని వనజ ప్రశ్నించారు. కాంగ్రెస్, ఆప్, సీపీఐ నాయకులు కోటేశ్వరరావు, ఫణికుమార్, వివిధ పౌర, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీసీపీ అధిరాజ్ సింగ్‌రాణా

సజావుగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

● డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా

గుణదల, మార్చి 22: సార్వత్రిక ఎన్ని కలు ప్రశాంత వాతావ రణంలో సజావుగా నిర్వ హించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డీసీపీ అధిరాజ్ సింగ్‌రాణా తెలిపారు. సీపీ కాంతి రాణా ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేం ద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సంఘవిద్రోహ శక్తులు, అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కొరడా ఝుళిపించి సామాన్య ప్రజ ల్లో ధైర్యం నింపాలని సీఐలకు ఆయన సూచించారు. గత ఎన్నికల్లో గొడ వలు, అల్లర్లు జరిగిన పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రా లుగా గుర్తించామని డీసీపీ తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిపించేం దుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల్లో అలజడులు సృష్టించినా, అల్లర్లను ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని ఆయన హెచ్చరించారు. గ్రామస్థాయిలో సమస్యలు ఉంటే ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రసాదంపాడు, రామవర ప్పాడు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీ పి.భాస్కరరావులు సందర్శించారు. గంపలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉటుకూరు, పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించి ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐలకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.





వాటర్ ట్యాంకుపై వైసీపీ రంగులు

భవానీపురం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా 43వ డివిజన్‌లోని చంద్రబాగ్ సాబు ఎలిమెంటరీస్కూల్ రోడ్డులోని వాటర్ ట్యాంకు పై ఇంకా వైసీపీ జెండాలోని రంగులే దర్శనమిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రానికి ఓటర్లు ఓటేసేందుకు వస్తారు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఇదే పోలింగ్ కేంద్రాన్ని వినియోగించారు. కార్పొరేషన్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు కోడ్ అమలుకు ఏం చేస్తారో చూడాలి.



పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో సీఎం జగన్ ఫొటో ఉన్న పోస్టర్

అధికారులకు పట్టని కోడ్

కోడ్ అమలులో ఉన్నా ఇంకా సీఎం జగన్ ఫొటోలు ఉన్న పోస్టర్లు, బ్యానర్లను కొన్ని చోట్ల తొలగించలేదు. అధికారులు కోడ్ అమలు చేయడంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. - విజయవాడ



తాడేపల్లి సర్వీసు రోడ్డులో సీఎం జగన్, వైఎస్సార్ బొమ్మలతో పోస్టర్లు

కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వమే రావాలి

ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాం: కేశినేని చిన్ని

విద్యాధరపురం, మార్చి 22: కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వమే రావాలని కేశినేని శివనాథ్(చిన్ని) ఆకాంక్షించారు. టీడీపీ-బీజేపీ-జనసేన విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా ఆయనను శుక్రవారం ప్రకటిం చిన సందర్భంగా గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో చిన్ని మాట్లాడారు. తనకు సీటు కేటాయించిన చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తానెప్పుడూ చంద్రబాబు ఆదేశాలను పాటిస్తూ టీడీపీ సేవలోనే ఉంటానని స్పష్టం చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో తాను చేసిన సేవలను వెల్లడించారు. "విజయవాడ నుంచి ఎంపీలుగా గెలి చిన వారు ఏమి చేయలేదు. వెన్నీస్, ప్యారీస్ అన్నారు. కానీ ఏమీ జరగ లేదు. విజయవాడలో రోజువారీ కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆటో నగర్‌లోనే 70వేల మందికి పైగా పనిచేస్తున్నారు. వీరంతా సాంకేతికంగా అభివృద్ధి చెందలేదు. వాహనాల సమస్యలను గుర్తించడంలో కంప్యూటర్ టెక్నాలజీ వచ్చింది. కార్మికులందరూ ఈ టెక్నాలజీకి దూరంగా ఉన్నారు. లోకేశ్ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి కార్మి కులకు శిక్షణ ఇప్పిస్తా. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తాం. వి జయవాడలో విస్తరణ అయిన 34 రోడ్లు, 8 ఫ్లైఓవర్‌లు చంద్రబాబు హయాంలోనే జరిగాయి. తనకు రెండేళ్లుగా బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, తంగిరాల సౌమ్య అండగా ఉండి ముందుకు నడిపిస్తున్నారని, టీఎన్‌టీయూసీ, టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగు యువత, తదితర పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, తనకు తోడుగా నిలిచారని ఆ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

తెలుగుతమ్ముళ్ల హృదయాలను గెలుచుకున్న పవన్

పవన్‌కల్యాణ్ తెలుగుతమ్ముళ్ల హృదయాలను గెలుచుకున్నారని చిన్ని అన్నారు. ఆటోనగర్‌ను, రవాణా రంగాన్ని అభివృద్ధి చేస్తానని, లారీ యజమానుల సమస్యలను పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వి జయవాడలో 40వేల మంది తాపీ కార్మికులకు ఇసుక మాఫియా కార ణంగా పనులు తగ్గిపోయాయన్నారు. అధికారంలోకి రాగానే తాపీ పనులు నిత్యం ఉండేలా చూస్తామన్నారు. నందిగామ నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, ఆగిపోయిన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జగ్గయ్యపేటకు రైల్ కనెక్టివిటీ పెంచి ఇండస్ట్రియల్ కారిడర్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. తిరువూ రులో కిడ్నీ బాధితులకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సురక్షిత తాగునీటిని అందజేస్తామన్నారు. వినుగడప బ్రిడ్జిని నిర్మిస్తామని టెక్స్‌టైల్ ఇండస్ట్రీతో మాట్లాడి మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఎరు బోతు రమణారావు, గొట్టుముక్కల రఘురామరాజు, సొంగాసంజయ్ వర్మ, ఫతావుల్లా, టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

చిన్నికి అభినందన



కేశినేని చిన్నికి అభినందనలు తెలుపుతున్న నెట్టెం రఘురామ్

కూటమి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కేశినేని శివనాథ్ (చిన్ని)ను ప్రకటించిన సంద ర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌తో పాటు పలు వురు నాయకులు ఆయనను ఎన్టీ ఆర్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



యనమలకుదురులో పాదయాత్ర చేస్తున్న బోడె ప్రసాద్ తదితరులు

భారీ మెజారిటీతో గెలుస్తా

● చంద్రబాబుకు పెనమలూరును కానుకగా ఇస్తా: బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 22: నియోజకవర్గంలో మునుపెన్నడూ రాని మెజా రిటీని సాధించి పెనమలూరు సీటును అధినేత చంద్రబాబుకు కానుకగా ఇస్తానని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. శుక్రవారం టీడీపీ అధిష్టానం బోడెకు టికెట్ ప్రకటించాక ఆయనను టీడీపీ శ్రేణులు అభినం దించాయి. తర్వాత యనమలకుదురు 24వ డివిజన్‌లో ఆయన పాదయాత్ర చేశారు. చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి పెనమలూరు టికెట్‌ను కేటాయిం చడం తన అదృష్టమన్నారు. ఐదేళ్లుగా తాను పడిన కష్టానికి ప్రతిఫలంగా భావిస్తా నన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పెనమలూరులో పార్టీని పటిష్టపరిచిన తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఆయన వెంట జనసేన తాడి గడప అధ్యక్షుడు తాతపూడి గణేష్, నియోజకవర్గ బాధ్యులు ముప్పారాజా, వడ్డి జీవా, కరిమికొండ సురేష్, తిరుమలశెట్టి సుధీర్, వంకాయలపాటి ప్రవీణ్, గొల్ల శ్రీను, బోడె ప్రసాద్ కుమార్తె వైష్ణవి, కుమారుడు వెంకట్రాం, టీడీపీ నేతలు అను మోలు ప్రభాకరరావు, అనంతనేని చంద్రశేఖర ఆజాద్, సాదిక్, శొంఠి శివరాంప్ర సాద్, కోయ ఆనంద్‌ప్రసాద్, పాదాల ప్రభాకర్, సంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, తమ్ము అశోక్, దండమూడి చౌదరి, సూదిమళ్ల రవీంద్ర, పీతా గోపీ చంద్, ముసునూరి శ్రీనివాసరావు, ముసునూరి నిర్మల్, ముసునూరి శ్రీధర్, గుజ్జర్ల పూడి బాబురావు, కొక్కిలిగడ్డ సంగీతరావు, రేపాకుల నాగలక్ష్మి ఉన్నారు.





క్యూలైన్లలో భక్తులు, పూజలందుకుంటున్న అమ్మవారు

దుర్గగుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, మార్చి 22: అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం రద్దీ ఏర్పడింది. ఈవో రామారావు టికెట్ కౌంటర్లు, క్యూల వద్ద పరిస్థితిని సమీక్షించి తగుసూచనలు చేశారు. ఇటీవల టికెట్లు రీసైక్లింగైన నేపథ్యంలో వాటిపై ఈవో దృష్టి సారించారు. ఖడ్గమాల అర్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, కుంకుమ పూజలు వైభవంగానిర్వహించారు.

పరోక్షంగా పూజలు వీక్షించే అవకాశం

స్వయంగా పూజల్లో పాల్గొనలేని భక్తులు కనకదుర్గమ్మ, ఆర్ట్. ఎన్‌ఇన్/హోమ్ వెబ్‌సైట్ ద్వారా ఆర్జిత సేవా సొమ్ము చెల్లించి వీక్షించవచ్చునని దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దేవస్థానం పండితులు

దుర్గమ్మ సేవలో జస్టిస్ డి.వెంకటరమణ

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గమ్మ దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందించారు.

దుర్గగుడిలో అన్న వితరణకు

రూ.పది లక్షల విరాళం



రూ.పది లక్షల విరాళమిచ్చిన పుల్లారెడ్డి కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, మార్చి 22: హైదరాబాద్‌కు చెందిన ఎస్వీ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఎస్.పుల్లారెడ్డి దంపతులు దుర్గగుడిలో అన్న వితరణ కోసం శుక్రవారం ఈవో రామారావుకు రూ.10,03,000 వితరణ అందించారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులను పండితులు అందించారు.

25న గిరిప్రదక్షిణ

ఫాల్గుణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై ఈనెల 25న ఉదయం 5.55గంటలకు గిరిప్రదక్షిణను నిర్వహిస్తు న్నట్లు ఆలయ ఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు కామ దేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమై కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేళారోడ్డు, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి గిరిప్రదక్షిణ కొండమీదకు చేరుకుంటుంది.

తనిఖీల్లో భారీగా నగదు, బంగారం పట్టివేత

● జ్యుయెలరీ షాపు గుమాస్తా వద్ద రూ.26.33 లక్షలు, 2.6 కేజీల బంగారం స్వాధీనం

వన్‌టౌన్, మార్చి 22: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో శుక్రవారం విజయవాడలో భారీగా నగదు, బంగారాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ గోవింద్ ప్రమణ్‌కుమార్, జి.సుబ్బారెడ్డి, స్టాటిక్ సర్వైలెన్స్ టీం, గవర్నర్‌పేట సీఐ, ఎస్సైలు ఎన్టీఆర్ కాంప్లెక్స్ పార్కింగ్ వద్ద నిర్వహిం చిన తనిఖీల్లో గాదె రవీంద్రబాబు కారులో తీసుకెళుతున్న రూ.26.33లక్షల నగదు, 2.6 కేజీల బంగారం పట్టుకున్నారు. నగదు, బంగారం మొత్తం వి లువ రూ.1.60 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. సరైన ఆధారాలు చూపించకపోవడంతో నగదు, బంగారాన్ని సీజ్ చేసి ఇన్‌కంట్యాక్స్, జీఎస్టీ వి భాగాలకు రిఫర్ చేశారు. ఐపీసీ సెక్షన్ 102 కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గాదె రవీంద్రబాబు గవర్నర్‌పేటలోని ఓ ప్రముఖ జ్యుయలరీ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నారు. బంగారు ఆభర ణాలను దుకాణాలకు విక్రయించి నగదు తీసుకొచ్చి షాపు యాజమానికి అప్పగిస్తుంటాడు. ఈ క్రమంలో ఎటువంటి బిల్లులు లేకుండా రూ.26.33 లక్షలు, 2.6 కేజీల బంగారంతో అధికారులకు దొరికాడు.

రేపు బాడీ బిల్డింగ్ రాష్ట్ర టీమ్ ఎంపిక

విజయవాడస్పోర్ట్సు, మార్చి 22: గోవాలో ఐబీబీఎఫ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6, 7వ తేదీల్లో నిర్వహించే 13వ ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ టీమ్ ఎంపిక కార్యక్రమాన్ని రాష్ట్ర అసోసియేషన్ ఈనెల 24న ఉదయం 10 గంటలకు భీమవరంలో నిర్వహించనుంది. పాల్గొనేవారు ఉమ్మడి జిల్లాల బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి, అశోక్ జిమ్ అధినేత తాళ్లూరి అశోక్‌ను సంప్రదించాలని నిర్వాహ కులు తెలిపారు. ఆధార్‌కార్డు, జిల్లా అసోసియేషన్ లెటర్ తీసుకుని వెళ్లాలని సూచించారు. భీమవరం వెళ్లేవారు టీపీబీబీఏ ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరావును 91775 75917లో సంప్రదించాలని అశోక్ సూచించారు.

సికింద్రాబాద్-సత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 22: హోలీ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు సికింద్రాబాద్-సత్రగచ్చిల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపు తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మంద్రూప్కర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. 07645 నెంబరు గల సికింద్రా బాద్-సత్రగచ్చి రైలు ఈనెల 23వ తేదీ రాత్రి 9.05 గంటలకు బయలుదేరి, 25వతేదీ సోమవారం రాత్రి 12.15 గంటలకు చేరుకుంటుంది. 07646 నెం బరు గల సత్రగచ్చి-సికింద్రాబాద్ రైలు ఈ నెల 25వ తేదీ సోమవారం 5.45 గంటలకు బయలుదేరి, మంగళవారం ఉదయం 8.10 గంటలకు చేరుకుం టుంది. మార్గంలో నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుం టూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్డు, భువనేశ్వర్, కటక్, జయపూర్, కియోంజర్ రోడ్డు, భద్రక్ రోడ్డు, బాలసోర్, ఖర్గపూర్ స్టేషన్లలో రైళ్లు ఆగుతాయి.



గణేష్ రోడ్డులో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



కళానగర్‌లో అక్రమ నిర్మాణం



16వ డివిజన్ డొంక రోడ్డులో అక్రమ నిర్మాణం

అనధికార నిర్మాణాలపై కొరడా

రామలింగేశ్వరనగర్, మార్చి 22: అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నవేళ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్మిస్తున్న అనధికార నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ గణేష్ రోడ్డులో అనధికార నిర్మాణాలపై ఫిర్యాదు అందుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని నేలకూల్చారు. స్థానిక బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ ఎన్నికల విధుల్లో ఉండగా ఆయన దృష్టిలో లేకుండా ఈ నిర్మాణాలు కొనసా గుతున్నట్లు తెలిసింది. యథేచ్ఛగా అనధికార నిర్మాణాలు నిర్మిస్తున్నా స్థానిక సచి వాలయ ప్లానింగ్ సెక్రటరీకి తెలియకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పక్కవీధిలోనూ అదనపు నిర్మాణం చేపట్టగా దానిని వాటర్ ట్యాంక్‌గా చెప్పడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

16వ డివిజన్‌లో మరో రెండు అనధికార నిర్మాణాలు

16 డివిజన్‌లో మరో రెండు నిర్మాణాలు నిర్మిస్తున్నారు. కళానగర్ కె.బిల్డింగ్ వీధితో పాటు, డొంక రోడ్డులోనూ అనుమతి లేకుండా అదనపు నిర్మాణాలు చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి దృష్టిలో ఉన్నా వాటిపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శలున్నాయి. అనుమతి లేని నిర్మాణాలు వద్దని టౌన్‌ప్లానింగ్ అధికారి చెప్పినా వాటి వెనుక ఉన్న పార్టీ నాయకులు అధికారి ఆదేశాలను లెక్క చేయకుండా నిర్మించినట్లు సమాచారం. వాటర్ ట్యాంక్‌లంటూ చేపట్టిన అదనపు నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ ప్లానింగ్ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అనధికార నిర్మాణాలు 15, 16 డివిజన్లలో ఎక్కువగా ఉన్నాయి. అక్కడి ప్లానింగ్ సెక్రటరీల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇండియా కూటమికే మా మద్దతు

● బహుజన పార్టీల జేఏసీ స్పష్టీకరణ



ఆంధ్రరత్నభవన్‌లో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసిన బహుజన పార్టీల జేఏసీ కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు

గవర్నర్‌పేట, మార్చి 22: మత తత్వ పార్టీ బీజేపీని ఎదురించే సత్తా ఇండియా కూట వి ఒకి మాత్రమే ఉం దని, రానున్న ఎన్ని కల్లో బహుజన పార్టీలు ఇండియా కూటమికే మద్ద తుగా నిలుస్తాయని బహుజన పార్టీల జేఏసీ కన్వీనర్ జైభీమ్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆంధ్రరత్నభవన్‌లో ఏపీసీసీ చైర్మన్ వైఎస్ షర్మిలను బహుజన పార్టీల నేతలు కలిశారు. రాష్ట్రంలో మతతత్వ బీజేపీని ఓడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆమెకు తెలిపారు. ఇం డియా కూటమిలో పొత్తులో భాగంగా తమకు 39 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలు కేటాయించాలని కోరారు. జేఏసీలో ఉన్న 16 పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో సీట్లు కేటాయించాలని షర్మిల దృష్టికి తీసుకువెళ్లినట్లు నాగేశ్వరరావు తెలిపారు. దీనికి షర్మిల సాను కూలంగా స్పందించారని, కేంద్ర నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. తాము కూడా కేంద్ర స్థాయిలో వివిధ పార్టీల కూటమిగా ఉన్న బహుజన జేఏసీ నాయక త్వంతో చర్చిస్తామని తెలిపారు.

మార్కెట్లో నకిలీ ఎస్-బీడీలు

వన్‌టౌన్, మార్చి 22: నకిలీ ఎస్-బీడీలను తయారుచేసి మార్కెట్లో విక్రయిస్తున్నారని ఎస్-బీడీ మార్కెటింగ్ సేల్స్ సూపర్ వైజర్ అబ్దుల్ లతీఫ్ తెలిపారు. శుక్రవారం రథం సెంటర్ సమీపం లోని ఎస్-బీడీ గోడౌన్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ బ్రాండ్ బీడీలు మార్కెట్లో తక్కువగా ఉండడం తో అనుమానం వచ్చి తనిఖీలు చేశామన్నారు. 60 ఏళ్లుగా ఎస్-బీడీలు ప్రసిద్ధి చెందితే వీటికి డూప్లికేట్ తయారు చేసి విక్రయి స్తున్నారన్నారు. మార్కెట్లో నిర్వహించిన తనిఖీల్లో 200 నకిలీ బీడీల దిండ్లు దొరికాయన్నారు. ఒరిజినల్ బీడీల ధర కట్ట రూ.300 ఉం డగా, నకిలీ బీడీలది రూ.200గా ఉందన్నారు. తెలంగాణాలోని వరం గల్ నుంచి నకిలీ బీడీలు వస్తున్నట్లుగా తమకు సమాచారం ఉంద న్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఆయన కోరారు. ఎస్-బీడీ పంపిణీదారుడు ఓంకార్ ట్రేడర్స్ శ్రీనివాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సి'ఫార్సు' బదిలీలు!

- పశుసంవర్ధకశాఖలో ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు
- 'కోడ్' ముందు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల లేఖలతో పోస్టింగులు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో పశువైద్యుల డిప్యుటేషన్ల వ్యవహారం మూగజీవాలకు సమస్యగా మారింది. కోడ్ వచ్చే ముందు పలువురు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫారసులతో అనేకమంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని వారు కోరుకున్న స్థానాలకు డిప్యుటేషన్లపై పంపారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో డిప్యుటేషన్లపై నియామకాలు భారీగా సాగాయి. పశువైద్యులను డిప్యుటేషన్‌పై హెడ్ ఆఫీసులు, పెద్దగా పని లేని పోస్టుల్లో నియమించడంతో గ్రామాల్లో వెటర్నరీ డిస్పెన్సరీల్లో డాక్టర్లు లేకుండా పోయారు. ఆయా డిస్పెన్సరీల్లో అటెండర్లు, పారా మెడికల్ సిబ్బంది పశువైద్యం చేస్తున్న పరిస్థితి అనేక చోట్ల నెలకుంది. కర్నూలు జిల్లాలో గ్రామీణ డిస్పెన్సరీల నుంచి ముగ్గురు ఏడీలు, ఒక వీఏఎస్‌ను కర్నూలు జేడీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై వేశారు. జేడీ కార్యాలయంలో అవసరం లేకపోయినా.. డిప్యుటేషన్‌పై వేశారని చెప్తున్నారు. ఈవిధంగా రాయలసీమలో చాలామందిని జిల్లా కార్యాలయాల్లో నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా కొందరిని పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్ లోనూ నియమించినట్లు సమాచారం. నేతల సిఫారసులతో ఎవరినైనా డిప్యుటేషన్ వేసినప్పుడు.. వారి స్థానాల్లో మరొకరికి కనీసం ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినా ప్రజలకు సేవలందుతాయి. కానీ ఈ శాఖ ఉన్నతాధికారులు ప్రజలకు అందాల్సిన సేవల గురించి ఆలోచించకుండా, ఏడీలు, వీఏఎస్‌లకు డిప్యుటేషన్లు ఇవ్వడం వల్ల ఆయా డిస్పెన్సరీల్లో పశువులకు వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. పశుపోషకులు పశువుల్ని తీసుకొస్తే.. అటెండర్లు, పారా సిబ్బందే ప్రాథమిక చికిత్సలు చేసి, పంపుతున్నారని అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో కొందరు సంచార పశువైద్య వాహనాలకు ఫోన్ చేసి, పశువైద్య సేవలు పొందుతున్నారు. కానీ చాలా చోట్ల అంబులెన్స్‌ల నిర్వహణ లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఓటమి ఖాయమనే ప్రలోభాలు: ఆచంట సునీత

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఓటమి ఖాయమని అర్థమయ్యే సరికి జగన్ ప్రభుత్వం ఓటర్లను ప్రలోభపెట్టే పనులు చేస్తోందని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు తాయిలాలు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు వైసీపీ అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

కరువు మండలాల్లో తాగునీరు, ఉపాధి: సీఎస్

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యంగా కరువు మండలాల్లో జూన్ నెలాఖరు వరకు తాగునీటి కొరత లేకుండా చూడడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన అమరావతి సచివాలయం నుంచి ఎన్టీఆర్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరుల విపత్తుల నిర్వహణశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి ఎద్దటి గల ఆవాసాలకు ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. దీని పర్యవేక్షణకు వారంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. కరువు మండలాల్లోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులన్నింటినీ సమీప నీటి వనరుల ద్వారా పూర్తిగా నింపాలన్నారు. అవసరమైతే ప్రైవేటు బోర్లను అద్దె ప్రాతిపదికన తీసుకుని నీటి ఎద్దడి గల ఆవాసాలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు.

హోళీ సందర్భంగా ప్రత్యేక రైళ్లు : దక్షిణమధ్య రైల్వే

హైదరాబాద్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): హోళీ పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మార్చి23 నుంచి 27 వరకు ఆయా ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 23న హైదరాబాద్-దనపూర్(07647), సికింద్రాబాద్-సంత్రాగచి(07645), 25న సంత్రాగచి-సికింద్రాబాద్ (07646), మార్చి26న దనపూర్-హైదరాబాద్ (07548) ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 24న సంత్రాగచి-చెన్నైసెంట్రల్(06096), మార్చి27న పాట్నా-కోయంబత్తూర్ (06094) రైళ్లు నడుపుతున్నట్లు తెలియజేశారు.

ఇసుక తవ్వకాలపై నివేదికలివ్వండి

- జిల్లా కలెక్టర్లను కోరిన గనుల శాఖ

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలపై తాజా పరిస్థితిని తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టులో దాఖలైన ఇసుక కేసుకు సంబంధించి రాష్ట్ర సర్కారు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలు, రీచ్‌ల్లో నిల్వలు, బీ2 కేటగిరీ రీచ్‌ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించింది. ఈ మేరకు గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మెమో జారీ చేశారు.

1 నుంచి స్వల్పంగా పెరగనున్న ఔషధాల ధరలు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పారాసిటమాల్, అజిత్రోమైసిన్, పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ సహా నిత్యావసరంగా వాడే కొన్ని ఔషధాల ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. మొత్తం 800 రకాల ఔషధాల ధరలు 0.55 శాతం మేర పెరగనుండగా.. కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. టోకు ధరల సూచిక (డబ్ల్యూపీఐ)లో వార్షిక మార్పుకు అనుగుణంగా ఔషధాల ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసన్షియల్ మెడిసిన్(ఎన్ఎల్ఈఎమ్) జాబితాలోని ఔషధాల ధరలను 0.55 శాతం పెంచేందుకు ఫార్మా సంస్థలకు అనుమతించింది. పారాసిటమాల్, యాంటీ బయాటిక్స్, అజిత్రోమైసిన్, యాంటీ ఎనిమియా మెడిసిన్, విటమిన్స్, మినరల్స్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ తీవ్రంగా జబ్బుపడిన రోగులకు ఇచ్చే ఔషధాలు, స్టెరాయిడ్స్ ధరలు పెరిగే ఔషధాల జాబితాలో ఉన్నాయి.



మన బంధం విశిష్టం

భూటాన్‌లో ప్రధాని మోదీ

థింపు, మార్చి 22: భారత్, భూటాన్ ప్రజల మధ్య ఉన్న అనుబంధం ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను విశిష్టంగా నిలుపుతోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. భూటాన్ ప్రజల హృదయాల్లో భారత్ నిలిచి ఉందన్నారు. భూటాన్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా మోదీ శుక్రవారం ఆ దేశం చేరుకున్నారు. పారో అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన మోదీకి భూటాన్ ప్రధాని షేరింగ్ తోబ్గే స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రాజధాని థింపూ నగరం వరకూ మొత్తం 45 కి.మీ.ల మేర స్థానిక ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిల్చొని ఇరుదేశాల జెండాలు పట్టుకొని మోదీకి స్వాగతం పలికారు. మోదీ ఇటీవల రాసిన ఒక పాటకు భూటాన్ యువతీ యువకులు భారత సంప్రదాయ వస్త్రధారణతో గర్బా నృతం చేశారు. దీనిపై మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'అందమైన భూటాన్‌లోకి నాకు ఆహ్వానం పలికిన భూటాన్ ప్రజలకు ముఖ్యంగా పిల్లలకు కృతజ్ఞతలు' అని పోస్ట్ పెట్టారు. మోదీ పర్యటనపై భూటాన్ ప్రధాని తోబ్గే ఎక్స్‌లో హిందీ పోస్ట్ పెట్టారు. 'భూటాన్‌లోకి పెద్దన్న మోదీకి స్వాగతం' అని పేర్కొన్నారు. 'పొరుగువారికి ప్రథమ ప్రాధాన్యం' విధానంలో భాగంగా మోదీ ఈ పర్యటన చేపట్టారు. వాస్తవానికి ప్రధాని పర్యటన గురు, శుక్రవారాల్లో జరగాల్సి ఉండగా.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఒక రోజు వాయిదా పడింది. మోదీకి భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది డ్రక్ గ్యాల్పో'ను భూటాన్ రాజు జిగ్మే ఖేజర్ నామ్‌గ్యేల్ వాంగ్‌చుక్ అందజేశారు. ఒక విదేశీ ప్రభుత్వాధినేతకు ఈ పురస్కారాన్ని ఇవ్వటం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల విశిష్టతను కొనియాడారు. ప్రధాని పర్యటన సందర్భంగా.. విద్యుత్తు, వాణిజ్యం, డిజిటల్ అనుసంధానం, అంతరిక్షం, వ్యవసాయం తదితర రంగాల్లో ఇరుదేశాల మధ్య పలు అవగాహన ఒప్పందాలను (ఎంఓయూలను) కుదిరాయి.

'సెర్ప్'కు సున్నం

- ఆర్థికంగా కునారిల్లుతున్న గ్రామీణ సంస్థ
- 'సేంద్రియం' పేరిట మరో భారం
- రైతు సాధికార సంస్థకు నిధులివ్వని ప్రభుత్వం
- 10వేలమందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితి
- ఎన్నికల వేళ సెర్ప్‌పై రుద్దేందుకు ఎత్తుగడ
- సెర్ప్‌లోని 'సీఐఎఫ్' నిధులపైనే సర్కారు కన్ను

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అంతంతమాత్రం ఆర్థిక వనరులున్న సెర్ప్ సంస్థపై మరో భారం పడింది. సేంద్రియ వ్యవసాయం అమలు చేస్తామంటూ రైతు సాధికార సంస్థ ఒప్పందం చేసుకోవడంతో తమపై మరో గుదిబండ మోపారంటూ సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ) ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. సీఎం సభలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు విచ్చలవిడిగా సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌ఫండ్) నిధులు ఖర్చు చేయడంతో సెర్ప్ ఆధ్వర్యంలోని వెలుగు కార్యాలయాల నిర్వహణ నిధులు కరిగిపోతున్నాయి. అలాంటిది.. సేంద్రియ వ్యవసాయం పేరిట రైతు సాధికార సంస్థకు చెందిన సుమారు 10 వేలమందికి పైగా కాంట్రాక్టు సిబ్బందిని సర్కారు...సెర్ప్‌లోని తోసేసింది. దీనికోసమే సేంద్రీయ వ్యవసాయ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చారని సెర్ప్ ఉద్యోగులు అంటున్నారు. ఈ ఒప్పందాన్ని సెర్ప్‌తో రైతు సాధికార సంస్థ చేసుకోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. నిజానికి, ఇప్పటికే కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. రైతు సాధికార సంస్థ ఉద్యోగులకు కొన్ని నెలలుగా వేతనాలు కూడా ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం.. ఆ భారాన్నీ సెర్ప్‌పై రుద్దేందుకు ఎన్నికల ముందు ఈ నిర్ణయం తీసుకున్నదని సెర్ప్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సెర్ప్ పరిధిలోని అన్ని మండల సమాఖ్యల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం పేరిట ఎంవోయూ చేసుకున్నారు. సెర్ప్, రైతు సాధికారసంస్థతోపాటు స్త్రీనిధిని కూడా ఒప్పందంలో భాగస్వామిని చేశారు. పేద డ్వాక్రాలకు స్త్రీనిధి (క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్) నుంచి రుణాలు అందిస్తున్నారు. ఒప్పందాన్ని అనుసరించి.. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను స్త్రీనిధి...11 శాతం వడ్డీతో రుణం కింద రైతు సాధికార సంస్థకు ఇస్తుంది. ఆ సంస్థ తమకు నిధులు సమకూరగానే వాటిని స్త్రీనిధికి చెల్లిస్తుంది. ఒకవేళ ఆ సంస్థ చెల్లించని పక్షంలో.. సెర్ప్ పరిధిలోని మండల సమాఖ్యల వద్ద ఉండే సీఐఎఫ్ నిధుల నుంచి స్త్రీనిధి సంస్థ రికవరీ చేసుకుంటుంది. ఇప్పటికే రైతు సాధికార సంస్థకు ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో గత పది నెలల నుంచి సుమారు 10 వేల మందికి జీతాలు ఇవ్వలేకున్నారు. సెర్ప్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారా ఈ సిబ్బందికి వేతనాలు ఇచ్చి ఎలాగైనా ఆ సంస్థను కాపాడుకోవాలన్న యోచనతో సెర్ప్‌లోకి చొరబడ్డారని సెర్ప్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనివల్ల సెర్ప్ ఉనికి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి కొంత కరిగించేస్తే...

చంద్రబాబు తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు వెలుగు పథకం ఉమ్మడి రాష్ట్రంలో అమలుచేశారు. సెర్ప్ పరిధిలోని ప్రతి మండల సమాఖ్యకు అప్పట్లో రూ.60లక్షలు సీఐఎఫ్ కింద జమచేశారు. వెలుగు పథకం నిర్వహణ వ్యయం కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉండేందుకు చేసిన ఏర్పాటు ఇది. మండల సమాఖ్య ఈ నిధులను తమ పరిధిలోని డ్వాక్రా గ్రూపులకు రుణాలుగా అందించి.. వాటిపై ఆ గ్రూపులు ఇచ్చే వడ్డీని మండల వెలుగు ఆఫీసు నిర్వహణకు వాడుకుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇలా ఇచ్చిన సీఐఎఫ్ నిధులు సుమారు రూ.400కోట్ల దాకా ఉన్నాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ ప్రభుత్వం ఆ నిధులపై కన్నేసింది. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఇళ్ల నిర్మించుకునేందుకు సీఐఎఫ్ నిధుల నుంచి రుణాలుఅందించాలని అప్పట్లో వైఎస్ సర్కారు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు డ్వాక్రా సభ్యులకు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ నిధుల నుంచి రుణాలిచ్చారు. ఆ ఇళ్లు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడం, ప్రభుత్వం నుంచి అందే అరకొర నిధులు సరిపోకపోవడంతో ఈ కార్యక్రమం సంపూర్ణం కాలేదు. దీంతో డ్వాక్రా సభ్యులు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయారు. సీఐఎఫ్ నిధులపై అలా మొదటి దెబ్బ పడింది.

కుమారుడి వాడకం మామూలుగా లేదు..

వైఎస్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల కోసం సీఐఎఫ్ నిధులను కరిగించగా, ఇప్పుడు వైసీపీ సర్కారు వచ్చిన తర్వాత వాటి వాడకం విపరీతమైంది. సీఎం జగన్ నవరత్నాల పథకాల అమల్లో భాగంగా బటన్ నొక్కినప్పుడల్లా డ్వాక్రాలను ఆయన సభలకు తరలించాల్సివస్తోంది. ఈ సమయంలో డ్వాక్రా సభ్యులకు ఆహారం, టిఫిన్లు, కూల్‌డ్రింకులు, వాటర్‌బాటిళ్లు తదితర ఖర్చులన్నీ ఈ నిధుల నుంచే ఖర్చు పెడుతున్నారు. దీంతో అప్పట్లో రిజర్వు చేసిన మొత్తం ప్రతి మండల సమాఖ్య వద్ద కూడా సగానికి పైగా కరిగిపోయింది. ఇప్పుడు కొన్ని మండల సమాఖ్యల్లో 40 శాతం సీఐఎఫ్ నిధులు కూడా లేవు. కరోనా సమయంలో సెర్ప్ అధికారులు మాస్కులు తయారుచేసి పంపిణీ చేశారు. కానీ, ప్రభుత్వం ఒక్క పైసా కూడా చెల్లించలేదు. సుమారు రూ.20 కోట్ల దాకా బకాయి ఇప్పటికీ అందించలేదు. సిబ్బందికి భారీగా శానిటైజర్ బాటిల్స్ సరఫరా చేసినా, వాటికీ ప్రభుత్వం నిధులివ్వలేదు. అవన్నీ సీఐఎఫ్ నిధుల నుంచే వాడారు. గ్రామాల్లో డ్వాక్రా గ్రూపుల సహకారంతో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన సమయంలో అక్కడ చేసిన వ్యయం అంతా సీఐఎఫ్ నిధుల నుంచే ఖర్చు చేశారు. ఇలా సెర్ప్ మండల సమాఖ్యల వద్ద ఉన్న సీఐఎఫ్ నిధులను ఏదో ఒక రకంగా కరిగించేశారు.

జగన్ ఏలుబడిలో ఊరూరా డ్రగ్స్

- పల్లెల్లోనూ విచ్చలవిడిగా అమ్మకాలు
- ప్రభుత్వ ప్రమేయం లేకుండా దిగుమతి అసాధ్యం

ఎంపీ రఘురామ



న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఏలుబడిలో రాష్ట్రంలో మాదకద్రవ్యాలు దొరకని గ్రామం లేదని, పల్లెటూర్లలో కూడా విచ్చలవిడిగా లభిస్తున్నాయని ఎంపీ రఘురామ కృష్ణ రాజు ఆరోపించారు. శుక్రవారం, రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మాదకద్రవ్యాల దిగుమతి వ్యవహారంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ప్రమేయం ఉందని జగన్ రోతపత్రిక రాయడం పరిశీలిస్తే దొంగే దొంగ అన్నట్లుగా ఉందని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తితో పొడిచారని డ్రామాలు ఆడినట్లుగా, బాబాయిని హత్య చేసి నారా వారి రక్త చరిత్ర అని రాసినట్లుగానే.. ఇప్పుడు కూడా అడ్డంగా దొరికిపోయిన తర్వాత ఇతరులపై నిందలు వేయాలని చూడడం దారుణమని ఆయన మండిపడ్డారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీలో దగ్గుబాటి పురందేశ్వరి అల్లుడికి వాటా ఉందంటూ.. పురందేశ్వరిని బదనాం చేయాలని చూస్తున్నారని, ఆమె అల్లుడికి ఆ కంపెనీలో రూపాయి విలువ చేసే షేర్ కూడా లేదని తెలిపారు. బ్రెజిల్‌కు అధ్యక్షుడిగా ఎవరో ఎన్నికైతే, వారిని అభినందిస్తూ 2022 అక్టోబరు 31న విజయసాయిరెడ్డి చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందన్నారు. బ్రెజిల్‌లో ఎలాంటి యవ్వారాలూ నడపకపోతే, ఆ దేశ అధ్యక్షుడికి ఎందుకు శుభాకాంక్షలను చెబుతారని నిలదీశారు. ఇంటర్నేషనల్ డ్రగ్ డీల్ కేవలం సాధారణ వ్యక్తులతో సాధ్యం కాదని, ఇందులో ప్రభుత్వ పెద్దల హస్తం ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేశారు. డ్రగ్స్ విలువ రూ. 50 వేల కోట్లు ఉంటుందని, అక్కడ రూ.5వేల కోట్ల దాకా చెల్లించి సరుకు కొనుగోలు చేసి ఉండొచ్చని తెలిపారు. అంత సొమ్ము వెచ్చించే శక్తి సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీకి లేదని, అంత పెట్టుబడి పెట్టగలిగే సామర్థ్యం రాష్ట్రంలో ఎవరికి ఉందో ప్రజలందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు.

యూఎస్‌లో రామ రథ యాత్ర

- మార్చి 25న చికాగోలో ప్రారంభం

వాషింగ్టన్, మార్చి 22: అమెరికాలోని చికాగో నుంచి రామ మందిర్ రథ యాత్ర ప్రారంభానికి సర్వం సిద్ధమయింది. ఈ రథయాత్ర విశేషాలను సోమవారం విశ్వ హిందూపరిషత్ అమెరికా, ప్రధాన కార్యదర్శి అమితాబ్ విట్టల్ మీడియాకు వివరించారు. 'మార్చి 25 చికాగోలో యాత్ర ప్రారంభమవుతుంది. యూఎస్‌లోని 48 రాష్ట్రాల్లోని 851 దేవాలయాలను తాకుతూ 8,000 మైళ్లు ఈ యాత్ర సాగుతుంది. ఈ రథాన్ని టయోటా సియన్నా వ్యాన్‌పై నిర్మించాం. రథంపై రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలు, అయోధ్య నుంచి ప్రత్యేకంగా వచ్చిన ప్రసాదం, అక్షింతలు, కలశం ఉంటాయి. ఏప్రిల్ 23, పవిత్ర హనుమాన్ జయంతి నాడు యాత్ర ఇలినాయిస్‌లో ముగుస్తుంది. అలాగే వీహెచ్‌పీ కెనడా ఆధ్వర్యంలో సాగే రథ యాత్ర ఆదేశంలోని 150 దేవాలయాలను తాకుతూ సాగుతుంది' అని మిట్టల్ తెలిపారు.

మరోసారి బదిలీల కొరడా

- మరికొందరు అధికారులపైనా ఈసీ వేటు
- పంజాబ్, ఒడిసా, బెంగాల్, గుజరాత్‌ల్లోని పలు జిల్లాల అధిపతులకు స్థానచలనం

న్యూఢిల్లీ, మార్చి 22 : ఎన్నికల కోడ్‌ను అమల్లోకి తెచ్చిన జాతీయ ఎన్నికల సంఘం నిబంధనల కొరడాను మరోసారి ఝళిపించింది. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన నాన్ కేడర్ అధికారులను వారున్న స్థానాల నుంచి బదిలీ చేస్తూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ డీజీపీని పక్కనబెట్టిన ఈసీ.. తాజాగా ఆ రాష్ట్రంలోని పలు జిల్లాల అధిపతులకు స్థానచలనం కలిగించింది. అలాగే.. గుజరాత్, పంజాబ్, ఒడిసాల్లోని పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలనూ బదిలీ చేసింది. ఎన్నికల పటిష్ఠ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై మిగతా కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూలతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ జరిపిన సమావేశంలో తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లోని ఛోటా ఉదయ్‌పూర్, అహ్మదాబాద్ రూరల్ జిల్లాల ఎస్పీలను, పంజాబ్‌లోని పఠాన్‌కోట్ సహా నాలుగు జిల్లాల ఎస్ఎస్‌పీలను, ఒడిశాలోని కటక్ సహా మూడు జిల్లాల కలెక్టర్లను, పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ మిడ్నాపూర్, బీర్భూమ్ సహా నాలుగు జిల్లాల అధిపతులను బదిలీ చేశారు. అభ్యర్థులకు బంధువులుగా ఉన్న అధికారులపైనా ఈసీ దృష్టి పెట్టింది. పంజాబ్‌లోని బటిండా ఎస్ఎస్‌పీని, అసోంలోని సోనిట్‌పూర్ ఎస్పీని ఈ కారణాలతో బదిలీ చేసింది. వీరిలో సోనిట్‌పూర్ ఎస్పీ సుశాంత బిశ్వ శర్మ స్వయానా అసోం సీఎం హిమాంత బిశ్వ శర్మకు సోదరుడు. బటిండా ఎస్ఎస్‌పీ హర్మన్‌బీర్ సింగ్ గిల్.. కాంగ్రెస్ ఎంపీ జస్బీర్‌బీర్ సింగ్ గిల్ సోదరుడు.

కవితకు సుప్రీంలో చుక్కెదురు

- ఢిల్లీ మద్యం కేసులో బెయిల్
- ఇవ్వలేమన్న న్యాయస్థానం
- ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో నిరాశే మిగిలింది. ఈడీ అరెస్టు, కస్టడీని సవాలు చేస్తూ కవిత దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో తాము బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ట్రయల్‌కోర్టుకు వెళ్లాలని సూచించింది. సోదాల పేరుతో ఈడీ అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారని, అనంతరం సీబీఐ స్పెషల్ కోర్టు తనను కస్టడీకి అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ కవిత 537 పేజీల పిటిషన్ దాఖలు చేశారు. తనను వెంటనే విడుదల చేసేలా ఈడీని ఆదేశించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కవితను ఈడీ అధికారులు అరెస్టు చేసిన తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విచారణలో భాగంగా కవిత పట్ల ఈడీ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేశాయని తెలిపారు. "ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతుందో చూడాలి. ఇవన్నీ చూసి న్యాయవాదిగా నేనెంతో బాధ పడుతున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. భావోద్వేగానికి గురికావద్దని సిబల్‌కు సూచించారు. కవితకు వ్యతిరేకంగా కేసులో చిన్న సాక్ష్యం కూడా లేదని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈడీ చూపుతున్న సాక్ష్యాలన్నీ అప్రూవర్ల నుంచి సేకరించినవేనని తెలిపారు. గత సెప్టెంబరులో కవితను నిందితురాలిగా చూపని ఈడీ.. ఇప్పుడు అరెస్టు రిపోర్టులో మాత్రం నిందితురాలిగా పేర్కొన్నదని చెప్పారు. మాగుంట శ్రీనివాసులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే కవితను నిందితురాలిగా చూపుతున్నారని.. ఒక్క బలమైన సాక్ష్యం కూడా లేకుండా కవితను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. అయితే.. ప్రస్తుతానికి తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కవితకు బెయిల్ ఇవ్వలేమని తెలిపింది. తొలుత కింది కోర్టును ఆశ్రయించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఆ స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని పేర్కొంది. త్వరితగతిన కేసు విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. కవిత రాజకీయ నాయకురాలైనందున ఆమె పిటిషన్‌ను నేరుగా స్వీకరించలేమని స్పష్టం చేసింది. అలాగే ఈ పిటిషన్‌లో రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలను పొందుపరిచినందున, దీన్ని ఇప్పటికే దాఖలైన విజయ్ మదన్‌లాల్ కేసుకు జత చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. రాజ్యాంగ పరమైన అంశాలపై ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా సమాధానం చెప్పాలని, ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

సుప్రీంకోర్టు సాక్షిగా ఈడీ మాట తప్పింది..

సుప్రీంకోర్టులో హామీ ఇచ్చి కూడా ఈడీ మాట తప్పిందని కవిత తరఫున మరో సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టులో కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను ఆయన ప్రస్తావించారు. సుప్రీంకోర్టు సాక్షిగా కవితను అరెస్టు చేయబోమని ఈడీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో జస్టిస్ బేలా ఎం.త్రివేది స్పందిస్తూ.. కవిత వేసిన ఆ పిటిషన్‌పై ఎలాంటి తాత్కాలిక ఉపశమనం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 19న ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అభ్యంతరం ఎందుకు వ్యక్తం చేయలేదని ప్రశ్నించారు. పిటిషన్‌ను ఉపసంహరించుకొని, ఇప్పుడు మళ్లీ ఆ ప్రస్తావన తేవడం సరికాదని తెలిపారు.

ఆప్ ఆందోళనల పర్వం

లిక్కర్ స్కాంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన నేపథ్యంలో ఆప్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ (డీడీయూ)లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ముందు నిరసన తెలిపాయి. దీంతో పోలీసులు భద్రతా చర్యలను చేపట్టారు. డీడీయూ మార్గ్‌లో సెక్షన్ 144ను విధించారు. నిరసన తెలిపిన మంత్రులు సౌరభ్ భరద్వాజ్, ఆతిషిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆప్ నిరసనలతో పోలీసులు ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు. భద్రతా కారణాల రీత్యా బీజేపీ కేంద్ర కార్యాలయానికి దగ్గరలో ఉన్న ఐటీఓ మెట్రో స్టేషన్, ప్రధాని మోదీ నివాసానికి దగ్గరలో ఉన్న లోక్ కళ్యాణ్ మార్గ్‌ను మూసివేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ మూసి ఉంచుతామని డీఎంఆర్‌సీ (ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్) ట్విటర్‌లో పేర్కొంది.

ఒడిశాలో కుదరని పొత్తు.. బీజేపీ,బీజేడీ ఒంటరి పోరు

భువనేశ్వర్, మార్చి 22: ఒడిసా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయాలని బీజేపీ నిర్ణయించింది. సీఎం నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బీజేడీతో గత మూడు వారాలుగా జరిపిన చర్చలు విఫలమవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 21 లోక్‌సభ, 147 శాసనసభ స్థానాల్లో సొంతగా బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ శుక్రవారం 'ఎక్స్'లో వెల్లడించారు. అన్ని ఎంపీ, అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు చేరడం లేదన్నారు. వాటి ప్రయోజనాలకు వారికి అందడం లేదని చెప్పారు. సమాల్ ప్రకటన దరిమిలా.. అటు బీజేడీ కూడా అన్ని స్థానాల్లో ఒంటరిగానే బరిలోకి దిగనున్నట్లు ప్రకటించింది. ఈ దఫా నాలుగింట మూడో వంతు సీట్లు సాధిస్తామని ఆ పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్‌ప్రకాశ్ దాస్ 'ఎక్స్'లో తెలిపారు.

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకం

న్యూఢిల్లీ, మార్చి 22: ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు దాన్ని కొట్టివేసింది. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని తెలిపింది. ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్-2004ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఆ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు చెందిన న్యాయమూర్తులు జస్టిస్ వివేక్ చౌధరి, జస్టిస్ సుభాష్ విద్యార్థిలు శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు. ఈ తీర్పు ప్రకారం మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న మదర్సాలకు ప్రభుత్వ గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయం నిలిచిపోనుంది. చివరకు ఆ ఇస్లామిక్ విద్యాసంస్థలన్నీ మూతపడనున్నాయి. దాంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటును సవాలు చేస్తూ అన్షుమన్ సింగ్ రాథోడ్ ఈ పిటిషన్ వేశారు.

హైతీలో అరాచకం

- భారతీయుల రక్షణకు 'ఆపరేషన్ ఇంద్రావతి'

న్యూఢిల్లీ, మార్చి 22: కరేబియన్ దీవుల సముదాయంలోని హైతీ దేశంలో సాయుధ గ్యాంగ్‌లు వీధి పోరాటాలకు దిగడంతో ఆరాచకం రాజ్యమేలుతోంది. ప్రభుత్వం అదృశ్యం కావడంతో అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉంటున్న భారతీయులను కాపాడేందుకు 'ఆపరేషన్ ఇంద్రావతి'ని నిర్వహిస్తున్నట్టు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ వెల్లడించారు. గురువారం 12 మందిని సమీపంలోని డొమినిక్ రిపబ్లిక్ దేశానికి సురక్షితంగా తరలించినట్టు తెలిపారు. హైతీలోని పరిస్థితిపై భారత ప్రభుత్వం ముందునుంచే ఓ కన్నేసి ఉంచింది. అవసరమైతే అక్కడి భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని 15న జరిగిన వీక్లీ ప్రెస్ మీట్‌లో విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పడం గమనార్హం. అమెరికా ప్రభుత్వం కూడా తమ రాయబార కార్యాలయంలోని అంత అత్యవసరమైన పోస్టుల్లో లేని ఉద్యోగులను వాయు మార్గంలో తరలించింది. హైతీలో గ్యాంగ్ వార్‌లు ముదరడంతో ఇప్పటికే ఎమర్జెన్సీని విధించారు. దేశం బయట ప్రధాని ఏరియల్ హెన్రీ చిక్కుకుపోవడంతో ఆయన 12న రాజీనామా చేశారు. అప్పటి నుంచి దేశం అల్లకల్లోలమయింది. సాయుధ గ్యాంగ్‌లు విమానాశ్రయాలు, పోలీసుస్టేషన్లు, జైళ్లపై దాడులు చేస్తున్నాయి. వేలాది మంది ఖైదీలు జైళ్ల నుంచి తప్పించుకొని పారిపోయారు.

మాస్కోలో మారణహోమం

- 40 మంది మృతి, 100 మందికిపైగా గాయాలు
- సంగీత కార్యక్రమంపై ఉగ్రదాడి
- జనం మీద కాల్పులు జరిపిన దుండగులు
- బాంబులు విసరటంతో హాలు అంతా మంటలు

న్యూఢిల్లీ, మార్చి 22: రష్యా రాజధాని మాస్కోలో మారణహోమం సంభవించింది. భారీ ఎత్తున జరుగుతున్న ఓ సంగీత కార్యక్రమంలోకి ఆయుధాలతో, బాంబులతో ప్రవేశించిన దుండగులు విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డారు. బాంబులు విసిరారు. ఈ దారుణ ఘటనలో దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లు, 100 మందికిపైగా గాయాల పాలైనట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్యపై అధికారికంగా ప్రకటన వెలువడలేదు. అయితే, జరిగిన ఘటనను ఉగ్రవాద దాడిగా రష్యా విదేశాంగశాఖ ప్రకటించింది. మాస్కోకు ఉత్తరాన ఉన్న క్రోకస్ సిటీ హాల్‌లో శుక్రవారం సంగీత కార్యక్రమం ఏర్పాటైంది. దీనికి భారీ ఎత్తున జనం హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా అకస్మాత్తుగా దుండగులు ఆటోమేటిక్ ఆయుధాలతో ప్రవేశించి కాల్పులకు తెగబడ్డారు. హాలులో బాంబులు విసరటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఆకస్మిక దాడి నుంచి రక్షించుకోవటానికి జనం పరుగులు తీశారు. ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మారణహోమానికి పాల్పడిన వారెవరన్నది వెల్లడి కాలేదు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన తాలూకు వార్తలు వెలువడ్డాయి. పూర్తి వివరాలు అందుబాటులోకి రాలేదు.

బాబు, పవన్ ఫోన్‌ల ట్యాపింగ్..!

- పెగాసెస్ వాడుతున్నారు: సీఈఓకు వర్ల రామయ్య ఫిర్యాదు

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారు. కొందరు ఐపీఎస్‌లు ఈ తరహా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఈ మేరకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'తాడేపల్లి ఆదేశాలు పాటిస్తూ డబ్బు, లిక్కర్‌ను ట్రాన్స్‌పోర్టు చేస్తున్న రిష్యంత్ రెడ్డి, తప్పుడు కేసులు పెట్టి టీడీపీ, జనసేన నాయకులను ఇబ్బందిపెడుతున్న కొల్లి రఘురామిరెడ్డి, ఫోన్లు ట్యాపింగ్‌లు చేస్తున్న అడిషనల్ ఎస్పీ కేడర్‌లోని ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలి. టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫోన్లను పెగాసెస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ట్యాప్ చేస్తున్నారు. వారిని వెంటనే విధుల నుంచి తప్పించి సీబీఐతో విచారణ జరిపించాలి. అధికార పార్టీకి తొత్తులైన కొంత మంది పోలీసు అధికారులు టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారు. టీడీపీ నేతలపై ఏఏ స్టేషన్లలో కేసులో పెట్టారో కూడా మా నాయకులకు సమాచారం అందజేయలేదు. రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో టీడీపీ నేతలపై నమోదైన కేసుల వివరాలను ఇవ్వాలని డీజీపీని కోరాం. డీజీపీ ఆదేశాల మేరకు కేసుల వివరాలను అన్ని జిల్లాల ఎస్పీలను కోరినా ఇప్పటికీ ఎస్పీల నుంచి సమాచారం రాలేదు. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలపై పెట్టిన క్రిమినల్ కేసుల వివరాలు తెలియజేయాలని డీజీపీని ఆదేశించాలని సీఈవోకి ఫిర్యాదు చేశాం. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే అవినీతి తగ్గాలి. కానీ వైసీపీ ప్రజా ప్రతినిధులు దానిని ఉల్లంఘించి అక్రమాలు చేస్తున్నారు. అధికారులు తమకు తాము తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రిటర్నింగ్ అధికారికి ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇదే విషయాన్ని సీఈవోకి ఫిర్యాదు చేశాం' అని వర్ల వివరించారు.

'అన్నమయ్య' డ్వామా పీడీని బదిలీ చేయండి

అన్నమయ్య జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎంసీ మద్దిలేటిని కడప, అన్నమయ్య జిల్లాల నుంచి బదిలీ చేయాలని వర్ల రామయ్య కోరారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. 'మద్దిలేటి 25 సంవత్సరాలుగా ఆయన సొంత జిల్లా కడప, అన్నమయ్య జిల్లాల్లోనే పని చేస్తున్నారు. సొంత జిల్లా వాసి కావడంతో డ్వామా అధికారులపై ఏపీవో, టీఏ, ఎఫ్ఏలను ఉపాధి హామీ లబ్ధిదారులను ప్రభావితం చేస్తూ వైసీపీకి ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా నెల్లూరు జిల్లా పంచాయతీరాజ్ అధికారి, డ్వామా ఏపీడీ ధనలక్ష్మీ అధికార పార్టీ అండతో తన సొంత జిల్లా కడపకు డీపీవోగా పోస్టింగ్ వేయించుకున్నారు. ఈమె అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరించి ఓటర్లను ప్రభావితం చేయడానికే తన సొంత జిల్లాకు బదిలీ చేయించుకున్నారు. సొంత జిల్లాల్లో పని చేస్తున్న మద్దిలేటిని, ధనలక్ష్మీలను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేయాలి' అని వర్ల కోరారు.



వచ్చే నెలలో కొత్త ఐపాడ్స్

యాపిల్ కొత్తగా ఐపాడ్ ఎయిర్, ఐపాడ్ ప్రొ మోడల్స్‌ను ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేయవచ్చని చెబుతున్నారు. ఐపాడ్ ఓఎస్ 17.4 సాఫ్ట్‌వేర్‌కు తోడు పలు అప్‌గ్రేడ్స్ ఉంటాయని భావిస్తున్నారు. ఈ మోడల్స్‌లో కెమెరా విభాగంలో కొన్ని మార్పులు ఉండనున్నాయి. టాబ్లెట్స్‌పై ఫ్రంట్, రేర్ కెమెరాలు ఉంటాయి. ల్యాండ్‌స్కేప్ ఓరియెంటెడ్ ఫ్రంట్ కెమెరా ఉండనుంది. ఇది ఆరో జనరేషన్‌కు చెందినవని ధ్రువపరుస్తూ కూడా వార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పాడ్స్‌లో ఫ్రంట్ ఫేస్ కెమెరా పోర్ట్రయిట్ మోడల్. అయితే ఇందులో ఇప్పుడు మార్పు చోటుచేసుకోనుంది. ఐపాడ్ ప్రొ, ఐపాడ్ ఎయిర్ మోడల్స్‌లో ల్యాండ్‌స్కేప్ ఫ్రంట్ కెమెరా ఉండనుంది.

50ఎంపీ కెమెరాతో వివో టీ3

వివో టీ సిరీస్‌ను విస్తరిస్తోంది. తాజాగా 'వివో టీ3 5జీ' ఫోన్‌ని ఇండియన్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. అమోల్డ్ డిస్‌ప్లేకు తోడు మీడియాటెక్ డైమెన్సిటీ 7200 చిప్‌సెట్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 44 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి. 6.67 ఇంచీల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, 1080 x 2400 పిక్సెల్ రిజల్యూషన్, 1800 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. 128 జీబీ, 256 జీబీ వేరియంట్లను విడుదల చేస్తున్న వివో వీటికి ఒక టీబీ మైక్రోఎస్‌డీతో ఎక్స్‌పాండ్ చేసుకునే వీలు కల్పించింది. ఆండ్రాయిడ్ 14పై పనిచేస్తుంది. ఐపీ54 రేటింగ్ ఇచ్చారు. అంటే డస్ట్, వాటర్ రెసిస్టెంట్ అని చెప్పవచ్చు. కాస్మిక్ బ్లూ, క్రిస్టల్ ఫ్లేక్ రంగుల్లో ఇది లభ్యమవుతుంది. 8జీబీ, 128జీబీ వేరియంట్ ధర రూ.19,999 కాగా 8జీబీ, 256 జీబీ వేరియంట్ ధర రూ.21,999. వివో ఇండియా ఈ స్టోర్స్‌కు తోడు ఫ్లిప్‌కార్ట్ ద్వారా మార్చి 27 నుంచి పొందవచ్చు.



ఏఐ సాంకేతికతతో వరదలపై అంచనా



ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) మరికొన్ని కొత్త రంగాలకు విస్తరిస్తోంది. ముందస్తుగా రోగ నిర్ధారణలో ఏఐ ఇప్పుడు ముందుంది. తాజాగా ఇండియాలో వరదలను ముందుగా తెలుసుకునే వ్యవహారంలో నిమగ్నమైంది. 'నేచర్'లో ప్రచురించిన ఒక రీసెర్చ్ పేపర్‌లో ఈ విషయం వెల్లడైంది. ఇందులో భాగంగా మెషీన్ లెర్నింగ్ ఉపయోగించి హైడ్రలాజికల్ సిమ్యులేషన్ మోడల్స్‌ని రూపొందించారు. వాటిని బేసిన్స్‌కు పంపి సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది. అయితే గ్లోబల్ ఫ్లడ్ అవేర్‌నెస్ సిస్టమ్ నాలుగో వెర్షన్‌తో యురోపియన్ సెంటర్ ప్రస్తుతం మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్ట్ చేస్తోంది. ఆ మోడల్స్‌ను మరింత అభివృద్ధిపర్చిన ఈ రీసెర్చర్లు పక్కాగా తెలుసుకునే యత్నం చేశారు. ఎక్కువగా, మరింత ప్రభావపూరిత ఈవెంట్స్‌ను కవర్ చేసే ప్రయత్నం చేశారు. వాతావరణ మార్పులపై జరుగుతున్న పరిశోధనలో భాగంగా ఈ రీసెర్చ్‌ని చేపట్టారు. లాంగ్ షార్ట్ - టర్మ్ మెమరీ నెట్‌వర్క్‌లను ఉపయోగించి రూపొందించిన ఏఐ మోడల్ రోజువారి స్ట్రీమ్ ఫ్లోని అంచనా వేసింది. మొత్తమ్మీద ఈ ఫ్లడ్ హబ్ సిస్టమ్ వరదలను ఏడు రోజుల ముందు గుర్తించగలుగుతుంది. పైపెచ్చు 80 దేశాల్లోని నదులను కవర్ చేస్తుంది.

స్మార్ట్‌ఫోన్ స్థానే 'ఏఐ పిన్'!

చాలా కాలంగా ఎదురుచూస్తున్న హూమేన్ - ఏఐ పిన్ ఈ నెలాఖరులో మార్కెట్లోకి రానుంది. స్మార్ట్ ఫోన్ చేసే చాలా పనులను ఇది కూడా చక్కబెడుతుంది. స్మార్ట్‌ఫోన్ స్థానాన్ని ఈ ఏఐ పిన్ ఆక్రమిస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ డివైజ్‌ని గత ఏడాది జూలైలోనే ప్రకటించారు. ఇప్పుడు అంటే ఏప్రిల్ 11న మార్కెట్లోకి వస్తోంది. ఇవాళ దీన్ని కొనుక్కుంటే మే మొదటి వారం డెలివరీ కానుంది. ఏఐ పిన్ నిజానికి చాలా చిన్న డివైజ్. దుస్తులకు లేదా యాక్సెసరీలకు దీన్ని క్లిప్‌గా పెట్టుకోవచ్చు. వాయిస్, సంజ్ఞ, టచ్ ఇన్‌పుట్స్ సమ్మిళితం ఈ డివైజ్. వెబ్‌సెర్చ్‌కు తోడు నేవిగేషన్, ట్రాన్స్‌లేషన్, ఫోన్ కాల్స్, టెక్ట్స్ మెసేజ్‌లను పంపడం - అందుకోవడం వంటి పనులన్నీ నిర్వర్తిస్తుంది. స్క్రీన్‌కు బదులు సమాచారం అరచేతిలో ఇమడటం దీని విశిష్టత. కీలకమైన ఫీచర్ల విషయానికి వస్తే...




- డైనమిక్ యూఐతో లేఔట్ బాగుంటుంది. స్టాక్ ధరలు, క్రీడల స్కోరులు వంటివి చూసుకోవడం చాలా సులువుగా, అర్థవంతంగా ఉంటుంది. సమాచారం అరచేతిలో ఇముడుతుంది.
- కాల్స్ చేసుకోవడానికి, టెక్ట్స్ పంపుకోవడానికి వీలుగా ఉంటుంది. వాయిస్ కమాండ్ నుంచి మెసేజ్ డిక్టేషన్ వరకు యూజర్లు సులువుగా ఉండాలని కోరుకుంటారు. అది ఈ డివైజ్‌లో సాధ్యమవుతుంది.
- ఫొటోలు తీసుకోవచ్చు. వీడియోల రికార్డింగ్ వీలుపడుతుంది. వాయిస్ కమాండ్స్‌తో నేపథ్య సంగీతాన్ని కంట్రోల్ చేసుకోవచ్చు. వేలితో టాప్ చేయడం ద్వారా పిక్చర్లను క్లిక్ చేయవచ్చు. వీడియో కూడా సాధ్యమవుతుంది.
- సమాచారం వెతుకులాట అంటే వెబ్ సెర్చ్ బాగుంటుంది. సమాచారాన్ని వెతకడం నుంచి, సమ్మరైజ్, అర్థమయ్యే విధంగా అందించడం వరకూ అన్నీ చేసుకోవచ్చు.
- రియల్ టైమ్ ట్రాన్స్‌లేషన్ విషయంలో 50 వరకు భాషలకు సపోర్ట్ ఇస్తోంది.
- ఇతర యాప్స్, సాఫ్ట్‌వేర్‌తో కూడా ఇది పనిచేస్తుంది. ఆఫ్టర్ ఎఫెక్ట్స్‌తో సమాచారం, పనిచేస్తున్నప్పుడు గైడెన్స్ ఇస్తుంది. ఇతర ల్యాప్‌ట్యాప్‌లతోనూ ఇది పనిచేస్తుంది.
- ఇమేజ్ రికగ్నిషన్ మరో అంశం. ఇమేజ్ సమాచారం, విశ్లేషణ అలాగే ఇమేజ్ ఆరిజన్, రకం తదితర వివరాలను కూడా ఇస్తుంది.
- వివిధ యాప్స్, సర్వీసులు నుంచి అందే నోటిఫికేషన్స్‌ను సమ్మరైజ్ చేస్తుంది. వేర్వేరు యాప్స్ అవసరం లేకుండానే ఇన్‌స్టాంట్‌గా వాటిని చెక్‌చేసుకునే వీలు కూడా ఉంది.

ఈ టూల్‌తో పీడీఎఫ్ వాడడం మరింత సులువు



పీడీఎఫ్ డాక్యుమెంట్ల విషయంలో తలెత్తే ఇబ్బందులకు చెక్ పెట్టేదే హైపీడీఎఫ్ టూల్. సుదీర్ఘంగా ఉండే డాక్యుమెంట్లను చదవలేక ఇబ్బంది పడాల్సిన పని ఇక ఉండదు. ఏఐ అసిస్టెంట్‌తో మాట్లాడి నిమిషాల్లోనే ఆ డాక్యుమెంట్‌లో ఉన్నది తెలుసుకోవచ్చు. ఏఐ సమ్మరీలు, రీరైట్ చేసిన పేరాగ్రాఫ్‌లు, ఏఐ జనరేటెడ్ కంటెంట్ సహా పలు పనులను ఈ టూల్‌తో చక్కబెట్టుకోవచ్చు. ఇదో ఆన్‌లైన్ పీడీఎఫ్ ఎడిటర్. పలు టాస్క్‌లను ఇది సరళతరం చేస్తుంది. వేర్వేరు ఫార్మాట్లలోకి ఆర్గనైజ్ చేసుకోవచ్చు. ముఖ్యమైన విషయాన్ని సంగ్రహించి చెప్పడంతో సమయం ఆదా అవడమే కాదు, ప్రొడక్టివిటీ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రధానంగా



- హైపీడీఎఫ్‌కు చెందిన ఏఐ అసిస్టెంట్ సహకారంతో డాక్యుమెంట్స్ నుంచి ఆర్టికల్స్, పీడీఎఫ్‌ల వరకు అన్నింటితో చాట్‌కు వీలు ఉంటుంది. యూజర్లు ప్రశ్నించి ఆన్సర్లను జనరేట్ చేసుకోవచ్చు.
- సింపుల్ ప్రాంప్ట్‌తో డాక్యుమెంట్లను వేర్వేరు విధాలు- వర్డ్, పీపీటీ, ఎక్సెల్, జేపీజీగా మారుస్తుంది.
- రాతపూర్వకంగా ఉన్న డాక్యుమెంట్‌లో ఏమి ఉన్నది తెలుసుకునేందుకు సహకరిస్తుంది. టెర్మ్స్, కాన్సెప్ట్‌లను తెలుసుకునే వీలు ఉంటుంది.
- పీడీఎఫ్ డాక్యుమెంట్లను ఎడిట్ చేస్తుంది. ఎడిటింగ్ ఆప్షన్స్‌తో ఇమేజెస్, షేప్స్, రీరైటింగ్, పేరాఫ్రేజ్‌లకు అవకాశం ఉంటుంది.
- క్రాప్, కంప్రెస్, మెర్జ్, రొటేట్ పేజెస్, కాంప్లెక్స్ ఎడిటింగ్ వరకు అన్నీ సాధ్యమవుతాయి. అలా ఆ డాక్యుమెంట్స్‌ను షేర్ చేసుకోవచ్చు. ఈమెయిల్, క్యూఆర్ కోడ్స్, లింక్స్ రూపంలో పంపుకోవచ్చు.



మరిన్ని భాషల్లో 'సిరి'

'సిరి' సామర్థ్యం మరిన్ని భాషల్లో అందనుంది. అందుకుగాను ఐఓఎస్ 17.4 అప్డేట్ రానుందని సమాచారం. ఇంతవరకు డివైజ్‌లో ఉన్న ప్రైమరీ భాషలోనే సిరి చదవగలిగేది. ఈ అప్డేట్‌తో ఒకటికి మించి భాషల్లో సిరి చదవగలుగుతుంది. వేర్వేరు భాషల్లో మెసేజ్‌ని తెలియజేయాలని భావించే వ్యక్తులకు ఈ ఫీచర్ బాగా అవసరం. అందుకోసం...

- ఐఫోన్‌లోని సెట్టింగ్స్ మెనూలో సిరి అండ్ సెర్చ్ కోసం నేవిగేట్ చేయాలి.
- ఆస్క్ సిరి విభాగంలో మెసేజింగ్ విత్ సిరిని సెలెక్ట్ చేసుకోవాలి.
- రీడ్ మెసేజెస్ విభాగంలో యాడ్ లాంగ్వేజ్‌ని టాప్ చేయాలి.
- అక్కడ అదనపు భాషలనూ ఎంచుకోవాలి.

ఇక్కడ వేర్వేరు భాషలను యాడ్ చేసుకోవాలి. అలాగే మరిన్ని భాషలను కలుపుకోవాలని అనుకున్నప్పుడు చివరి రెండు స్టెప్స్‌ను రిపీట్ చేస్తుండాలి. మొత్తమ్మీద ఈ సదుపాయంతో భిన్న భాషలు తెలిసిన వ్యక్తులతో కమ్యూనికేషన్ సులువు అవుతుంది.

వాట్సాప్ అప్డేట్స్!

స్టేటస్‌లో నిమిషం వీడియోలు

వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను యూజర్లకు చేరువ చేస్తూ ఉంటుంది. ఆ క్రమంలో కొన్ని టెస్టింగ్ దశలో ఉంటాయి. అందులో ప్రధానమైనది అరవై సెకెండ్లు అంటే ఒక్క నిమిషం స్టేటస్ అప్డేట్. ఇప్పటి వరకు ఇది ముప్ఫై సెకెండ్లుగా ఉంది. ఎక్కువ నిడివి గల వీడియోలను స్టాటస్‌గా అప్డేట్ చేసే అవకాశం దీంతో కలుగుతుంది. దీనితోపాటు యూపీఐ పేమెంట్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కానర్ షార్ట్ కట్ వంటివి ఈ వరుసలో ఉన్నాయి. ఆండ్రాయిడ్‌కు ఉద్దేశించిన వాట్సాప్ బేటాలో స్టాటస్ అప్డేట్‌ను కనుగొన్నారు. ఇదే జరిగితే వీడియో నిడివి ముప్పయ్ సెకెండ్ల నుంచి అరవై సెకండ్లకు పెరుగుతుంది. అయితే దీనికోసం లేటెస్ట్ వెర్షన్‌ను అటు యూజర్లు ఇటు వీక్షకులు యాక్సెస్ చేసుకోవాలి. త్వరలోనే ఇది బేటా టెస్టర్ల చేతికి రానుంది. మరొకటి యూపీఐ పేమెంట్స్ కొద్దిపాటి టాప్స్‌తోనే సాధ్యమయ్యేలా చేస్తోంది. త్రీడాట్ మెనూకు బదులు పేమెంట్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ పేమెంట్ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసుకోవాలి. ఇది కెమెరాకు ఎడమవైపు ఉంటుంది. అలాగే స్క్రీన్ రైట్‌కార్నర్‌లో షార్ట్‌కట్స్ కనిపిస్తుంది. తద్వారా పేమెంట్స్‌ను సునాయసంగా కానిచ్చేయవచ్చు.



వాయిస్ నుంచి టెక్ట్స్ ట్రాన్స్‌క్రిప్షన్

ఆండ్రాయిడ్ యూజర్లకు మరో వెసులుబాటు. అదే వాయిస్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫీచర్. మాట్లాడిన మాటలను పదాలుగా మారుస్తుంది. ఐఫోన్ వాట్సాప్ వినియోగదారులకు ఈ వెసులుబాటు ఏడాది క్రితమే లభించింది. తాజాగా ఆండ్రాయిడ్ యూజర్లకూ అందనుంది. అసలీ సదుపాయాన్ని వాట్సాప్ కల్పిస్తోందని 'దఎస్పీ ఆండ్రాయిడ్' మొదట కనుగొంది. ఈ ఫీచర్ ఇంకా డెవలప్‌మెంట్ దశలోనే ఉందని కూడా తెలిపింది.



ఐఫోన్ 17లో సాంకేతిక మార్పులు!

ఐఫోన్ 17లో సాంకేతికపరంగా మార్పులు ఉంటాయని టిప్‌స్టర్ సమాచారం. వచ్చే ఏడాది ఐఫోన్ 17 విడుదల కానుందన్న పుకార్లు వినవస్తున్నాయి. గత మోడల్స్‌తో పోల్చుకుంటే రెండు ఇంప్రూమెంట్స్ ఉంటాయని అంటున్నారు. చైనీస్ మైక్రోబ్లాగింగ్ సర్వీస్ 'వైబో' ప్రకారం రాబోయే ఈ స్మార్ట్ ఫోన్‌లో లెస్ రిఫ్లక్టివ్ స్క్రీన్ ఉంటుంది. స్క్రాచ్ (గీత, పగులు) రెసిస్టెంట్‌గానూ ఉండనుంది. శాంసంగ్ ఇటీవలి విడుదల చేసిన గెలాక్సీ ఎస్24 అల్ట్రా మాదిరిగా అంటే కార్నింగ్ గొరెల్లా గ్లాస్ ఆర్మర్ స్క్రీన్‌లా ఇది పనిచేయనుంది. సూపర్-హార్డ్ ఏఆర్ లేయర్ - సూపర్ హార్డ్‌తో ఐఫోన్ 17 రూపొందుతుందని చెబుతున్నారు. ఏతావతా రిఫ్లక్షన్‌కు తోడు స్క్రాచ్ విషయంలో మరింత మెరుగుపరిచే పనిలో ఐఫోన్ ఉంది.

లెనోవా గేమింగ్ ల్యాప్‌టాప్స్‌కు హంగులు

సరికొత్త హంగులతో లెనోవా ల్యాప్‌టాప్స్ ముందుకు వస్తున్నాయి. ఈ సిరీస్‌లో నాలుగు ల్యాప్‌టాప్స్ విడుదల అవుతున్నాయి. లెనోవాకు చెందిన రిఫ్రెష్డ్ లెజియన్ గేమింగ్ ల్యాప్‌టాప్‌లు పదహారు ఇంచీల ప్యూర్‌సైట్ డిస్‌ప్లేకు తోడు 240 హెచ్‌జెడ్ వేరియబుల్ రిఫ్రెష్ రేటు, 500 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉన్నాయి. 11ప్రొ విండోస్‌పై రన్ అవుతాయి. 14 జనరేషన్ ఇంటెల్ కోర్ ఐ9-14900హెచ్‌ఎక్స్ సీపీయు, ఎల్ఏ1 ఏఐ చిప్, 32జీబీ ర్యామ్ ఉన్నాయి. రెండు టీబీ ఎస్ఎస్‌డీ స్టోరేజీ ఉంది. వైఫై-ఎఫ్ఐ 6ఈ, బ్లూటూత్ 5.1, నాలుగు యూఎస్‌బీ ఆడియో జాక్ తదితరాలు ఉన్నాయి. రెండు స్పీకర్లతో ఫుల్ హెచ్‌డి కెమెరా సపోర్ట్ ఉంది. రెండున్నర నుంచి 2.8 కేజీల బరువు కలిగి ఉన్నాయి. లెనోవా లెజియన్ 5ఐ ధర ఇండియాలో రూ.1,29,990. ప్రొ రూ.1,57,990తో ఆరంభమవుతోంది. 7ఐ రూ.1.77,990 కాగా ప్రొ 7ఐ రూ.3,24,990. కస్టమైజ్డ్ కాన్ఫిగరేషన్‌కూ అవకాశం ఉంది. అయితే ఎంపిక చేసిన పట్టణాల్లోనే అవి లభ్యమవుతాయి. వెబ్‌సైట్‌లో ఈ పట్టణాల వివరాలను తెలుసుకోవచ్చు.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 23 మార్చి 2024

ఎన్.జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఏఎన్‌జీఆర్ఏయూ) ఆధ్వర్యంలోని ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ - ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). వీటిని తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. కోర్సులు ఏప్రిల్ నెలలో ప్రారంభమౌతాయి. కోర్సులో భాగంగా వారానికి ఒకటి చొప్పున ఏడు ఆన్‌లైన్ క్లాసెస్ ఉంటాయి. క్లాస్ వ్యవధి రెండు గంటలు. ప్రతి క్లాస్‌లో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు ఉంటాయి. అటెండెన్స్ తప్పనిసరి. కోర్సుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇస్తారు. చివరి వారంలో ఎగ్జామ్ ఉంటుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫెయిల్ అయినవారికి/హాజరు కానివారికి నెలలోపు మరల పరీక్ష ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీ/మనియార్డర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

కోర్సులు
- సేంద్రీయ వ్యవసాయం
- పుట్టగొడుగుల పెంపకం

అర్హత: తెలుగులో చదవడం, రాయడం తెలిసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులకు కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్, ఆన్‌లైన్ సదుపాయం ఉండాలి.
- **కోర్సు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **చిరునామా:** ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్, డీన్ కార్యాలయం, పరిపాలనా భవనం, ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

టీఎస్ ఎల్‌పీసెట్ నోటిఫికేషన్



హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (ఎస్‌బీటీఈటీ)- 'లేటరల్ ఎంట్రీ ఇన్‌టూ పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో రెండో ఏడాది ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లు సహా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీల ఆధ్వర్యంలోని సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎల్‌పీసెట్ ద్వారా డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సంబంధిత విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. లేదంటే నిర్దేశిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ అడ్మిషన్ తీసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణతతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్(డీఈటీ) అందించే బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

- ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-సివిల్) పూర్తిచేసినవారు డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) కోర్సుకు; ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్/మెషినిస్ట్ కంపోజిట్, మెషినిస్ట్ గ్రైండర్, టర్నర్, మోటార్ వెహికిల్ మెకానిక్, మెకానిక్-ఆర్ అండ్ ఏసీ) అభ్యర్థులు డిప్లొమా(మెకానికల్/ఆటొమొబైల్/మెటలర్జికల్/ప్యాకింగ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ/మైనింగ్) కోర్సులకు; ఐటీఐ(ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్) అభ్యర్థులు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)కోర్సులకు; ఐటీఐ(ఐసీటీ అండ్ సిస్టమ్ మెయింటెనెన్స్) అభ్యర్థులు డిప్లొమా(కంప్యూటర్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) కోర్సులకు అర్హులు.

ఎల్‌పీ సెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీని జతచేసి మాసబ్ ట్యాంక్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉండే తేదీ:** ఏప్రిల్ 16 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎల్‌పీసెట్ 2024 తేదీ:** మే 20
- **పరీక్ష కేంద్రం:** గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** sbtet.telangana.gov.in

మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా, డిగ్రీ



పుణెలోని తొలాని మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎంఐ)- డిగ్రీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్, బీఎస్సీ నాటికల్ సైన్స్, డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఎంయూ సెట్ 2024 అర్హత తప్పనిసరి. అలాగే సంస్థ నిర్వహించే సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (టీఎంఐఎస్ఏటీ) 2024 కూడా రాయాల్సి ఉంటుంది. డిప్లొమాలో ప్రవేశానికి ఈ టెస్ట్ రాయనవసరం లేదు. డిగ్రీ ప్రోగ్రామ్‌లకు అవివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మహిళలకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అడ్మిషన్ నాటికి అభ్యర్థులకు పాస్‌పోర్ట్ ఉండాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. థియరిటికల్, ప్రాక్టికల్, వర్క్‌షాప్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. ఇంజనీరింగ్ సైన్సెస్ సబ్జెక్టులు; షిప్ బోర్డ్ మెషినరీకి సంబంధించి మెరైన్, మెకానికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

బీఎస్సీ నాటికల్ సైన్స్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇంజనీరింగ్ మేథమెటిక్స్, ఫిజిక్స్, నాటికల్ టెక్నాలజీ, నేవిగేషన్, కార్గో ఆపరేషన్స్, షిప్ మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ సంబంధిత సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో షిప్ బోర్డ్ టూల్స్, ప్రాక్టికల్ సీమన్‌షిప్, సెయిలింగ్, బోట్ హ్యాండిలింగ్‌లపై వర్క్‌షాప్ ట్రెయినింగ్ ఉంటుంది.

డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్: ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో 120 సీట్లు ఉన్నాయి. ఇది ప్రీ సీ డెక్ క్యాడెట్ కోర్సు. ఇది పూర్తయిన తరవాత ఏడాదిన్నర వ్యవధిగల ఆన్ బోర్డ్ షిప్ ట్రెయినింగ్ ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్(ఏడీఎన్ఎస్)ను ప్రదానం చేస్తారు. తరవాత షిప్పింగ్ కంపెనీలు ఆఫర్ చేసే ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ పూర్తయినవారికి ఐఎంయూ, బీఎస్సీ(అప్లయిడ్ నాటికల్ సైన్స్) డిగ్రీని ఇస్తుంది.

వయసు: డిగ్రీ ప్రోగ్రామ్‌లకు పురుషులు 2003 సెప్టెంబరు 1 తరవాత, మహిళలు 2001 సెప్టెంబరు 1 తరవాత జన్మించి ఉండాలి. డిప్లొమాకు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్ స్థాయిలో గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, ఐఎంయూ సెట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

టీఎంఐ ఎస్ఏటీ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఎగ్జామ్. ఇందులో భాగంగా మొదట మెయిన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. తరవాత బిహేవియరల్ అసెస్‌మెంట్ ఉంటుంది. దీనికి అర్ధగంట సమయం కేటాయించారు.

- ఇంటర్వ్యూలో అభ్యర్థి ఆలోచన విధానం, పరిపక్వత స్థాయి, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ సామర్థ్యం తదితరాలు పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డీఎన్ఎస్ ప్రోగ్రామ్‌నకు ఏప్రిల్ 30; మిగిలిన ప్రోగ్రామ్‌లకు మే 31
- **వెబ్‌సైట్:** tmi.tolani.edu

ముంబయిలోని స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ- సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

ఖాళీలు 97

విభాగాలు: జనరల్, లీగల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), రీసెర్చ్, అఫీషియల్ లాంగ్వేజ్
అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 30 ఏళ్లు మించకూడదు.
ప్రారంభ వేతనం: నెలకు రూ.44,500- రూ.89,150
ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 13. ప్రకటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఏప్రిల్ 13న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది.
వెబ్‌సైట్: https://www.sebi.gov.in/



ఇండియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 146

ఇండియన్ బ్యాంక్... దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్
విభాగాలు: క్రెడిట్, ఎస్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్‌బ్యాంక్, ఈక్విటీ డీలర్ తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ/ఐసీడబ్ల్యూఏఐ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1
వెబ్‌సైట్: www.indianbank.in/

జాబ్ కార్నర్

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్స్

ఖాళీలు 7

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
1. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్): 4
2. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్): 2
3. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 1

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. షిప్ బిల్డింగ్/షిప్ రిపేర్/మెరైన్ రిపేర్/ఇంజనీరింగ్/ప్రభుత్వ కంపెనీల్లో కనీసం నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.47,000 - రూ.50,000
వయోపరిమితి: 35 ఏళ్లు మించరాదు
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12
వెబ్‌సైట్: cochinshipyard.in/

ఐఐటీఆర్‌లో టెక్నీషియన్లు

ఖాళీలు 19

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్(ఐఐటీఆర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
1. టెక్నికల్ అసిస్టెంట్: 8 పోస్టులు
2. టెక్నీషియన్: 11 పోస్టులు

విభాగాలు: కెమికల్ సైన్సెస్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/యానిమల్ హౌజ్ అండ్ జీఎల్‌పీ ఫ్యాకల్టీ/బయలాజికల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్/ఎపిడెమియాలజీ/ఇండస్ట్రియల్ రీసెర్చ్/సెన్సర్ అండ్ డివైజ్ డెవలప్‌మెంట్/ప్లంబర్/ఎలక్ట్రీషియన్/రిఫ్రిజిరేషన్- ఏసీటెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్
అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు
జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.63,312. టెక్నీషియన్ పోస్టుకు రూ.34,625.
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
వెబ్‌సైట్: https://www.csir.res.in/

టీహెచ్‌డీసీఐఎల్‌లో ఇంజనీర్ ట్రెయినీలు

ఖాళీలు 10

రిషికేశ్(ఉత్తరాఖండ్)లోని తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్(టీహెచ్‌డీసీఐఎల్).... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు గేట్-2023 స్కోరు సాధించి ఉండాలి.
వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 28 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు **వేతనం:** నెలకు రూ.50,000 - రూ.1,80,000 వరకు
ఎంపిక ప్రక్రియ: గేట్ 2023 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.600. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://thdc.co.in/en




దేశం- కజకిస్తాన్

- రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ అని పిలుస్తారు. ఇది మధ్య ఆసియాలో ఉండే దేశం. ఉత్తర, పడమర ప్రాంతాల సరిహద్దులు రష్యాతో, తూర్పు ప్రాంతం సరిహద్దు చైనాతో ఉంది. సౌతీస్ట్‌లో కిర్గిస్తాన్, దక్షిణాన ఉజ్బెకిస్తాన్ హద్దులుగా ఉన్నాయి.




- భూమి ఎక్కువగా ఉండే దేశాల్లో ఇది తొమ్మిదోది. ఈ దేశ రాజధాని ఆస్టనా. అల్‌మైటీ.. ఇదో వాణిజ్య, కల్చరల్ సిటీ.
- రెండుకోట్ల మంది మాత్రమే ప్రజలు ఉన్నారిక్కడ. ఈ దేశ పౌరులను కజక్, కజకిస్తానీ అంటారు.
- ఇక్కడ ఉజ్బెకిస్తాన్స్, పోలీస్, రష్యన్స్, కొరియన్లు, జర్మన్లు.. ఇలా 130 రకాల దేశాల పౌరులు నివసిస్తున్నారు. కజకిస్తాన్ అనే అసలు అర్థం 'లాండ్ ఆఫ్ వాండరర్స్' అని. అంటే 'భూమిపుత్రులు' అనమాట!
- 2009లో యురేనియం ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే అత్యధిక యురేనియం నిల్వలు ఇక్కడే ఉన్నాయి.
- రష్యాతో 7512 కిలోమీటర్ల సరిహద్దు ఉన్న ఈ దేశానికి సముద్ర తీరం లేదు.
- ప్రపంచంలోనే అతి పొడవైన చిమ్నీ (420 మీటర్లు) ఇక్కడే ఉంది.
- ఇది రష్యాలోని అంతర్భాగ ప్రాంతమే. 1991లో ఈ దేశం రష్యా నుంచి స్వాతంత్ర్యాన్ని పొందింది.
- హార్స్ రేసింగ్ ఇక్కడి కల్చర్‌లో ఓ భాగం. జాతీయ పానీయం గుర్రం పాలు. ఇక్కడ వైల్డ్ యాపిల్ ట్రీస్ ఉంటాయి.

ఎంత మంది పిల్లలు ఉన్నారు?




సరైన నీడ ఏది?



8 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 262

3	5		4	7	2			
		2				7		
4								2
		7	8					1
	2		7		6		8	
6					5	4		
7								4
		6				5		
			9	2	4		6	7

సుడోకు - 261 సమాధానం

3	9	6	4	2	5	8	1	7
4	5	8	7	1	9	2	6	3
1	2	7	3	6	8	5	4	9
2	8	4	6	5	7	9	3	1
5	6	1	2	9	3	4	7	8
9	7	3	8	4	1	6	2	5
7	4	5	9	3	2	1	8	6
8	1	2	5	7	6	3	9	4
6	3	9	1	8	4	7	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.